
'పారదర్శకతతో పథకాలు
అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా
సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 256

గురువారం 7-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న
తెలంగాణ టైగర్, పీపుల్స్ లీడర్, ఫైర్ బ్రాండ్
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి
హార్ధిక శుభాకాంక్షలు
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం
నర్సారెడ్డి భూపతి రెడ్డి (NBR)
టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 256

గురువారం 7-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**బుల్ రన్ కొనసాగెన్**

మూడో రోజూ కొత్త రికార్డు నమోదు 70,000 దిశగా సెన్సెక్స్ -13లో



**ఓటమితో మొదలు...**

ఇంగ్లండ్‌తో తొలి టి20 మ్యాచ్‌లో 38 రన్స్ తేడాతో ఓడిన భారత్. -12లో



**దేశాన్ని విడదీసే కుట్రలు సాగనివ్వం**

దేశాన్ని విడదీసే కుట్రలను సాగనివ్వబోమని, ఎంపీ సెంథిల్ క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి మేఘ్వాల్ వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో



**శక్తివంత జాబితాలో నిర్మల**

ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ స్థానం సంపాదించారు.

- వివరాలు 6లో



**జనాభాను పెంచండమ్మా**

కఠిన ఆంక్షలతో దేశ ప్రజలకు కన్నీరు పెట్టించే ఉత్తరకొరియా అధినేత కిమ్ కంటతడి పెట్టుకున్నారు. జనాభాను పెంచాలని కోరారు.

- వివరాలు 6లో




**రాహుల్‌కు పరిణతి లేదు**

రాహుల్‌లో చరిష్మా గానీ, రాజకీయ పరిణతి గానీ లేవని ప్రణబ్ ముఖర్జీ చెప్పినట్లు ఆయన కూతురు శర్మిష్ఠ పుస్తకంలో వెల్లడించారు.

- వివరాలు 6లో

## న్యూస్‌రీల్

### 2024 హజ్ షెడ్యూల్ విడుదల



హజ్ యాత్ర 2024 షెడ్యూల్‌ను కేంద్ర హజ్ కమిటీ విడుదల చేసింది. ఈ మేరకు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి హజ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం బుధవారం ప్రారంభించారు.

- వివరాలు 14లో

### ఒక్క ఫైల్ బయటకు పోవద్దు!



ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ పాలన బాధ్యతలు చేపట్టే వరకు సచివాలయం నుంచి ఒక్క ఫైలు కూడా బయటకి వెళ్లడానికి వీల్లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్ని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే బయటి నుంచి కూడా ఒక్క ఫైలు లోపలికి రావద్దని స్పష్టం చేశారు.

- వివరాలు 14లో

### తొలి ఉద్యోగం దివ్యాంగురాలు రజనికే



అసెంబ్లీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసి అధికారంలోకి వస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో దివ్యాంగురాలు రజనీకి తొలి ఉద్యోగం రానుంది. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆమెకు ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేయనున్నారు.

- వివరాలు 2లో

### 'అట్లూరి' మామూలోడు కాదు!



హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టు అయిన తెలుగు సినీ నిర్మాత అట్లూరి నారాయణరావుకు టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నట్టు వెలుగులోకి వచ్చింది. తనకు చంద్రబాబు, లోకేశ్‌తో సైతం సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు నారాయణరావు చెప్పుకునే వాడని తెలిసింది.

- వివరాలు 14లో



# భట్టికి రెవెన్యూ.. ఉత్తమ్‌కు ఆర్థికం?





**కాంగ్రెస్ సర్కారులో పలువురు సీనియర్లకు కీలక శాఖలు**

**ఎల్బీ స్టేడియంలో రేవంత్‌తోపాటు మరో 12 మంది ప్రమాణ స్వీకారం..**

- జాబితాలో దామోదర, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ఉన్నట్టు చర్చ
- కోమటిరెడ్డి, పొంగులేటికి కూడా ఖాయమంటున్న గాంధీభవన్ వర్గాలు
- మంత్రి పదవుల కోసం పోటీపడుతున్న 24 మంది ఎమ్మెల్యేలు
- పార్టీలో, ఇతర పదవుల్లో ఉన్న ఆశావహులు మరో ముగ్గురికిపైనే..
- మంత్రిగా చాన్స్ ఖాయమైన నేతల్లో వివిధ శాఖల కోసం పోటీ
- రెవెన్యూ, ఆర్థిక, హోం తదితర శాఖలకు ఫుల్ డిమాండ్..

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో అధికారం చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ కూర్పు కీలకంగా మారింది. ఎక్కువ మంది సీనియర్లు ఉండటం, ప్రాధాన్య శాఖల కోసం పోటీపడుతుండటంతో ఉత్కంఠ నెలకొంది. పలువురు సీనియర్లకు మంత్రులుగా అవకాశం ఖాయమైనా.. వారికి కేటాయించే శాఖలేమిటనేది ఇంకా తేలలేదు. బుధవారం అర్ధరాత్రి వరకు ఉన్న సమాచారం ప్రకారం.. సీఎంగా రేవంత్, మంత్రులుగా మరో 12 మంది వరకు ప్రమాణం చేస్తారని తెలిసింది. ఈ జాబితాలో సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో భట్టికి రెవెన్యూ, ఉత్తమ్‌కు ఆర్థికశాఖ ఇవ్వవచ్చని.. మరో సీనియర్ నేతకు హోంశాఖ ఇవ్వనున్నారని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. కానీ పక్కాగా స్పష్టత రావడం లేదు.

### తొలి రోజున ప్రమాణం చేసేది ఎందరు?

వాస్తవానికి గురువారం రేవంత్‌రెడ్డి ఒక్కరే ప్రమాణం చేస్తారని తొలుత ప్రచారం జరిగింది. కానీ తర్వాత సంఖ్య పెరుగుతూ వచ్చింది. రేవంత్‌తోపాటు ఐదుగురు అని ఓసారి, ఆరుగురు అని మరోసారి, మొత్తం తొమ్మిది మంది ప్రమాణ స్వీకారం చేస్తారని ఇంకోసారి వార్తలు వచ్చాయి. చివరిగా 12 మంది వరకు తొలిరోజునే ప్రమాణం చేయనున్నట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో పూర్తిస్థాయి మంత్రివర్గం కొలువుదీరకపోతే.. మిగతావారు ఈనెల 9న, లేదా మరో రోజున ప్రమాణం చేస్తారని వివరించాయి.

### కొందరు సీనియర్ల శాఖలు ఢిల్లీలోనే ఖాయం

రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కాకుండా 17 మంది మంత్రులను నియమించే వెసులుబాటు ఉంది. కాంగ్రెస్ తరఫున గెలిచిన వారిలో 24 మంది ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. పార్టీలో సీనియర్లు, ఇతర కోటాల్లో మరో ముగ్గురికిపైనే నేతలు మంత్రి పదవుల పోటీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కేబినెట్ బెర్తుల కోసం అటూఇటూగా 30మంది వరకు పేర్లను పరిశీలించిన ఏఐసీసీ.. పలువురిని మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న దానిపై రేవంత్‌కు దిశానిర్దేశం చేసిందని, రేవంత్ విచక్షణ మేరకు మరికొందరిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉందని సమాచారం. దీనితోపాటు కొందరు సీనియర్లకు శాఖల కేటాయింపుపై

మిగతా 2వ పేజీలో ▶



బుధవారం ఢిల్లీలో సోనియా గాంధీని కలిసిన రేవంత్‌రెడ్డి

# నేడే పట్టాభిషేకం..

- మధ్యాహ్నం 1.04 గంటలకు సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం
- ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- వేడుక కోసం ఎల్బీ స్టేడియంలో భారీగా ఏర్పాట్లు
- ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం
- ఆరు గ్యారంటీల అమలు ఫైల్‌పై రేవంత్ తొలి సంతకం చేసే చాన్స్
- మధ్యాహ్నం 3 గంటలకు సీఎంగా సచివాలయంలోకి ఎంట్రీ
- భారీస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి సర్వం సిద్ధమైంది. కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతగా ఎన్నికైన రేవంత్‌రెడ్డితో గురువారం మధ్యాహ్నం 1.04 గంటలకు గవర్నర్ తమిళిసై ప్రమాణ స్వీకారం చేయిస్తారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం జరగనుంది. ప్రమాణ స్వీకారం అనంతరం రేవంత్ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు, ఇతర హామీల అమలుపై ప్రకటన చేయనున్నారు. ఈ వేదికపైనే ఆయా గ్యారంటీలకు సంబంధించిన ఫైల్‌పై రేవంత్ సీఎంగా తొలి సంతకం చేసే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.

**పకడ్బందీగా ఏర్పాట్లు:** సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం కోసం ఎల్బీ స్టేడియంను ముస్తాబు చేశారు. భారీ వేదికను

మిగతా 2వ పేజీలో ▶

### ప్రమాణ స్వీకారానికి సోనియా, రాహుల్

ఢిల్లీలో వారిని స్వయంగా కలసి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి -2లో

### మా నాయకుడు రేవంత్‌రెడ్డి

- సీఎల్పీ నేతగా ఎన్నుకున్న తీర్మానాన్ని రాజ్‌భవన్‌లో అందజేసిన టీపీసీసీ నేతలు
- హోటల్ ఎల్లాలోనే సంతకాల సేకరణ పూర్తి

- వివరాలు 2లో

# పంట.. నీటిపాలు

- అనేక జిల్లాల్లో వరి, పత్తి, మిర్చి పంటలకు నష్టం
- కోతకొచ్చిన వరి.. గాలి వానలకు నేలకొరిగింది
- నష్టంపై అంచనా వేస్తున్న వ్యవసాయశాఖ

సాక్షి, హైదరాబాద్/ఖమ్మంవ్యవసాయం/సూపర్‌బజార్(కొత్తగూడెం): వర్షాలతో చేతికొచ్చిన పంటలన్నీ నేలపాలయ్యాయి. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి, మిర్చితోపాటు టమాటా, వంగ, బీర, బెండ తోటలు కూడా దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఉన్న వరి తడిసిపోవడంతో మొలకలొచ్చే పరిస్థితి ఏర్పడింది. కల్లాల్లో ఉన్న మిర్చి తడిసి నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న వరి పంట కూడా నేల రాలింది. నష్టంపై వ్యవసాయశాఖ అంచనా వేస్తోందని అధికారులు చెబుతున్నారు.



ఖమ్మం జిల్లా మేడేపల్లిలో తుపాను ధాటికి నేల వాలిన వరి పనలను చూస్తున్న రైతు పోతునూక వెంకటయ్య

### రంగుమారుతున్న పత్తి..

ప్రస్తుతం పత్తి తీతలు కొనసాగుతున్నాయి. ఈదురుగాలులు, వానలతో పత్తి నేలరాలిపోతోంది. రంగు మారి నాణ్యత కోల్పోతుండగా, కాయలోకి నీరు దిగి పత్తి నల్లబడుతోంది. పత్తి తీతకు కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. కూలీల ఖర్చు కూడా పెరుగుతుంది. వర్షానికి తడిసిన పత్తి బరువు కూడా తగ్గుతుంది. ఇక పత్తిలో ఉన్న గింజ మొలకెత్తే అవకాశం కూడా ఉంది. ప్రస్తుతం రెండో తీతలో ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు చేతికందే దశలో ఉంది. తుపాను కారణంగా ఈ పత్తి చేతికందుతుందా లేదా అనేది రైతుల్లో ఆందోళనగా ఉంది. ఒకవేళ తుపాను ప్రభావం తగ్గినా ప్రస్తుత పరిస్థితుల్లో చేతికందే పత్తి బరువు తగ్గి 4 క్వింటాళ్లకు ఒక క్వింటా నష్టం జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

### నేలవాలుతున్న వరి..

వానకాలం వరి కోతలు సగమే పూర్తయ్యాయి. ఇంకా ఆయా జిల్లాల్లో కోతలు కొనసాగుతున్నాయి. వరి కోత, నూర్పిడి దశలో ఉంది. పలు ప్రాంతాల్లో ధాన్యం కల్లాల్లో ఆరబెడుతున్నారు. కోత దశలో ఉన్న వరి ఈదురుగాలులు, తుపాను కారణంగా కంకి బరువుకు

మిగతా 10వ పేజీలో ▶

# రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు?

- లోక్‌సభ ఎన్నికల దాకా కొనసాగేందుకు కిషన్‌రెడ్డి విముఖత?
- అసెంబ్లీ ఎన్నికల వరకే ఉంటానని ముందే స్పష్టీకరణ
- ఫలితాలు నిరాశ పరచడం కూడా కారణం!
- సొంత నియోజకవర్గాన్ని చక్కదిద్దుకోవాలనే ఆలోచన
- మళ్లీ బండి సంజయ్ లేదా ఈటల లేదా అర్వింద్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీకి త్వరలోనే కొత్త సారథి రాబోతున్నారా? ఈ ప్రశ్నకు పార్టీవర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, గతంలో బండి సంజయ్ స్థానంలో నియమితులైనప్పుడే..అసెంబ్లీ ఎన్నికలు ముగిసేదాకే ఈ బాధ్యతలు నిర్వహిస్తానని జాతీయ నాయకత్వానికి స్పష్టం చేసినట్టు సమాచారం. అందుకు జాతీయ నాయకత్వం కూడా సానుకూలంగా స్పందించిందని చెబుతున్నారు. కాగా నాయకత్వం ఒత్తిడి మేరకు అప్పట్లో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి, ఇటీవలి ఎన్నికల ఫలితాల దృష్ట్యా కూడా..లోక్‌సభ ఎన్నికల దాకా కొనసాగేందుకు

మిగతా 3వ పేజీలో ▶

# వచ్చే ఏడాది గిరిజన వర్సిటీ షురూ!

- పార్లమెంటులో బిల్లు, గెజిట్ విడుదల
- వచ్చే నెలలో రాష్ట్రానికి కేంద్ర బృందం
- మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్ల పరిశీలన
- అన్నీ సవ్యంగా జరిగితే 2023–24 నుంచే అందుబాటులోకి..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ప్రారంభానికి మార్గం సుగమమైంది. సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యా లయం ఏర్పాటు బిల్లును తాజాగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంటులో ప్రవేశపెట్టగా.. ఇందుకు సంబంధించిన గెజిట్‌ను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ నేపథ్యంలో అవసరమైన అనుమతులు, ఇతర ఏర్పాట్లన్నీ వేగంగా పూర్తయితే వచ్చే విద్యా సంవత్సరం (2023–24) నుంచే వర్సిటీ అందుబాటులోకి రానుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చట్టంలోనే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటును నిర్దేశించినప్పటికీ వివిధ కారణాలతో పదేళ్లుగా జాప్యం అవుతూ వచ్చింది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 4 సంవత్సరాల క్రితమే భూకేటాయింపులు పూర్తి చేసి గిరిజన సంక్షేమ శాఖకు స్వాధీనం చేసింది. తాత్కాలిక అవస రాల కోసం భవనాలను కూడా కేటాయించింది. అనంతరం నిర్వహణ బాధ్యతలను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి

మిగతా 3వ పేజీలో ▶

## ఇవాంజూత్




# ఇక 'పంచాయతీ' సమరం!

**ఫిబ్రవరి 1తో ముగియనున్న పాలకమండళ్ల పదవీకాలం.. సన్నాహాలు మొదలుపెట్టిన రాష్ట్ర ఎన్నికల సంఘం**

**త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు.. ఈ నెల 30 లోగా అధికారుల నియామకానికి ఆదేశాలు**




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమరం ముగిసింది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమౌతోంది. ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగియనున్న నేపథ్యంలో.. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిమగ్నమైంది. రాజ్యాంగం ప్రకారం పంచాయతీరాజ్ (పీఆర్) సంస్థల ఐదేళ్ల పదవీకాలం ముగియడానికి ముందే, నూతన తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పీఆర్ సంస్థల టర్మ్ ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు పూర్తిచేయాల్సి ఉంటుంది. దీంతో జనవరిలో లేదా ఫిబ్రవరిలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అనుమతినివ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల షెడ్యూల్‌తో సహా ప్రతిపాదనలు పంపించనున్నట్టు ఎస్ఈసీ వర్గాలు వెల్లడించాయి. దాదాపు నెల రోజుల పాటు ఈ ఎన్నికల ప్రక్రియ సాగనుంది. అయితే వచ్చే మార్చి, ఏప్రిల్‌లలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశాలుండటం, ఆ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాల్సి ఉన్నందున ఈలోగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదనే వాదన కూడా వినిపిస్తోంది.

### కొత్త సర్కార్ కుదరదంటుందా?

పంచాయతీ ఎన్నికల తేదీలపై తుది నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిది కావడంతో, వెంటనే మరో ఎన్నికల సమరానికి కొత్త ప్రభుత్వం మొగ్గు చూపక పోవచ్చునేనే అభిప్రాయాన్ని ఉన్నతాధికారులు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని, ఉప కులాల వారీగా కూడా రిజర్వేషన్లు ఇస్తామని, ఆరు నెలల్లో దీనికి సంబంధించి బీసీ కమిషన్ నివేదిక తెప్పించుకున్నాక తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని బీసీ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిఉంది. అయితే ఈ ప్రక్రియ పూర్తవడానికి కొంత సమయం పట్టొచ్చునని అంచనా వేస్తున్నారు.

### వరుసగా జీపీ, ఎంపీపీ, జెడ్పీపీ, మున్సిపల్ పోల్స్

రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలుత గ్రామ పంచాయతీ (జీపీ), ఆ తర్వాత కొన్ని నెలలకే మండల, జిల్లా ప్రజా పరిషత్ (ఎంపీపీ, జెడ్పీపీ), మరి కొన్ని నెలల తర్వాత

మిగతా 5వ పేజీలో ▶

# కశ్మీర్ అసెంబ్లీలో పీఓకేకు 24 సీట్లు!

- పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదే
- అందుకే 'రిజర్వ్' నిర్ణయం: అమిత్ షా
- రెండు బిల్లులకు లోక్‌సభ ఆమోదం



జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతానికి 24 సీట్లు రిజర్వు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది! పీఓకే కూడా మన భూభాగమే కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ మేరకు జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ), రిజర్వేషన్ (సవరణ) బిల్లులను బుధవారం ఆయన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆరు గంటల పై చిలుకు చర్చ అనంతరం సభ వాటిని ఆమోదించింది. అసెంబ్లీలో సీట్లను పెంచడంతో పాటు పలు కీలక అంశాలు ఈ బిల్లుల్లో ఉన్నాయి. ''పాక్ ఆక్రమిత కశ్మీర్ కూడా భారత్‌లో అంతర్భాగమే. కనుక అక్కడ కూడా 24 స్థానాలను అసెంబ్లీలో రిజర్వు చేశాం'' అని అమిత్ షా చెప్పారు.

- వివరాలు 6లో

## క్లుప్తంగా...

### ఓయూలో త్వరలో లక్ష మందితో రేవంత్‌కు సన్మానం



సాక్షి, హైదరాబాద్: నూతన సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న రేవంత్‌రెడ్డికి ఓయూలో లక్ష మందితో భారీ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఉస్మానియా యూనివర్సిటీ నేత చనగాని దయాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తితో కాంగ్రెస్ గెలుపు కోసం నిరుద్యోగ యువత గ్రామాల్లో ప్రచారం చేసిందని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి స్ఫూర్తితో తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిందని తెలిపారు. ప్రజల పక్షాన పోరాడిన రేవంత్‌రెడ్డికి సన్మానం చేయాల్సిన బాధ్యత నిరుద్యోగ యువతకు ఉందని స్పష్టం చేశారు.

### రేవంత్ నియామకంపై దివ్యాంగుల సంబరాలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ఖరారు చేయడంపై తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కమిషనరేట్ ఆవరణలో దివ్యాంగులు సంబరాలు చేసుకున్నారు. టీపీసీసీ వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొందని, ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఉచిత ప్రయాణ సౌకర్యం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, వికలాంగుల హక్కుల చట్టం అమలు సాకారం కానుందన్నారు. తొమ్మిదేళ్లుగా దివ్యాంగులు తీవ్ర అణిచివేతకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో వారికి తగిన ప్రాధాన్యం దక్కుతుందని వీరయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

### రేవంత్‌కు ఉపాధ్యాయ సంఘాల అభినందన

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్న రేవంత్ రెడ్డికి పలు ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలిపాయి. శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి, డీటీఎఫ్ అధ్యక్షుడు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, పీఆర్‌టీయూ నేత ఎం.చెన్నయ్య, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజాభాను చంద్ర ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్.రాజు గంగారెడ్డి, టీఎస్‌టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ, సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు దాముక కమలాకర్ ఉన్నారు.

### మంత్రివర్గంలో సామాజిక న్యాయం పాటించాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కాను న్న మంత్రివర్గంలో సామా జిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరు ప్రకటించడం హర్షణీయమని, ఉప ముఖ్యమంత్రి పదవిని దళితులతో పాటు బీసీకి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీని కోరారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, మైనార్టీలకు ఉప ముఖ్య మంత్రి పదవులు ఇచ్చి బీసీలను పూర్తిగా విస్మరించారని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ బీసీలకు చేసిన అన్యాయం వల్లే బీఆర్‌ఎస్ పార్టీ ఓటమిపాలైందని స్పష్టం చేశారు.

### కాంగ్రెస్ అంటే ఉసిరి కాయల మూట

కడియం శ్రీహరి



జనగామ: 'బీఆర్‌ఎస్‌కు తక్కువ సీట్లేమీ రాలేదు.. ఎంఐఎం, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్షాలతో కలుపుకుంటే 54 సీట్లు. కాంగ్రెస్ అనేది ఉసిరికాయల మూట. ఆ ముడి విప్పితే అందులో ఉన్న కాయలు ఎటు వైపు పోతాయో తెలియదు' అని జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దివంగత జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి సంతాప సభలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 39 సీట్లు వచ్చాయని, ఎంఐఎంకు 7, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, అన్నీ కలుపుకుంటే ప్రతిపక్షంలో 54 సంఖ్య ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, లేనిపక్షంలో కష్టాలు తప్పవని కాంగ్రెస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సింహం రెండడుగులు వెనక్కు వేసిందంటే పొజిషన్ తీసుకొని జంప్ చేయడానికేనని, బీఆర్‌ఎస్ కేడర్ కొంతకాలం ఓపిక పడితే.. కేసీఆర్ కదన రంగంలోకి తిరిగి రావడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏడాదిలోగా రాజకీయ పరిణామాలు పూర్తిగా మారిపోతాయని, కార్యకర్తలు సహనంతో ఉంటే అదేంటో చూస్తారన్నారు.

# ప్రమాణ స్వీకారానికి సోనియా, రాహుల్

- ఢిల్లీలో వారిని స్వయంగా కలసి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి
- కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్‌లతోనూ భేటీ
- తర్వాత పార్లమెంట్‌కు వెళ్లిన రేవంత్‌రెడ్డి.. శుభాకాంక్షలు తెలిపిన వివిధ పార్టీల ఎంపీలు
- తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటవుతోందంటూ ఖర్గే, రాహుల్ ట్వీట్లు



బుధవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీ, ప్రియాంకలను కలసిన రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక, ఇతర కీలక నేతలు తరలి రానున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ప్రియాంక, 10:30 గంటలకు సోనియా, రాహుల్‌లు హైదరాబాద్‌కు చేరుకుంటారని గాంధీ భవన్ వర్గాలు తెలిపాయి. వారు విమానాశ్రయం నుంచి నేరుగా తాజ్‌కృష్ణా హోటల్‌కు వెళ్లి కాసేపు విశ్రాంతి తీసుకున్నాక ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారని వెల్లడించాయి.

**స్వయంగా ఆహ్వానించిన రేవంత్**

సీఎల్పీ నేతగా ఎన్నికైన తర్వాత మంగళవారం రాత్రి ఢిల్లీ వెళ్లిన రేవంత్ బుధవారం అంతా బిజిబిజీగా గడిపారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఖర్గేలతో.. సోనియా, రాహుల్, ప్రియాంకాగాంధీ, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హరియాణా ఎంపీ దీపేందర్‌సింగ్ తదితరులతో విడివిడిగా భేటీ అయ్యారు. గురువారం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అంతకుముందు ఉదయమే ఏపీలోని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు యమునా బ్లాక్‌లోని రేవంత్ నివాసానికి వచ్చి కలిశారు. వారు ఇరవై నిమిషాల పాటు ఏకాంతంగా చర్చించుకున్నారు. చర్చల విషయాన్ని బయటికి వెల్లడించలేదు.

**పార్లమెంట్‌లో అభినందనల వెల్లువ**

కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీల తర్వాత రేవంత్ పార్లమెంట్‌కు వెళ్లారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అక్కడి నుంచి లోక్‌సభలోకి వెళ్లిన రేవంత్‌కు వివిధ పార్టీల ఎంపీలు శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత రాజ్యసభ హౌస్ కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ చాంబర్‌కు వెళ్లగా.. టీడీపీ ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, రామ్మోహన్‌నాయుడు, ఎంపీ రఘురామకృష్ణరాజు, వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు నిరంజన్‌రెడ్డి, శ్రీధర్, ఇతర పార్టీల ఎంపీలు రేవంత్‌ను అభినందించారు. స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆ ఎంపీలందరినీ తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని రేవంత్ ఆహ్వానించారు. పార్లమెంటుకు వెళ్లిన సమయంలో రేవంత్ తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తారని భావించినా చేయలేదు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక.. ఢిల్లీకి వచ్చి ఎంపీ పదవికి రాజీనామా చేస్తారని తెలిసింది.

**ప్రజా ప్రభుత్వం వస్తోందంటూ ఖర్గే, రాహుల్ ట్వీట్లు**

బుధవారం ఢిల్లీలో రేవంత్‌రెడ్డి తమను కలిసిన ఫొటోలను ఖర్గే, రాహుల్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం వస్తోందని పేర్కొన్నారు. ప్రజా తెలంగాణ కోసం కాంగ్రెస్ నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాము హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని ఖర్గే పేర్కొనగా.. రేవంత్ నాయకత్వంలో వాగ్దానాలన్నీ నెరవేర్చుతామని రాహుల్ తెలిపారు.

**రేవంత్‌కు ఘన స్వాగతం**

అధిష్టానం పెద్దలను కలసిన అనంతరం రేవంత్ బుధవారం రాత్రి 10:20 గంటల సమయంలో ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు సీఎస్, డీజీపీ, ఇతర అధికారులు, కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి రేవంత్ నేరుగా హోటల్ ఎల్లాకు చేరుకున్నారు.

## మీ ఆశీస్సులతోనే ప్రజా ప్రభుత్వం

**నా ప్రమాణ స్వీకారానికి అందరూ రండి: రేవంత్‌రెడ్డి**

సాక్షి, హైదరాబాద్: సీఎంగా తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని సీఎల్పీ నేత ఎనుముల రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. "తెలంగాణ ప్రజలకు అభినందనలు. విద్యార్థుల పోరాటం, అమరుల త్యాగం, సోనియాగాంధీ ఉక్కు సంకల్పంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో మనందరి ఆకాంక్షలు నెరవేర్చే ఇందిరమ్మ రాజ్య స్థాపనకు సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య, పారదర్శక పాలన అందించేందుకు.. బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనార్టీ, రైతు, మహిళ, యువత సంక్షేమ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు.. మీ అందరి ఆశీస్సులతో 2023 డిసెంబర్ 7న మధ్యాహ్నం 1:04 గంటలకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయబోతోంది. ఈ మహోత్సవానికి రావాల్సిందిగా మీ అందరికీ ఇదే ఆహ్వానం.." అంటూ బుధవారం బహిరంగ ఆహ్వాన లేఖను విడుదల చేశారు.

**కేసీఆర్, చంద్రబాబులకు పిలుపు!**

రేవంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాల్సిందిగా పలువురు జాతీయ నాయకులు, సీఎంలు, మాజీ సీఎంలకు టీపీసీసీ నుంచి ఆహ్వానాలు వెళ్లాయి. మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ సీఎం చంద్రబాబులను రేవంత్ ఆహ్వానించారని గాంధీ భవన్ వర్గాల సమాచారం. వీరితోపాటు 'ఇండియా' కూటమిలోని 8 మంది సీఎంలు, కాంగ్రెస్‌కు చెందిన 51 మంది ఎంపీలకూ ఆహ్వానం పంపినట్టు తెలిసింది. రాష్ట్ర కాంగ్రెస్‌లోని పలువురు సన్నిహిత నేతలు, సీనియర్ నాయకులకు రేవంత్ స్వయంగా ఫోన్లు చేసి రావాలని కోరారని.. తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, ప్రజాసంఘాల నాయకులనూ ఆహ్వానించామని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

# భట్టికి రెవెన్యూ.. ఉత్తమ్‌కు ఆర్థికం?

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలోనే స్పష్టత వచ్చిందని.. డిప్యూటీ సీఎం హోదాలో భట్టి విక్రమార్కకు రెవెన్యూ శాఖ, ఉత్తమ్‌కు ఆర్థిక శాఖ ఇవ్వనున్నారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ రెండు శాఖలతోపాటు హోంశాఖ కోసం పలువురు సీనియర్లు పోటీపడుతున్నారని తెలిసింది. దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబులకూ కీలక శాఖలు దక్కనున్నట్టు సమాచారం. అధిష్టానం సూచనలకు అనుగుణంగా.. ప్రమాణ స్వీకారం తర్వాత సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఆయా మంత్రులకు శాఖలను కేటాయిస్తారు.

**మంత్రి పదవుల రేసులో ఉన్నది వీరే..**

మంత్రి పదవుల కోసం సీనియర్లతోపాటు కొందరు జూనియర్ ఎమ్మెల్యేలు కూడా వివిధ కోటాల కింద పోటీ పడుతున్నారు. సామాజికవర్గాల ప్రాతిపదికన జూనియర్లను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి రావడంతో ఈ జాబితా పెరిగిపోయింది. సీనియర్ల జాబితాలో.. భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రేమ్‌సాగర్‌రావు, సుదర్శన్‌రెడ్డి జి.వివేక్, జి.వినోద్, తుమ్మల నాగేశ్వర్‌రావు, దొంతి మాధవరెడ్డి, బాలూ నాయక్, టి.రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, జూపల్లి కృష్ణారావు ఉన్నారు. జూనియర్ల జాబితాలో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన ఆది శ్రీనివాస్, ఈర్ల శంకర్, వాకిటి శ్రీహరి, బీర్ల అయిలయ్యల పేర్లున్నాయి. వీరితోపాటు అద్దంకి దయాకర్, షబ్బీర్‌అలీ, బలరాం నాయక్ తదితరులు సామాజిక వర్గాలు, ఇతర కోటాల్లో మంత్రి పదవి ఆశిస్తున్నట్టు తెలిసింది. వీరిలో ఎవరెవరికి మంత్రులుగా అవకాశం వస్తుంది? వారిలో గురువారం ఎందరు ప్రమాణ స్వీకారం చేస్తారు? ఎవరెవరికి ఏయే శాఖలు కేటాయించనున్నారన్నది గురువారం తేలిపోనుంది.



బుధవారం రాత్రి బేగంపేట విమానాశ్రయంలో రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న సీఎస్, డీజీపీ

**కేబినెట్‌పై ఢిల్లీలో మల్లగుల్లాలు**

రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి ఢిల్లీలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, ఏఐసీసీ పరిశీలకుడు డీకే శివకుమార్‌తో మంత్రివర్గ కూర్పుపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. సీనియర్లు ఉత్తమ్, భట్టి తదితరులు వెలిబుచ్చిన అభిప్రాయాలను ఈ సందర్భంగా రేవంత్‌కు డీకే వివరించినట్టు తెలిసింది. తర్వాత బుధవారం ఉదయం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో రేవంత్ జరిపిన భేటీల్లోనూ మంత్రి పదవులపై చర్చించినా.. ఓ నిర్ణయానికి రాలేకపోయినట్టు సమాచారం. రేవంత్ హైదరాబాద్‌కు వచ్చేందుకు బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. కానీ మధ్యలో ఉండగానే అధిష్టానం పెద్దల పిలుపు మేరకు వెనక్కి వెళ్లారు. మహారాష్ట్ర సదన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో భేటీ అయి అరగంటకుపైగా చర్చించారు. మరోవైపు ఢిల్లీలోనే డీకే శివకుమార్‌తో ఉత్తమ్, భట్టి, జి.వినోద్, శ్రీధర్ బాబు, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు విడివిడిగా భేటీ అయ్యారు. తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని, ప్రాధాన్య శాఖలు కేటాయించాలని కోరారు.

**రేవంత్‌ను కలవని సీనియర్లు!:** మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం దాకా ఢిల్లీలోనే ఉన్న రేవంత్‌రెడ్డి ఓవైపు.. ఉత్తమ్, భట్టి, శ్రీధర్‌బాబు తదితర సీనియర్లు మరోవైపు ఏఐసీసీ పెద్దలతో భేటీలు జరిపారు. కానీ సీనియర్లు ఎవరూ కూడా రేవంత్‌ను కలవలేదు. ఆయన అధిష్టానం పెద్దలను కలసినప్పుడూ వారు దూరంగానే ఉండటం చర్చనీయాంశంగా మారింది.

# నేడే పట్టాభిషేకం..





ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎస్ శాంతికుమారి. ముస్తాబైన ఎల్బీ స్టేడియం

▶ మొదటి పేజీ తరువాయి

సిద్ధం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, టీపీసీసీ సీనియర్ నేతలు వేదికపై ఆసీనులు కానున్నారు. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్టు టీపీసీసీ వర్గాలు తెలిపాయి. కాగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం డీజీపీ రవిగుప్తాతో కలసి ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ఇతర ప్రముఖులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా అన్నీ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేడియంలో తాగునీరు, ఇతర సౌకర్యాలన్నీ కల్పించాలని సూచించారు. వివిధ రాష్ట్రాల సీఎంలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొంటున్న నేపథ్యంలో వారి కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను సిద్ధం చేయాలని.. వాహనాల పార్కింగ్, బందోబస్తు విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**మధ్యాహ్నం సచివాలయానికి రేవంత్**

ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిశాక రేవంత్‌రెడ్డి నేరుగా సచివాలయానికి చేరుకుని.. తన చాంబర్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర సీనియర్ ఐఏఎస్ అధికారులతో సమావేశమై రాష్ట్రంలో పాలన పరిస్థితులు, ఇతర అంశాలపై సమీక్షించే అవకాశం ఉంది.

**ప్రమాణ స్వీకారానికి డి.రాజా**

రేవంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సీనియర్ నేతలు కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, చాడ వెంకటరెడ్డి తదితరులు హాజరుకానున్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ వివరాలు వెల్లడించారు.

**కట్టుదిట్టంగా భద్రత.. ట్రాఫిక్ ఆంక్షలు**

ఎల్బీ స్టేడియంలో రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం, తర్వాత సచివాలయానికి వెళ్లనుండటం నేపథ్యంలో పోలీసు శాఖ కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా పెట్టింది. గురువారం ఉదయం నుంచే ఎల్బీ స్టేడియం, సచివాలయం పరిసరాల్లో సుమారు 2వేల మంది పోలీసులను మోహరించనున్నారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసం నుంచి ఎల్బీ స్టేడియం రూట్ పార్టీని ఏర్పాటు చేస్తున్నారు. బందోబస్తుపై బలగాలు బుధవారం మధ్యాహ్నమే రిహార్సల్స్ పూర్తి చేశాయి. ఆయా ప్రాంతాల్లో నిఘా, తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇక గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయనున్నారు.

# మా నాయకుడు రేవంత్‌రెడ్డి



తీర్మాన ప్రతిని గవర్నర్ కార్యదర్శికి అందజేస్తున్న మల్లు రవి, మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నాయకుడిగా రేవంత్‌రెడ్డిని ఎన్నుకుంటూ చేసిన తీర్మానాన్ని టీపీసీసీ నేతలు గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో మాజీ ఎంపీ మల్లురవి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు బుధవారం రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఎల్లా హోటల్‌లో ఎమ్మెల్యేల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన లేఖను, సీఎల్పీ తీర్మాన ప్రతిని గవర్నర్ కార్యదర్శి సురేంద్రమోహన్‌కు అందజేశారు. తర్వాత మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల ఏడో తేదీన మధ్యాహ్నం 1:04 గంటలకు ఎల్బీ స్టేడియంలో నూతన సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయాలని కోరామని.. తమ విజ్ఞప్తి మేరకు ఏర్పాట్లు చేస్తామని గవర్నర్ చెప్పారని వివరించారు.

## ఉద్యమకారులకు కీలక బాధ్యతలు!

- కోదండరాంకు నియామకాలు, గాదె ఇన్నయ్యకు ప్రణాళిక..
- ఆకునూరి మురళికి విద్య, సంక్షేమ రంగాల్లో ప్రణాళికలు రూపొందించే బాధ్యతలు!
- గత ప్రభుత్వంలో వైఫల్యాల దిద్దుబాటుపై కొత్త సర్కారు దృష్టి

సాక్షి,నెట్‌వర్క్: రాష్ట్రంలో కొలువుదీరుతున్న కొత్త ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులు, మేధావులకు కీలక స్థానాలు అప్పగించే అవకాశం కనిపిస్తోందని పరిశీలకులు చెపుతున్నారు. గడిచిన పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ.. తన పాలనలో ప్రత్యేక ముద్ర వేసే దిశగా పావులు కదపనుంది. ముఖ్యంగా టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్ తదితరులకు కీలక స్థానాలు ఇచ్చే అవకాశం కనిపిస్తోందని చెబుతున్నారు. కోదండరాంకు తెలంగాణ నియామకాలు, గాదె ఇన్నయ్యకు తెలంగాణ ప్రణాళిక, ఆకునూరి మురళికి విద్య, సంక్షేమ రంగాల్లో గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న వైఫల్యాలను గుర్తించి దిద్దుబాటుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించే బాధ్యతలను అప్పగించే దిశగా చర్చ సాగుతోందని అంటున్నారు. విస్తృత చర్చ అనంతరం వీలైనంత త్వరగా ఉద్యమకారులకు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం.

## తొలి ఉద్యోగం దివ్యాంగురాలు రజనీకే

- నెలన్నర క్రితం టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో మాటిచ్చిన రేవంత్‌రెడ్డి
- నేడు సీఎంగా ఆ హామీని నెరవేర్చేందుకు ఏర్పాట్లు
- ఎల్బీ స్టేడియం కార్యక్రమానికి రావాలని ఆమెకు ఆహ్వానం



రజనీ

నాంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసి అధికారంలోకి వస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో దివ్యాంగురాలు రజనీ (38)కి తొలి ఉద్యోగం రానుంది. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆమెకు ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేయనున్నారు. ఈ మేరకు గురువారం ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని రజనీకి ఆహ్వానం అందింది.

**గాంధీభవన్‌కు వచ్చి గోడు చెప్పుకోవడంతో..**

హైదరాబాద్‌లో నాంపల్లి నియోజకవర్గం పరిధిలోని న్యూబోయిగూడ కమాన్ ప్రాంతానికి చెందిన దివ్యాంగురాలు రజనీ (38) ఎంఏ పూర్తి చేశారు. ఎంతగా ప్రయత్నించినా ఉద్యోగం రాకపోవడంతో.. తన తండ్రి వెంకటస్వామితో కలసి అక్టోబర్ 17న కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం గాంధీ భవన్‌కు వచ్చారు. టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డిని కలసి గోడు వెళ్లబోసుకున్నారు. తన వైకల్యం వల్ల ప్రైవేట్ సంస్థల్లో ఎక్కడా ఉద్యోగం ఇవ్వలేదని వివరించారు. ఆమె బాధ విన్న రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తొలి ఉద్యోగం ఆమెకే ఇస్తామని మాటిచ్చారు. అన్నట్టుగానే కాంగ్రెస్ గెలిచి అధికారం చేపడుతుండటంతో.. రేవంత్ తన మాటను గుర్తుపెట్టుకుని, ప్రమాణ స్వీకార సభకు రావాలని రజనీకి ఆహ్వానం పంపారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. సీఎం హోదాలో అభయ హస్తం పథకం కింద రజనీకి తొలి ఉద్యోగం ఇచ్చే ఫైల్‌పై రేవంత్ సంతకం పెట్టనున్నారని వెల్లడించాయి. దీనిపై రజనీకి ఫోన్ చేసి సంప్రదించగా.. తనకు ఆహ్వానం అందిందని, గురువారం ఎల్బీ స్టేడియం సభకు వెళ్తున్నానని ఆమె చెప్పారు.



## సచివాలయంలో సంబరాలు

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో ఉద్యోగ సంఘాలు సంబరాల్లో మునిగి తేలుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ఆవరణలో బుధవారం పలువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఉద్యోగ సంఘ నేతలు ఎత్తుకుని ఆనందం వ్యక్తం చేశారు. కోదండరామ్ మాట్లాడుతూ ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య వారధిగా వ్యవహరిస్తానని వెల్లడించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

– సాక్షి, హైదరాబాద్

## కాంగ్రెస్ సర్కార్ ఉండేది ఆరు నెలలే!

- లేదంటే ఏడాదే
- హామీలను అమలు చేయకుంటే రేవంత్‌ను విడిచి పెట్టం
- రాబోయే రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ గ్యారంటీ
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ రోజులు అధికారంలో ఉండే అవకాశాలు లేవని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎక్కువలో ఎక్కువ ఆరునెలలు.. లేదంటే ఏడాది పాటే అధికారంలో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయని జోస్యం చెప్పారు. త్వరలోనే కర్ణాటకలో మాదిరిగానే ఇక్కడ కాంగ్రెస్ సర్కార్ నిజస్వరూపం తెలంగాణ ప్రజలకు అర్థం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడుతుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు మోసపూరితమైనవని, వాటి ఉచ్చులో ఇక్కడి ప్రజలు పడ్డారని పేర్కొన్నారు. సీఎం పదవిని చేపట్టబోతున్న రేవంత్‌రెడ్డి ఆ హామీలను అమలు చేయని పక్షంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు విడిచిపెట్టే ప్రసక్తి లేదన్నారు. బుధవారం రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి రాజాసింగ్, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు బహిష్కరించడంతో కేసీఆర్ కుటుంబసభ్యుల రావణరాజ్యం అంతమైందన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, సీనియర్ నేత చింతా సాంబమూర్తి, బీజేపీ ఉపాధ్యక్షుడు డా.జి.మనోహర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా నేతలు శంకర్, క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్‌గా మాధవి



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్‌గా ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీర్స్‌కు చెందిన మాధవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రైల్వేలో నిర్మాణం, పీఎస్‌యూ (ఆర్‌వీఎన్ఎల్) ఓపెన్ లైన్ విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి పలు అవార్డులు కూడా అందుకున్నారు. భారీ రైల్వే ప్రాజెక్టుల ప్రణాళిక, నిర్వహణలో ఆమెకు మంచి అనుభవం ఉంది. తూర్పు, దక్షిణ, నైరుతి జోన్‌లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్, డబ్లింగ్, ఎమ్మార్పీఎస్ గేజ్ మార్పిడి, రైల్వే విద్యుదీకరణ సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్స్ పనులను విజయవంతంగా నిర్వహించారని దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో పేర్కొంది.

### తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్ వర్ధంతి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ భవన్‌లలో బుధవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ భవన్‌ల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### వీఏవోఏటీ నూతన కార్యవర్గం




సాక్షి, హైదరాబాద్: విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య ఆధ్వర్యంలో టీఎస్‌పీడీసీఎల్ కంపెనీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. కంపెనీ అధ్యక్షునిగా వీరస్వామి, కార్యదర్శిగా కొరగాల వెంకటేశ్వర్లు ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కొండారెడ్డి, శ్రీకాంత్, బి.శ్రీనివాసులు, కె.హరీశ్‌కుమార్, వెంకట్ కొరడాల, ఎ.నాగరాజు, ఎం.జానయ్య, రాజేష్, తేజస్విని, ఎన్.శేఖర్, సత్తయ్య, జగదీశ్, రవికుమార్, మణిరామ్, జేకే అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు.

### పాత పెన్షన్ హామీతోనే కాంగ్రెస్‌కు మద్దతు

సాక్షి, హైదరాబాద్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేస్తామన్న కాంగ్రెస్‌కు మూడు లక్షల ఉపాధ్యాయులు, ఉద్యోగులు మద్దతుగా నిలిచారని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు దాముక కమలాకర్ స్పష్టం చేశారు. నూతన సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న రేవంత్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వాలు ఏ రోజు కూడా సీపీఎస్, పాత పెన్షన్‌పై చర్చించలేదని, ఒక్క దరఖాస్తు కూడా తీసుకోలేదని విమర్శించారు. కొత్త ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నామని బుధవారం ఒక ప్రకటనలో కమలాకర్ పేర్కొన్నారు.

### బీసీ గురుకులాల్లో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ప్రవేశాలకు 8న కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని వనపర్తి, కరీంనగర్ అగ్రికల్చర్ మహిళా కాలేజీల్లో బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి ఈనెల 8న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ వివరాలు https://mjptbcwreis.telangana.gov.inలో ఉన్నాయన్నారు. అగ్రిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి రెండో విడత కౌన్సెలింగ్, ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎంసెట్, అగ్రిసెట్‌లో వచ్చిన ర్యాంకులతో పాటు గురుకుల అగ్రికల్చర్ డిగ్రీ కాలేజ్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న వారే ఈ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

### నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదు

**సీసీఎల్ఏలో ఉద్యోగుల ఆవేదన**

సాక్షి, హైదరాబాద్: గత నాలుగు నెలల నుంచి తమకు జీతాలు ఇవ్వడంలేదని, ఎంప్లాయిస్ ఐడీ కార్డులు కూడా ఇవ్వటంలేదని సీసీఎల్ఏలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వీఆర్ఏల జేఏసీ నేతలు రమేశ్ బహదూర్, కరుణాకర్, స్వామి తదితరులు బుధవారం భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్‌మిట్టల్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు.

### ప్రజోపయోగ కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు

సాక్షి, హైదరాబాద్: కొత్త ప్రభుత్వం చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలన్నింటికీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సుభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం బాధ్యతలు చేపట్టనున్న రేవంత్‌రెడ్డికి బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

# కేడర్‌కు భరోసా!

**పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు బీఆర్ఎస్ ఆదేశం**

- నిరంతరం ప్రజల్లో ఉండాలన్న అధినేత కేసీఆర్
- కార్యకర్తల్లో ధైర్యం నింపాలని కేటీఆర్ విజ్ఞప్తి
- సోషల్ మీడియా వింగ్, వార్ రూమ్ బలోపేతానికి నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో అధికార పీఠానికి దూరమైన భారత్ రాష్ట్ర సమితి భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించింది. ఎన్నికల ఫలితాలను వివిధ కోణాల్లో విశ్లేషిస్తూనే మరో నాలుగు నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయడంపై పార్టీ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు దృష్టి సారించారు. పార్టీ తరపున గెలుపొందిన నూతన ఎమ్మెల్యేలతో పాటు ఓడిన అభ్యర్థులు, ఇతర ముఖ్య నేతలు కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవల్లిలోని ఆయన ఫామ్‌హౌస్‌కు బారులు తీరుతున్నారు. ప్రజా జీవితంలో గెలుపోటములు సహజమని తనను కలిసిన నేతలకు సర్ది చెబుతూనే నిరంతరం ప్రజల్లో ఉండేందుకు సన్నద్ధం కావాలని సూచిస్తున్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా కేడర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలపడంతో పాటు వారిలో ధైర్యం నింపాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తాజాగా నేతలకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యేలతో పాటు ఓటమి పాలైన నేతలు మండలాల వారీగా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని, తాము అండగా ఉంటామంటూ కేడర్‌లో స్ఫూర్తి నింపే ప్రయత్నం ప్రారంభించారు.

**క్షేత్ర స్థాయి కార్యకలాపాలపై దృష్టి**

పార్టీకి 60 లక్షల మంది పటిష్టమైన పార్టీ యంత్రాంగం ఉన్నా అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితం దక్కకపోవడంపై బీఆర్ఎస్ లోతుగా విశ్లేషణ జరుపుతోంది. అసెంబ్లీ సెగ్మెంట్లు, మండలాలు, బూత్‌ల వారీగా పార్టీ అభ్యర్థులకు పోలైన ఓట్లు, ప్రభావితం చేసిన అంశాలను పోస్టుమార్టం చేస్తోంది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ యంత్రాంగం విఫలమైనట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల వల్ల కూడా నష్టం జరిగినట్లు అంచనా వేసింది. ఎమ్మెల్యేలు కేంద్రంగా పార్టీ కార్యకలాపాలు నిర్వహించడం, ద్వితీయ శ్రేణి యంత్రాంగంపై పార్టీ నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడం కూడా ఓటమికి కారణమైందనే నివేదికలు అందాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణలో భాగంగా క్షేత్రస్థాయి కార్యక్రమాలపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

**పార్టీ జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలకు శిక్షణ**

తెలంగాణ భవన్ పేరిట అన్ని జిల్లా కేంద్రాల్లోనూ పార్టీ కార్యాలయాలు నిర్మించినా నేటికీ పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. వీటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేలా కార్యకర్తలకు నిరంతరం శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించింది. కొత్త తరానికి తెలంగాణ ఉద్యమం, బీఆర్ఎస్ పాత్ర, పదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి తదితరాలను వివరించేలా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. సోషల్ మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్ర స్థాయిలో కేడర్‌కు సోషల్ మీడియా ద్వారా చేయాల్సిన ప్రచారంపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ పనితీరును నిశితంగా పరిశీలిస్తూ లోపాలపై ఎప్పటికప్పుడు ప్రతిస్పందించేందుకు వీలుగా 'వార్‌రూమ్'ను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇకపై కేటీఆర్ ప్రతిరోజూ నిర్దేశిత సమయంలో తెలంగాణ భవన్‌లో నాయకులు, కేడర్‌కు అందుబాటులో ఉండేలా కార్యాచరణ సిద్ధమవుతోంది. కాగా ఈ నెల 9న పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగే అవకాశముందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

### ప్రజల హక్కుల కోసం కొట్లాడుతాం: కేటీఆర్



సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన పార్టీగా బీఆర్ఎస్ ప్రజల గొంతుకై పని చేస్తుందని, ప్రజల హక్కుల కోసం కొట్లాడుతుందని కేటీఆర్ చెప్పారు. బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఎన్నికల ఫలితాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరాశ పడొద్దని అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సాధారణమని చెప్పారు. అయితే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వాళ్లు సైతం ఫోన్లు చేసి, వీడియో మెసేజ్‌లు పెట్టి.. కేసీఆర్ సీఎం కాలేదా? అని బాధపడుతున్నారని తెలిపారు. ఇప్పుడు కూడా ప్రజలు మనకు 39 మంది ఎమ్మెల్యేలను ఇచ్చారని, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తదితర నేతలు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోరుకంటి చందర్, కర్నె ప్రభాకర్‌లు కేటీఆర్‌తో సమావేశమయ్యారు.



కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చింతమడక గ్రామస్తులు

# కేసీఆర్‌ను కలిసిన చింతమడక గ్రామస్తులు

**మళ్లీ సీఎం కావాలంటూ నినాదాలు**

సిద్దిపేట రూరల్/మర్కూక్ (గజ్వేల్): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును తన స్వగ్రామమైన చింతమడక గ్రామస్తులు కలిశారు. బుధవారం తొమ్మిది బస్సుల్లో సుమారు 540 మంది గ్రామస్తులు సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో కేసీఆర్‌ను పలువురు ప్రముఖులు కలుస్తున్నందున వారిని లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతివ్వలేదు. దీంతో సుమారు రెండు గంటలపాటు నిరీక్షించారు. అనంతరం లోపలికి అనుమతించారు. దీంతో కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చారు. ఆయన్ను చూసిన గ్రామస్తులు భావోద్వేగానికి గురయ్యారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ నినాదాలు చేశారు. అయితే...ఆయన మాట్లాడకుండానే అభివాదం చేస్తూ లోపలికి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు ఉన్నారు.



గ్రామస్తులకు అభివాదం చేస్తున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు

# యువ సారథ్యానికి అవకాశం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత
- సింగరేణి ఎన్నికలపై కవితతో టీబీజీకేఎస్ నేతల భేటీ



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించామని, అదే స్ఫూర్తితో నాయకత్వంలోనూ యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గౌరవాధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య బుధవారం హైదరాబాద్‌లో కవితను కలసి సింగరేణి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తమ యూనియన్‌లో యువతకు 66 శాతం వరకు నాయకత్వ బాధ్యతల్లో అవకాశాలు కల్పిస్తామన్నారు. 1998లో ఆగిపోయిన కారుణ్య నియామకాలను 2018లో కేసీఆర్ తిరిగి పునరుద్ధరించి వేలాది మందిని నియమించారన్నారు. జాతీయ సంఘాల కారణంగా కారుణ్య నియామకాలకు గండి పడిందని, కోల్ ఇండియా సంస్థలో సైతం లేని విధంగా కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సింగరేణిని కష్టాల నుంచి కాపాడిన బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌ను ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ దాదాపు 20 వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చి యువతకు ఉపాధి కల్పించారని, ఎప్పుడూ లేని విధంగా సింగరేణి సంస్థ నికర లాభాల్లో కార్మికులకు భారీ మొత్తంలో వాటాలను పంచారని వివరించారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 61కి పెంచామని, తెలంగాణ ఉద్యమ సమయంలో 35 రోజుల పాటు సాగిన సకల జనుల సమ్మెలో పాల్గొన్న వారికి రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పూర్తి జీతం ఇచ్చారని గుర్తు చేశారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సౌకర్యం కల్పించారని, క్వార్టర్స్‌లో నివసించే వారు బేసిక్‌లో 1% సంస్థకు చెల్లించాలన్న నిబంధనను కేసీఆర్ రద్దు చేశారని, డిపెండెంట్ ఉద్యోగం వద్దనుకుంటే ఆ కుటుంబానికి రూ. 25 లక్షలు చెల్లించాలన్న నిర్ణయం తీసుకున్నారని కవిత పేర్కొన్నారు.

# ఖాళీ కానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కాబోతోంది. దీంతో ఆ స్థానానికి మళ్లీ ఎన్నికలు రానున్నాయి. ఈస్థానం నుంచి ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవికి రాజీనామ చేయనున్నారు.

**2021లోనే జరిగిన ఎన్నికలు**

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఎన్నికలు 2021 మార్చిలో జరిగాయి. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి తీన్‌మార్ మల్లన్నపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన పదవీ కాలం ఇంకా మూడు సంవత్సరాలు ఉంది. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు రావడంతో జనగామ నియోజకవర్గం నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం జోడు పదవులు ఉండకూడదు కాబట్టి, ఇప్పుడు ఎమ్మెల్సీ పదవికి పల్లా రాజీనామా అనివార్యమైంది. ఎమ్మెల్సీ పదవికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరలోనే రాజీనామా చేయనున్నారని సమాచారం. దీంతో ఆరు నెలల్లోగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మళ్లీ ఎన్నికలు రానున్నాయి.

### రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

**రేవంత్‌రెడ్డికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అభినందనలు**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.దామోదర్ రెడ్డి, సి.చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలతో పాటు రాష్ట్రంలోని మూడు లక్షల మంది పెన్షనర్ల సంక్షేమాన్ని కాపాడుతూ సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

### సింగరేణిలో బదిలీలు, పోస్టింగ్‌లకు బ్రేక్

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణిలో ఈనెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బదిలీలు, పోస్టింగ్‌లు నిలిపివేసినట్లు యాజమాన్యం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించనుండగా, నిష్పక్షపాతంగా ప్రక్రియ జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు కార్మికుల బదిలీలతో పాటు పదోన్నతులు, పోస్టింగ్‌లకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు వెలువడవని ఆ నోటీసులో పేర్కొన్నారు. కాగా, ఎన్నికల్లో పోటీ చేసే యూనియన్ల నాయకులు కార్మికుల విధులకు ఆటంకం ఎదురుకాకుండా షిఫ్ట్ ముగింపు సమయాన మీటింగ్‌లు నిర్వహించుకోవాలని, గనులు, విభాగాల హెచ్‌ఓడీల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించింది.

### టీఎస్ సెట్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష టీఎస్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్‌సెట్-2023) ఫలితాలను బుధవారం విడుదల చేశారు. 29 సబ్జెక్టులకు అక్టోబరు 28, 29, 30న తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాలతో పాటు ఏపీలోని 3 జిల్లాలో జరిగిన టీఎస్‌సెట్‌కు 31,866 మంది అభ్యర్థులు హాజరుకాగా 2,278 మంది అర్హత సాధించినట్లు టీఎస్ సెట్ మెంబర్ సెక్రటరీ ప్రొ.మురళీకృష్ణ, కోఆర్డినేటర్ ప్రొ.నరేశ్‌రెడ్డి వివరించారు. వారం రోజుల తర్వత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫలితాలు www.telanganaset.org అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

# రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు?

▶ మొదటి పేజీ తరువాయి



సుముఖంగా లేరని అంటున్నారు. ప్రస్తుతం ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లకు సీఎంల నియామకం కసరత్తులో బీజేపీ అగ్ర నాయకత్వం తలమునకలై ఉంది. దీంతోపాటు పార్లమెంట్ సమావేశాలు కూడా జరుగుతున్నందున తెలంగాణలో బీజేపీ సాధించిన ఫలితాలు, ఇతర పరిణామాలపై జాతీయ నాయకత్వం పెద్దగా దృష్టి సారించలేదని చెబుతున్నారు. అయితే ఆ మూడు రాష్ట్రాలకు సీఎంల ఎంపికపై స్పష్టత వచ్చి, వారు ప్రమాణస్వీకారం చేసే లోగానే రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసే యోచనలో కిషన్‌రెడ్డి ఉన్నట్టు పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. తొలుత రాజీనామా సమర్పించాలని, ఆ తర్వాత నాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనే దానితో నిమిత్తం లేకుండా ముందుకు సాగాలని ఆయన భావిస్తున్నట్టు చెబుతున్నారు.

**భిన్న వాదనలు**

జాతీయ పార్టీకి లోక్‌సభ ఎన్నికలు కీలకం కావడంతో పాటు ఈ ఎన్నికల్లో తెలంగాణ నుంచి గతంలో గెల్చిన నాలుగు సీట్ల కంటే అధిక స్థానాలు గెలవాలనే లక్ష్యం పెట్టుకోవడంతో ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర నాయకత్వ మార్పు సాధ్యం కాకపోవచ్చుననే అభిప్రాయం ఒకవైపు వినిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా కిషన్‌రెడ్డిని కొనసాగించే అవకాశాలున్నాయని కొందరు నేతలు చెబుతున్నారు. అయితే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి, కేవలం 8 సీట్లకే పరిమితం కావడంపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇది పార్టీ ముఖ్య నేతలను ఆవేదనకు గురిచేసినట్లు చెబుతున్నారు. మరోవైపు తన సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్కటి కూడా బీజేపీ గెలవకపోవడంతో ముందుగా తన నియోజకవర్గంలో పరిస్థితిని చక్కదిద్దుకోవాలనే ఆలోచనతో కిషన్‌రెడ్డి ఉన్నట్టుగా చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగేందుకు ఆయన ఒప్పుకోకపోవచ్చునని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

**మళ్లీ బండి లేదా ఈటల లేదా అర్వింద్**

కొత్త అధ్యక్షుడిని నియమించాల్సి వస్తే.. మళ్లీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను లేదా బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్‌ను లేదా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురిలలో ఒకరిని జాతీయ నాయకత్వం నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితుల్లో.. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు సంధిస్తూ ఢీ అంటే ఢీ అన్నట్టుగా ప్రచారాన్ని సాగించాల్సి ఉన్నందున ఆ మేరకు వీరిలో ఒకరిని నియమించవచ్చునని అంటున్నారు.

# వచ్చే ఏడాది గిరిజన వర్సిటీ షురూ!

▶ మొదటి పేజీ తరువాయి

(హెచ్‌సీయూ) అప్పగించారు. కానీ కేబినెట్ అనుమతులు, పార్లమెంటులో బిల్లు ఆమోదం కాకపోవడంతో యూని వర్సిటీ కార్యకలాపాలు ముందుకు సాగలేదు.

**హెచ్‌సీయూ పర్యవేక్షణ**

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి గెజిట్ జారీ కావడంతో కేంద్ర విద్యా శాఖ అధికారుల బృందం అతి త్వరలో రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉంది. వర్సిటీకి అవసరమైన మౌలిక వసతులు తదితరాలను పూర్తిస్థాయిలో పరిశీలించనుంది. ఇది పూర్తయిన తర్వాత సంబంధిత అనుమతులన్నీ వేగంగా జారీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ వర్సిటీని హెచ్‌సీయూ పర్యవేక్షించనుంది. ఇప్పటికే కోర్సులు, ఇతరత్రా కార్యక్రమాలకు సంబంధించిన నివేదికను రూపొందించింది. అనుమతులు వచ్చిన వెంటనే 2023-24 విద్యా సంవత్సరంలో తరగతులు సైతం ప్రారంభించేలా చర్యలు వేగవంతం చేస్తోంది.

**రూ.10 కోట్ల నిధులు..498 ఎకరాల భూమి**

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా తెలంగాణకు గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 2016-17 వార్షిక బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించింది. ఈ మేరకు చర్యలకు ఉపక్రమించిన రాష్ట్ర ప్రభుత్వం ములుగు మండలం జాకారంలో 498 ఎకరాల భూమిని వర్సిటీ ఏర్పాటు కోసం గుర్తించి గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించింది. ఇందులో 285 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, మిగతా 213 ఎకరాలు అటవీ శాఖకు చెందింది. ఈ భూసేకరణ కోసం అటవీ శాఖకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం భూమిని చూపించింది. కార్యకలాపాలు మొదలుపెట్టేందుకు సమీపంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)ను కేటాయించింది. వర్సిటీ ఏర్పాటుపై హెచ్‌సీయూ లోతైన పరిశీలన జరిపి, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను సమర్పించాలని ఆదేశించడంతో, ఆ మేరకు ప్రక్రియ పూర్తి చేసిన హెచ్‌సీయూ.. మూడేళ్ల క్రితమే కేంద్రానికి డీపీఆర్ సమర్పించింది.

# గిరిజన వర్సిటీ ఏర్పాటు హర్షణీయం

**యూనివర్సిటీ బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన ఎంపీ బీబీపాటిల్**

సాక్షి, న్యూఢిల్లీ: గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు హర్షణీయమని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. సమ్మక్క- సారక్క గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించి కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విశ్వవిద్యాలయాల సవరణ బిల్లుపై బుధవారం ఎంపీ బీబీపాటిల్ మాట్లాడారు. ట్రైబల్ వర్సిటీ ఏర్పాటు తెలంగాణలో గిరిజనుల సాధికారతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వర్సిటీ కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ ఎంపీలు ఎన్నోసార్లు కేంద్రం దృష్టికి తెచ్చినట్టు వివరించారు. సమ్మక్క-సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని స్పీకర్ ద్వారా కేంద్రానికి పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# దక్షిణాదిలో ఎలా?



- వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి పరిస్థితిని చక్కదిద్దడంపై బీజేపీ దృష్టి
- వరుసగా కర్ణాటక, తెలంగాణలో పార్టీ ఓటమితో డీలా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దక్షిణాదిలో విస్తరించాలన్న బీజేపీ ఆశలపై నీళ్లు చల్లాయి. ఇటీవల ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగ్గా, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లను బీజేపీ కైవసం చేసుకోగా, మధ్యప్రదేశ్‌లో ప్రజావ్యతిరేకతను అధిగమించి మళ్లీ అధికారంలోకి రాగలిగింది. ఈ ఏడాది మొదట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరగడంతో అధికారంలోకి వస్తామని లేదా అధిక సంఖ్యలో సీట్లు సాధించి కింగ్‌మేకర్ లేదా ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తామని బీజేపీ నాయకత్వం అంచనా వేసింది. కానీ ఫలితాల్లో డబుల్ డిజిట్ కూడా దాటలేకపోయింది. తాజాగా చోటుచేసుకున్న పరిణామాలతో దేశవ్యాప్తంగా మరీ ముఖ్యంగా ప్రతిపక్షంలో ఉన్న రాష్ట్రాల్లోనూ నిలిచి ఉత్తరాది, ఇతర ప్రాంతాల్లో మరింత బలోపేతమవుతున్న బీజేపీ దక్షిణాదిలో మాత్రం ఎందుకు విస్తరించలేకపోతు న్నది? అందుకు దారితీస్తున్న, ప్రభావం చూపు తున్న అంశాలేమిటి అన్న దానిపై జాతీయనాయకత్వం దృష్టి పెట్టినట్టు పార్టీవర్గాల సమాచారం.

**వరుస ఓటములతో..**

కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోగా, తెలంగాణలో ఓటమితో బీజేపీ శ్రేణులు నిరాశలో ఉన్నాయి. డీలా పడిన పార్టీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండింటితో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో సత్తా చాటకపోతే భవిష్యత్‌లో రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ నాలుగు సీట్లు గెలవగా, వచ్చే ఎన్నికల్లో కనీసం 8 నుంచి 9 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని అధిగమించినట్టు అవుతుందనే చర్చ అంతర్గతంగా ముఖ్యనేతల్లో సాగుతున్నట్టు పార్టీవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలోనే లోక్‌సభ ఎన్నికల కల్లా దక్షిణాదిలో మరీ ముఖ్యంగా కర్ణాటక, తెలంగాణల్లో పార్టీ పరిస్థితిని చక్కదిద్దడంపై జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు దృష్టి పెట్టినట్టు తెలిసింది.

**ఇక్కడ స్పెషల్ ఫోకస్**

ఉత్తరాదిలో బలంగా ఉన్నా దక్షిణాదిలో ఇంకా పూర్తిస్థాయిలో పట్టు దొరక్కపోవడానికి కారణాలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే దక్షిణాదికి సంబంధించి ప్రత్యేక ఎజెండాకు తుది రూపం ఇస్తున్నట్టు సమాచారం. దక్షిణాదిని ఆనుకొని పొరుగున రాష్ట్రాలు కలుపుకుని మొత్తం 11 రాష్ట్రాల్లో 181 ఎంపీ సీట్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో వాటిలో 53 స్థానాల్లో బీజేపీ గెలుపొందింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆ సంఖ్యను దాటి ఎక్కువ మొత్తంలో సీట్లు గెలిచే దిశగా కచ్చితమైన వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికతో బీజేపీ ముందుకెళ్లనుంది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని రాష్ట్రపార్టీలకు జాతీయ నాయకత్వం దిశానిర్దేశం చేసినట్టు సమాచారం.

# డబ్బు ప్రభావంతోనే ఫలితాలు తారుమారు

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**



నేలకొండపల్లి: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయపార్టీలు ఓటర్లను డబ్బు ప్రలోభాలకు గురిచేశాయని, ఆ ప్రభావంతోనే ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో తమకు రావాల్సిన ఓట్లు కూడా రాలేదని, కొంత ఓటు బ్యాంకు చెదిరిన మాట నిజమేనని ఆయన అంగీకరించారు. అయినప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలు కేసీఆర్‌లోని అహంభావాన్ని తిరస్కరించారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని తమ పార్టీ స్వాగతిస్తోందని చెప్పారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. సమస్యల పరిష్కారంపై కేసీఆర్ చూపిన నిర్లక్ష్యధోరణితో విసిగిపోయిన ప్రజలు తమ అసంతృప్తిని ఓట్ల రూపంలో వ్యక్తం చేశారన్నారు. తమ లోపాలపై సమీక్షించుకుంటామని తెలిపారు.



నిజాయితీ అనేది అత్యుత్తమ విధానం.
– మిగెల్ డె సెర్వాంటీజ్



సాక్షి
గురువారం, 7 డిసెంబర్ 2023

# మిచాంగ్ గుణపాఠం

ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడినప్పుడల్లా మనిషి చేసిన, చేస్తున్న పాపాలు బయటపడతాయి. అంతవరకూ పాలకులు రూపొందించిన విధానాల్లోని వైఫల్యాలు బట్టబయలవుతాయి. తీవ్ర తుపానుగా పరిగణించిన మిచాంగ్ నాలుగురోజుల పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను వణికించింది. దాని ధాటికి చెన్నై నుంచి తమిళ తీరప్రాంతాలతో మొదలుపెట్టి దక్షిణాంధ్ర జిల్లాలన్నీ తడిసిముద్దయ్యాయి. కోస్తా జిల్లాలు సైతం వర్షాలతో సతమతమయ్యాయి. పంటలు దెబ్బ తిన్నాయి. చెన్నైలో గత 47 ఏళ్లలో ఎప్పుడూ చూడనంత స్థాయిలో భారీ వర్షం కురిసింది. నగరం నగరమంతా వరదనీటిలో తేలియాడింది. వివిధ ఘటనల్లో మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంతవరకూ 2015 నాటి కుంభవృష్టే రికార్డు. ఈ ఏడాది చిన్నా పెద్దా స్థాయిలో దేశం ఆరు తుపాన్లనూ, వాటి దుష్పరిణామాలనూ చవిచూసింది. మొన్న జూన్‌లో గుజరాత్, మహారాష్ట్రల్లో బిపర్జయ్ తుపాను సృష్టించిన కల్లోలం అంతా ఇంతా కాదు. ఆకాశాన్నంటే భవంతులతో, రోడ్లపై నిరంతరం రివ్వుమంటూ దూసుకుపోయే వాహనాలతో, అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో దేన్నయినా క్షణాల్లో పొందగల వెసులుబాటు వగైరాలతో అత్యద్భుతంగా కనబడే నగరాలు, పట్టణాలు చినుకుపడితే నరకాన్ని తలపిస్తాయి. అటువంటిది కనీవినీ ఎరుగని రికార్డు స్థాయి కుంభవృష్టి పడితే ఇక చెప్పేదేముంది? కేవలం ఆది, సోమ వారాల్లో రాత్రింబగళ్లు కురిసిన వర్షపాతం ఏకంగా 35 సెంటీమీటర్లంటే పరిస్థితి ఎలావుందో ఊహించుకోవచ్చు. శివారుల్లో వున్న చెరువులు, రిజర్వాయర్లు, అడయార్, కూవమ్ నదులు, బకింగ్‌హామ్ కాల్వ పూర్తిగా నిండి వరద జలాలు చెన్నై నగరాన్ని ముంచెత్తాయి. ఫలితంగా అన్ని హైవేలు, సబ్‌వేలు మూతబడక తప్పలేదు. వందలాది వాహనాలు కొట్టుకుపోయాయి. ప్రముఖులు నివాసం ఉండే పొయెస్ గార్డెన్ రోడ్డు ఏడడుగుల మేర కుంగిపోయి అందులో ట్రాన్స్‌ఫార్మర్లు, వాహనాలు కూరుకుపోయాయంటే పరిస్థితి ఎలా ఉన్నదో ఊహించుకోవచ్చు. వాతావరణ విభాగం చెబుతున్న ప్రకారం మిచాంగ్ గత తుపానులకు భిన్నమైనది. సాధారణంగా తీరానికి సుదూరంగా తుపాను తిరుగాడుతుంది. కానీ ఈసారి తీరానికి 90 కిలోమీటర్ల దూరంలోనే మిచాంగ్ లంగరేసింది. పైగా అది చాలా నెమ్మదిగా... అంటే గంటకు 5–7 కిలోమీటర్ల మధ్య వేగంతో కదిలింది. తుపాను వేగం సాధారణంగా గంటకు 10–18 కిలోమీటర్ల వేగంతో కదులుతుంది. తీరానికి దగ్గరగా వుండి మందకొడిగా కదలటం వల్ల విడవకుండా భారీ వర్షాలు కురిశాయి. 2015లో చెంబరామ్‌బాక్కమ్ సరస్సు, పూండి రిజర్వాయర్‌ల నుంచి ఒక్కసారి భారీయెత్తున నీటిని విడుదల చేసిన పర్యవసానంగా చెన్నై నీట మునిగింది. ఈసారి అన్ని జాగ్రత్తలూ తీసుకుని ఒక క్రమపద్ధతిలో నీరు వదిలినా మిచాంగ్ తీవ్రత కారణంగా ఇంచుమించు అప్పటి పరిస్థితే ఏర్పడింది. తీరానికి ఆవల ఉండాల్సిన సముద్రం నగరబాట పట్టిందా అన్నంతగా వరద పోటెత్తింది.

అభివృద్ధి పేరు మీద అన్నిటినీ ఒకేచోట కేంద్రీకరిస్తే వృత్తి ఉద్యోగాల కోసం, చిన్నా చితకా వ్యాపారాల కోసం దూరతీరాల నుంచి సైతం జనం అక్కడికి చేరుకుంటారు. జనాభా అపరిమితంగా పెరుగుతుంది. నగరీకరణ, పట్టణీకరణ జరుగుతున్నప్పుడు ఆ వంకన భూబకాసురులు ప్రవేశిస్తారు. సరస్సులు, చెరువులు మాయమవుతాయి. కాల్వలు కుంచించుకు పోతాయి. పచ్చటి చెట్లు నేలకొరుగుతాయి. ఎటుచూసినా కాంక్రీట్ కీకారణ్యాలే విస్తరిస్తుంటాయి. మన దేశంలోనే కాదు... వేరే దేశాల్లో ఇదే పరిస్థితి. అయితే ఆ దేశాల్లో కాస్త ముందే మేల్కొని అభివృద్ధి వికేంద్రీకరణ వైపు కదిలారు. కానీ మన దగ్గర ప్రకృతి విలయాలు కళ్ల ముందే కనబడుతున్నా ఆ అంశంపై పాలకులు దృష్టి సారించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు హయాంలో అమరావతి నిర్మాణానికి చేసిన ప్రయత్నం ఇందుకు ఉదాహరణ. వికేంద్రీకరణతో పాటు విపత్తులు ముంచుకొచ్చినప్పుడు తలెత్తగల సమస్యలను ముందే గుర్తించి అందుకు తగ్గట్టు మౌలిక సదుపాయాలు ఏర్పరిస్తే ఇబ్బందులు తగ్గుతాయి. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ స్థితిగతులు మారాయి. కర్బన ఉద్గారాలు అపరిమితంగా పెరిగిన పర్యవసానంగా భూగోళం వేడెక్కడం, ఆ వేడిమిలో 90 శాతం సముద్రాలకే పోవటం వల్ల వాటి జలాలు వేడెక్కుతున్నాయి. తుపానులకు అదే ప్రధాన వనరు.

ఈ పరిస్థితుల్లో నగరీకరణ, పట్టణీకరణలపై పునరాలోచించటం, ఇప్పటికే ఉన్న నగరాలు, పట్టణాల్లో ప్రస్తుత స్థితిని మెరుగుపరచటానికి అనుసరించాల్సిన విధానాలకు రూపకల్పన చేయటం అవసరం. పారిస్ ఒడంబడికకు అనుగుణంగా అహ్మదాబాద్‌లోని అర్బన్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఈ విధానాలకు తుదిరూపం ఇచ్చింది. తమిళనాడు సర్కారు దాని ఆధారంగా చెన్నైకు మొన్న జూన్‌లో సవివరమైన ప్రణాళికను రూపొందించింది. 2050కల్లా ఆ నగరాన్ని కర్బన ఉద్గారాల బారి నుంచి రక్షించటానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక విధానాన్ని ప్రకటించింది. నీటి కొరత నివారణ, పునరుత్పాదక ఇంధన వనరుల పెంపు, విద్యుత్‌తో నడిచే బస్సులు వందశాతం ఉండేలా చూడటం, నగరంలో హరితవనాల్ని 35 శాతానికి విస్తరించటం, పకడ్బందీ పారిశుద్ధ్యం, చెన్నై వరద ముంపు బారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవటం అందులో కొన్ని. నగర విస్తరణకూ, కాలనీల నిర్మాణానికీ విచ్చలవిడి అనుమతులీయటం విరమించుకుంటే, డ్రైనేజీ వ్యవస్థల పునర్వ్యవస్థీకరణకు చర్యలు తీసుకుంటే ప్రతి నగరమూ మెరుగవుతుంది. మిచాంగ్ వంటి తీవ్ర తుపానుల వల్ల జరిగే నష్టం కనిష్ఠస్థాయికి పరిమితమవుతుంది. పాలకులు ఈ దిశగా ఆలోచించాలి.

# ప్రజాస్వామ్యానికి దూరమైనప్పుడు...

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

**తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ప్రత్యేక తెలంగాణలో కాంగ్రెస్‌ను తొలిసారి అధికారంలో నిలబెట్టాయి. బీజేపీ కూడా స్వయంకృత అపరాధాలకు అతీతం కాదన్న విషయాన్నీ రుజువు చేశాయి. కానీ బీఆర్ఎస్ అధినాయకుడు కేసీఆర్‌కు మాత్రం ఈ ఎన్నికలు గొప్ప గుణపాఠాలు అయ్యాయి. ఉద్యమ నేత స్థాయి నుంచి ముఖ్యమంత్రి పీఠానికి వెళ్లిన కేసీఆర్ ఆ విషయాన్నే మర్చిపోయి వ్యవహరించారు. విలేకరుల సమావేశాలలో ఆయన వ్యవహరించిన తీరు అసలు ప్రజాస్వామ్యానికి శోభను కూర్చేదని ఎవరైనా అనగలరా? ఎన్నికల ప్రచార సభలలో 'నేను చెప్పేది నేను చెప్పాను. నాకు ఓటేయకపోతే మీ ఖర్మ' అనే దాకా వెళ్లారు. ఇది ప్రజాస్వామ్యం మీద నమ్మకమున్న ఏ నాయకుడూ చేయడు, చేయకూడదు!**

తెలంగాణ ఏర్పడిన తరువాత శాసనసభకు జరిగిన మూడో ఎన్నికలు బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖరరావుకు ప్రత్యేకమైనవి. ఈ ఎన్నికలలో ప్రజలు ఆయన ధోరణిని ఓడించారనడం సబబు. రంగం నుంచి బీజేపీ తప్పుకొన్న విషయం ఎన్నికల సంరంభానికి ముందే వెల్లడైంది. మునుగోడు ఉప ఎన్నిక వరకూ అసెంబ్లీ ఎన్నికలలో విజయం బీజేపీదే అన్నంత ధీమా ఉందన్నది నిజం. ఈ ఎన్నికలు ప్రత్యేక తెలంగాణలో కాంగ్రెస్‌ను తొలిసారి అధికారంలో నిలబెట్టాయి. బీజేపీ కూడా స్వయంకృత అపరాధాలకు అతీతం కాదన్న విషయాన్ని రుజువు చేశాయి. కానీ కేసీఆర్‌కు మాత్రం ఈ ఎన్నికలు గొప్ప గుణపాఠాలు. నిజానికి ప్రజాస్వామ్యానికి దూరంగా జరిగిన నేతలకు మిగిలే అంతిమ అనుభవం ఇదేనని చాలా గొప్పగా చెప్పాయి.

'నిధులు, నీళ్లు, నియామకాలు' అన్న నినాదం ఉద్యమానికి ఊపిరి ఇచ్చినప్పటికీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముమ్మాటికీ ఆత్మ గౌరవం అనే నినాదం మీద నిర్మితమైందని మరచిపోలేం. అయితే కేసీఆర్ ఈ రకమైన సెంటిమెంట్‌ను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గౌరవించిన తీరు ముందు నుంచి ప్రశ్నార్థకంగానే ఉన్నది. ఆయన మొదటి మంత్రిమండలి మహిళా ప్రాధాన్యం లేకుండానే చిరకాలం నడిచింది. కేసీఆర్ ఉద్యమ నేత స్థాయి నుంచి ముఖ్యమంత్రి పదవికి వెళ్లిన వ్యక్తేనా అనిపించేలా చేయడానికి ఇది చాలు. అప్పటి నుంచి 2023 ఎన్నికలలో ఆయన పార్టీ ఓటమి వరకూ జరిగిన కొన్ని పరిణామాలు కేసీఆర్ వ్యక్తిత్వం గురించి ప్రశ్నించుకునేటట్టు చేస్తూనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు, సిట్టింగ్ ఎంపీ ఈ ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత చేసిన వ్యాఖ్యలలో ఆ ప్రశ్నలకు సమాధానం కూడా ఉంది. తాను తొమ్మిదేళ్లలో అసలు కేసీఆర్ ఇంటర్వ్యూ కూడా సంపాదించలేక పోయానని బయట పెట్టారు. అలా అని సొంత పార్టీ నాయకులనూ, ఎమ్మెల్యేలనూ, ఎంపీలనూ ప్రగతి భవన్‌లోకి నేరుగా అనుమతించారని అనుకుంటే పొరపాటు. ఈటెల రాజేందర్ బీఆర్ఎస్‌ను వీడుతూ సరిగ్గా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు.

ఉద్యమ నేత స్థాయి నుంచి ముఖ్యమంత్రి పీఠానికి వెళ్లిన కేసీఆర్ ఈ విషయాన్ని అసలు గుర్తించారా? ముమ్మాటికీ లేదు. అంటే కేసీఆర్ తెలంగాణ ఉద్యమ తాత్వికతనే విస్మరించారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది వచ్చి హైదరాబాద్‌తో సహా తెలంగాణ ఇతర ప్రాంతాలలోనూ నివాసం ఏర్పరుచుకున్నారు. కానీ తెలంగాణ సమాజం ఆత్మగౌరవం గురించి ఆలోచింపచేసినవారు కొందరు ఆంధ్ర ప్రాంతీయులేనన్న వాదన ఉంది. అలాంటి అవమానాలను తెలంగాణ సమాజం భరించలేదు. నిజానికి ఏ సమాజమూ భరించదు. ఏదో ఒకరోజు ప్రశ్నిస్తుంది. మద్రాసు ప్రెసిడెన్సీలో తమిళుల నుంచి అవమానాలను ఎదుర్కొన్న తెలుగ భాషా ప్రాంతాల వారు, నిజాం రాజ్యంలో తెలుగు ప్రాంతాల వారి పట్ల కూడా అదే ధోరణి ప్రదర్శించారంటే సత్యదూరం కాబోదు. అంతకంటే పెద్ద వాస్తవం కేసీఆర్ కూడా ముఖ్యమంత్రి హోదాలో అవమానకరమైన ధోరణిలోనే వ్యవహరించడం!



విలేకరుల సమావేశాలలో ఆయన వ్యవహరించిన తీరు అసలు ప్రజాస్వామ్యానికి శోభను కూర్చేదని ఎవరైనా అనగలరా? పత్రికా స్వేచ్ఛ గురించి ఆయన ఏనాడూ గౌరవంగా లేరు. ప్రశ్న ఎంత లోతైనదైనా ఆయన దానికి చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం దేశ ప్రజలకు అనుభవమే. దీనికి మించినది ఎన్నికల ప్రచార సభలలో ఆయన ప్రదర్శించిన ధోరణి. 'నేను చెప్పేది నేను చెప్పాను. నాకు ఓటేయకపోతే మీ ఖర్మ' అనే దాకా ఆయన వెళ్లారు. ఇది ప్రజాస్వామ్యం మీద నమ్మకమున్న ఏ నాయకుడూ చేయడు, చేయకూడదు! తనకు ఓటు వేయమని అడగడానికి వెళ్లి, సభలో చప్పట్లు చరిచిన వారిపై కూడా విరుచుకుపడే స్వభావం ఆయన స్థాయిని నిజంగానే దిగజార్చింది. 'వాడిని ఇలా గుంజుకు రండి', 'కిరికిరిగాళ్లు' వంటి మాటలు తరచు వాడడం సభా మర్యాద కూడా కాదన్న సంగతి ఆయన పూర్తిగా విస్మరించారు. గుజరాత్ వాళ్లకీ, ఢిల్లీ వాళ్లకీ ఇక్కడేం పని అంటూ ఆయన అత్యంత హేయంగా మాట్లాడారు. టీఆర్ఎస్ రూపు మార్చి బీఆర్ఎస్ అయిన తరువాత మహారాష్ట్రకు ఈయన ఎన్నిసార్లు పోయి రాలేదు! మహారాష్ట్ర వాసుల నుంచి ఆయనకు ఇలాంటి ప్రశ్నే వస్తే దానికి ఎలా స్పందించి ఉండేవారు? అవతలి పక్షం, అంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి కేసీఆర్ ప్రయోగించిన భాష దారుణం. దానికి ఆ పార్టీల నాయకుల నుంచి కూడా అలాంటి స్పందనే వచ్చింది. ఈ ధోరణి ఎక్కడో ఒకచోట ఆగి ఉండవలసింది. విపక్షాల నుంచి మొదలై ఉంటే కేసీఆర్‌కు మంచి గుణపాఠం అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు.

ఇది అహంకార ధోరణి అని నిస్సంశయంగా చెప్పడానికి ప్రజాస్వామ్యవాదులు వెనుకాడరు. తెలంగాణ సాధనకు ఉప యోగపడిన నినాదంలోని నీళ్ల కోసం వృథాగా కొన్ని వందల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేసింది. కాళేశ్వరం, మేడిగడ్డల దగ్గర ఎదురైన అనుభవాలు ఇవే. అక్కడ కేసీఆర్ ఇంజనీర్ అవతారం కూడా ఎత్తారని ఇప్పుడు జనం చెబుతున్నారు. కొత్త సచివాలయం నిర్మాణంలో కూడా ఆయన మాటే అంతిమంగా ఉండేదన్న విమర్శ కూడా కొద్దికాలం వినిపించింది.

కేసీఆర్ నియంతృత్వ ధోరణి ఈ ఎన్నికలలో ఓటమి తరువాత కూడా కొనసాగడం ప్రజలను నిశ్చేష్టులను చేసింది. పార్టీ ఓడిపోతే ఆ పార్టీ నుంచి సీఎంగా ఉన్న నాయకుడు స్వయంగా వెళ్లి గవర్నర్‌కు రాజీనామా సమర్పించడం మర్యాద. ఇది రాజకీయ సంప్రదాయం కూడా. తెలంగాణతో పాటే ఎన్నికలు జరుపుకొన్న రాజస్థాన్ ముఖ్యమంత్రి ఈ మర్యాదను పాటించిన ఉదాహరణ ఎదురుగానే ఉంది. కానీ కేసీఆర్ తన ఓఎస్‌డీ ద్వారా గవర్నర్‌కు రాజీనామా లేఖను పంపించి గజ్వేల్‌లోని ఫామ్ హౌస్‌కు వెళ్లిపోవడం మంచి సంప్రదాయం కాదని చెప్పక తప్పదు. గెలిస్తే సరే, ఓడినా కూడా రెండు దఫాలు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి తన సొంత పార్టీ కార్యకర్తల పట్ల చూపవలసిన కనీస బాధ్యతను కూడా కేసీఆర్ ఎందుకు చూపలేకపోయారు? ఆయన కాకుండా పార్టీ నేతగా ఆయన కుమారుడు కేటీఆర్ ధన్యవాదాలు తెలియచేసే బాధ్యతను స్వీకరించడం కూడా సరైనది కాదు. కేసీఆర్‌కూ గవర్నర్‌కూ విభేదాలు ఉండ వచ్చు. అయినా ఒక ప్రజానాయకునిగా కేసీఆర్ తన బాధ్యతను తాను నిర్వర్తించి ఉండవలసింది కాదా! రాజస్థాన్‌లో కూడా సొంత పార్టీ నియమించిన గవర్నర్ లేరు. అధికారం నుంచి దిగిపోతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. గవర్నర్ కేంద్రంలో బీజేపీ నియమించినవారే. మరి ఆయన ఆ మర్యాద ఎందుకు చూపించారు?

ఆత్మ గౌరవం అంటే అహంకార ప్రదర్శన కాదు. ఈ సంగతి కేసీఆర్‌కు ఎవరైనా ఇంకా ముందే గుర్తు చేసి ఉండవలసింది. ఈ ఎన్నికలలో కేసీఆర్–బీఆర్ఎస్ ఓటమి రాష్ట్రాన్ని 'అభివృద్ధి చేయనందుకు' అని ఒక్కమాటలో చెప్పలేం. అందుకు ఆ పార్టీ అంతో ఇంతో చేసింది. మన్ను తిన్న పాములా పడి ఉన్న కాంగ్రెస్ ఆరేడు మాసాలలోనే ఇంత ఫలితం సాధించడానికీ, బీఆర్ఎస్ ఓడిపోవడానికీ కారణం కేసీఆర్ అహంకార ధోరణి! అది బీఆర్ఎస్ గుర్తించవలసి ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని గౌరవించని నాయకుడు అంటే, ప్రజానీకాన్ని గుర్తించని నాయకుడనే. ఇక్కడ ఓడిపోయినది అలాంటి నాయకుడే! ప్రజలకు దూరమైన నాయకుడే!!

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్
ఈ–మెయిల్: pvg@ekalavya.net

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### చీకటి దినమే!



ఇండియాకు సంబంధించి డిసెంబర్ 6 ఎప్పటికీ చీకటి దినమే! హింసాత్మక కాషాయ గూండాల వల్ల ఆ రోజు ఒక చారిత్రక మసీదు నేలమట్టం కావడమే కాదు, భారతీయ ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులం అని అనుకునేట్టు చేసింది. ఇక మోదీ భారతం మనం ఇప్పటికీ ఆ రోజు నుంచి కోలుకోలేదని గుర్తుచేస్తుంటుంది.

– అర్ఫా ఖానమ్ షేర్‌వాణీ, జర్నలిస్ట్

### సాంస్కృతిక నరమేధం



భారతదేశానికి చీకటి రోజు ఎప్పుడంటే – ఇస్లాం మూఢవిశ్వాసి అయిన బాబర్... రామ జన్మస్థలాన్ని ధ్వంసం చేసి, అక్కడి విగ్రహాలను విరూపం చేసి, ఒక భయానక సాంస్కృతిక నరమేధానికి సంకేతంలా మిగిలిన ఆలయ శిథిలాలతో మసీదును నిర్మించడం! నిజంగా ఏమాత్రం భారతీయత మిగిలినవాళ్లయినా ఈ హింసను తీవ్రవాదంగా పరిగణించి దుఃఖపడతారు.

– సావిత్రీ ముముక్షు, విశ్లేషకురాలు

### సమితి ప్రేమ



బాధితులు కనుక యూదులు కాకపోయుంటే ఐక్యరాజ్య సమితి మౌనంగా ఉండిపోయేదా? లేదు. ఇది కచ్చితంగా నిర్వహణ లోపం కాదు. యూదు వ్యతిరేకత! ఒక్క పన్ను చెల్లింపుదారు కూడా ఇకమీదట ఐరాసకు నిధులు ఇవ్వకూడదు. నేటికి కూడా ఆ సంస్థ అక్టోబర్ 7 నాటి హమాస్ దురాగతాన్ని గట్టిగా ఎందుకు ఖండించలేక పోతోంది?

– మైక్ లీ, యూఎస్ సెనేటర్

### అందుకే డిఫరెంట్



మీలో ఎందరు గాడ్‌ఫాదర్ నవలను చదివారో తెలియదుగానీ, (గాడ్‌ఫాదర్) సినిమా మైకేల్ కార్లియోనీ సోదరుడు సనీ కార్లియోనీ పాత్రకు న్యాయం చేయలేదు. యాభై ఏళ్లుగా అందరు దర్శకులూ మన హీరోలను మైకేల్ పాత్ర ఆధారంగా మలిచారు, నాతో సహా ('సర్కార్'లో అభిషేక్ బచ్చన్). ఒక్క సందీప్ రెడ్డి వంగా మాత్రమే మైకేల్‌ను చెత్తబుట్టలో వేసి, సనీని హీరో చేశాడు ('యానిమల్'లో). అన్నట్టూ, 'సర్కార్'లో కేకే మీనన్ పోషించిన విష్ణు పాత్రకు నమూనా సనీ!

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు



## జనాభా పెరగాలా?

రష్యా, ఉత్తర కొరియాలు ప్రస్తుతం జనాభా కొరతను ఎదుర్కొంటున్నాయి. అందుకే ఈ రెండు దేశాల అధీశులూ తమ తమ దేశాల్లో ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. గతంలో రష్యాలో మహిళలు ఎక్కువ మంది పిల్లలను కంటే ప్రభుత్వం ఓ బిరుదు ఇచ్చేది. ప్రసుతం ఉక్రెయిన్‌తో యుద్ధంలో తల మునకలుగా ఉన్న రష్యాలో జనాభా గణనీయంగా తగ్గిపోయిందనీ, దేశ జనాభా పెంచు కోవాలనే తలంపు రష్యాలో బలంగా కనిపిస్తోందనీ వార్త. పిల్లలు ఉంటే దేశ రక్షణకు, భద్రతకు ముప్పు ఉండదు అని పుతిన్ అభిప్రాయంగా ఉంది. అదే అభిప్రాయంతో ఉత్తర కొరియా కూడా ఉంది. ఈ దేశంలో గత పది సంవత్సరాలుగా జననాల రేటు తీవ్రంగా తగ్గిపోయిందనీ, పొరుగు దేశం దక్షిణ కొరియా చెబుతోంది. దీనికి స్పందిస్తూ ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ దేశం బలంగా ఉండాలంటే జననాలను పెంచటం ప్రతి మహిళ విధి అని చెప్పారు. గత ఆదివారం జరిగిన 'నేషనల్ మదర్స్' సమావేశంలో కిమ్ ఈ మాట అన్నారు. జనాభా పెరగడం వల్ల అప్పుడ దేశ భద్రత పెరుగుతుందన్నారు. అదే సమయంలో పిల్లల సంరక్షణ, వారి విద్య, వారి సామర్థ్యం తల్లులతోనే సాధ్యం అవుతుందని అన్నారు. అయితే ఉత్తర కొరియా తమ దేశ జనాభా ఎంత అనేది తెలపడం లేదు. పిల్లలకు చదువు చెప్పించటం, వారి అలనా పాలనా చూడడం అనేవి చాలా వ్యయ, ప్రయాసలతో కూడుకున్న వ్యవహారాలు. అందుకే ఉత్తర కొరియాలో అనేక కుటుంబాలు ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనేందుకు సిద్ధంగా లేవని కొంత మంది వాదన. ఉత్తర కొరియా ఎక్కువగా కార్మికులపై ఆధార పడిందనేది సత్యం. ఆర్థిక వ్యవస్థ కూడా కాస్త దెబ్బ తిన్నది. అందు నిమిత్తమే అది జనాభా పెరుగుదలపై ఎక్కువగా దృష్టి పెట్టలేదని తెలుస్తోంది.

ఇప్పుడు రష్యా, ఉత్తర కొరియా దేశాలు ఎక్కువ మంది పిల్లలను కంటే ఆ యా కుటుంబాలకు ఏ ప్రయోజనాలు ఉంటాయో తెలుపవలసి ఉంది. ఆ దేశాలలోని ప్రభుత్వాలు కుటుంబాలకు తగిన భరోసా ఇస్తేనే జనాభా పెరగడానికి అవకాశం ఉంటుంది. తద్వారా జనాభా కొరత ఈ దేశాలకు ఉండకపోవచ్చు. తగిన భరోసా ఇవ్వకపోతే ఎట్టి పరిస్థితులలోనూ జనాభా పెరగదు. మహిళలు కూడా పిల్లలను కనడానికి ఆసక్తి చూపరు. ఈ విషయం రెండు దేశాలూ గ్రహిస్తే చాలు. పిల్లల చదువుకూ, వారి వికాసానికీ తగిన వనరులు ఆ యా దేశాలు కల్పించాలి. అప్పుడే జనాభా పరిపుష్టిగా ఉంటుంది.

– కనుమ ఎల్లా రెడ్డి; పౌరశాస్త్ర అధ్యాపకులు, తాడిపత్రి

# ఇంకా ఎందుకీ విదేశీ మొగ్గు?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"భారత భూమి మీద పిల్లల్ని కనడం అమెరికాకు దత్తత ఇవ్వడానికేనని తెలిసుంటే... ప్రసవానికొక పునర్జన్మ నెత్తకపోదును... అమెరికా ఖజానా నింపుకొనే యుద్ధంలో/ బిడ్డను యుద్ధభూమికి అంకిత మిచ్చిన తల్లిగుండె/ కన్నీ రింకిన మేఘాలై వర్షిస్తుంది/ స్వార్థ సామ్రాజ్య నేతలకు/ తల్లి ఉసురు తగలకపోదు."

– కవయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద

ఇంతకూ అన్ని వసతులు, సౌకర్యాలు పొదిగి ఉన్న భారత భూమిని వదిలేసి మన యువత పరాయి పంచలలో విద్య కోసం, ఉద్యోగాల కోసం ఎందుకు ఎగబడవలసిన దుస్థితి వచ్చింది? భారత పాలనా చక్రాలు, దేశ నేతలు... జాతీయ స్థాయి విద్య, ఉపాధి సౌకర్యాలు దేశ యువతకు అందించలేక పోవడానికి దేశంలో తగిన వనరులు లేక కాదు. భారత సెక్యులర్ రాజ్యాంగం అందించిన దేశీయ వనరుల వినియోగానికి సంబంధించిన అధ్యాయాలను అడ్డదిడ్డమైన నిబంధ నలతో జత చేసినందున దేశ పౌరులు ప్రయోజనం పొందలేక పోతున్నారు. సంపన్న గుత్త వర్గాలు ఈ అవకతవకల ఆధారంగా దేశ వనరులను యథేచ్ఛగా సొంతం చేసుకుని పౌరులకు దేశీయ విద్య, ఉద్యోగ అవకాశాలను దెబ్బ తీస్తున్నారు. ఫలితంగా విదేశీ విద్య, ఉపాధి వనరులనన్నా సద్వినియోగం చేసుకొని బతుకుదామన్న తపనలో ఈ వ్యామోహాన్ని తల్లిదండ్రులు పెంచుకోవలసి వచ్చింది.

ఈ వాస్తవాన్ని మన దేశం దృష్టికి మొదటిసారిగా పాతికేళ్లనాడే – ఎవరో కాదు, భారతదేశంలోని అమెరికా రాయబారే తీసుకొచ్చాడు. "అమెరికా ఆర్థిక వ్యవస్థ బాగు పడటానికి విద్య, ఉద్యోగార్థులై అమెరికాకు వస్తున్న భారతీయులు ఎంతగానో దోహదపడుతున్నారు" అని ఆయన కీర్తించిన సంగతి మనం మరచిపోరాదు. ఈ పాతికేళ్లుగానూ ఈ పరిస్థితిలో మార్పు లేదు. అంటే, భారత పాలకులు దేశంలో విద్య, ఉద్యోగ వనరులను భారత యువతకు కల్పించకుండా పరాధార మనస్తత్వానికి అలవాటు పడిన ఫలితంగా ఈ దుస్థితి దాపురించి కొనసాగుతోందని మరచిపోరాదు.

ఈ దశలో గత పాతికేళ్లుగా పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభలకు ప్రజా ప్రతినిధుల పేరిట ఎన్నికవుతూ వస్తున్న వివిధ పార్టీల ఛోటా – మోటా రాజకీయ నాయకులు తమ ఆస్తులకు మించిన ధనరాసులతో ఎలా తూగుతూ తమ అవినీతి సామ్రాజ్యాలను నిర్మించుకుంటూ వస్తున్నారో 'ఏడీఆర్' సాధికార నివేదికలు బట్టబయలు చేస్తున్నాయి. అయినా మార్పు లేదు. ఈ పరిస్థితుల్లో దేశంలో విద్య, వైద్యాభివృద్ధి వనరులు ప్రజలకు ఇబ్బడి ముబ్బడిగా ఎలా, ఎక్కడినుండి లభిస్తాయి? అందుకే నన్నయ మహాకవి మహాభారతం 'ఆదిపర్వం'లోనే 'సరమ' అనే కుక్కపిల్ల ద్వారా సార్వకాలికమైన విజ్ఞానాన్ని ప్రజలకు పంచిపెట్టాడు. 'ఆదిపర్వం' తొలి ఆశ్వాసంలో పాండవుల ముని మనుమడైన జనమేజయ మహారాజు నిర్వహించిన ఒక యజ్ఞం గురించి ప్రస్తావిస్తాడు. ఆ యజ్ఞ భూమికి 'సరమ' అనే కుక్క పిల్ల వస్తే అపవిత్రంగా పరిగణించి జనమేజయుడి సోదరులు దాన్ని దారుణంగా కొట్టి బయటకు పంపించివేస్తారు. ఆ 'సరమ' జరిగిన దారుణాన్ని తల్లికి వివరిస్తుంది. అప్పుడు నీతులు పేదవాళ్ళకే కాదు, అందరికీ వర్తించాలనీ, ఈ పని చేయడం తగునా, తగదా అన్న ఆలోచన, సార్వకాలిక సత్యం అందరూ పాటించాలనీ 'సరమ' తల్లి బోధిస్తుంది.

రెండో మాట



ఇక, 'మట్టి'కి అనువాదం 'రైతు' అని చెబుతూ గ్లోబలైజేషన్ పేరిట 'చాపకింద నీరులా' జరుగుతున్న తతంగం ఏమిటో మరొక ఆధునిక కవి ఇలా వర్ణించాడు:

**"కాడెద్దులు పోయి**
**కంప్యూటర్లు వచ్చాయి**
**భుజాల మీద నాగలి పోయి**
**బైలార్స్ ట్రాక్టర్లు వచ్చాయి**
**ఆకలికి తప్ప అన్నిటికీ**
**యంత్రాలు వచ్చాయి."**

అయినా రైతు దుఃస్థితి మారలేదని ఒక కవి స్పందిస్తే– ఇదే సమయంలో 'వానకు కూడా దరిద్రం పట్టుకుంది/ కురవకుండానే రైతు కళ్ళల్లో నీళ్ళు నింపుతోం'దని మరో కవి వ్యంగ్యంగా అంటించాడు. ఇదిలా ఉండగా, మరో కవి ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్ని వర్ణిస్తూ: "కాడికి కంప్యూటర్/ మేడికి కీబోర్డు, వెబ్‌సైట్‌లో విత్తడం, ఇంటర్నెట్‌లో అమ్మడం" అని గ్లోబల్ వ్యవసాయాన్ని వ్యంగ్యంగా చిత్రించాడు. మరో ఆధునిక కవి –

**"కళ్లముందు పంటకల్లం అదృశ్యమైనప్పుడు**
**ఇళ్లల్లో దూలాలకు వేలాడేవి**
**విత్తనాల సంచులు కాదు – రైతుల శవాలు"** అని ఆక్రోశించాడు.

ఇలాంటి నిరాశావాదానికి విరుగుడు అన్నట్టు, రైతుకు బలంగా కొమ్ముకాస్తూ, రాబోయే మంచిరోజుల్ని తలచుకొని, రైతు ఆగ్రహిస్తే వచ్చే పరిణామాన్ని వివరిస్తూ, ఆహ్వానించదగ్గ ఆశావాదాన్ని కోడూరి విజయకుమార్ ఇలా వ్యక్తం చేశాడు:

**"మట్టి చేతులు కూడా మాట్లాడతాయి**
**వాటి మాటల భాషే వేరు –**
**మట్టి చేతులు మాట్లాడటం ప్రారంభించాక**
**నోళ్లున్న మారాజుల సింహాసనాలే కదిలిపోతాయి**
**ఆ రోజుకి ఎదురు చూడాల్సిందే"!**

కానీ మన నేతలకి నైతికత, విశ్వసనీయత కరువై పోయాయి. దీనికి కారణం అడ్డగోలు సంపాదనల ద్వారా ఎదిగిపోవడం. ప్రజా ప్రాతినిధ్య సభలుగా రాణించవలసిన రాజ్యాంగ సంస్థలను భ్రష్టు పట్టించడం. ఆఖరికి దేశ తొలి ప్రధాన మంత్రి, జాతీయ కాంగ్రెస్ నిర్మాతలలో అగ్రగణ్యుడైన జవహర్‌లాల్ నెహ్రూను నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నాలను చాపకింద నీరులా నేటి పాలక వర్గం చేస్తోంది. పేరును మాయపుచ్చినంత మాత్రాన ఆ వ్యక్తి నెలకొల్పిన మంచి సంప్రదాయాలు చెక్కు చెదిరిపోవు. నెహ్రూ మాదిరిగా తమ కపటాన్ని చీల్చి తమ వ్యక్తిత్వంలోని పరిమితుల్ని అంత బాహాటంగా చెప్పుకున్నవారు లేరు. "నేను ధనిక వర్గంలో పుట్టి పెరిగినందున భావవ్యాప్తిలో కమ్యూనిస్టులు వెళ్లగలిగినంత దూరం వెళ్లలేను" అన్నారు. అందుకే పాలకులకు నైతికత ప్రధాన సూత్రంగా ఉండాలి.

అందుకే ఏ ప్రార్థన చేసినా అది స్వార్థం కోసం కాదు, కార్య సాధన కోసం గుండె ధైర్యం ఇవ్వమని విశ్వకవి రవీంద్రుడు ఎందుకు కోరుకున్నాడో వినండి:

**"నన్ను ప్రార్థించనీ – ప్రమాదాల నుంచి**
**రక్షించమని కాదు**
**ధైర్య సాహసాలతో ఎదుర్కొనే శక్తిని**
**కలిగించమని ప్రార్థించనీ**
**నన్ను కోరుకోనీ**
**నాకు సంభవించే నా బాధలను పోగొట్టమని కాదు**
**కష్టనష్టాలను అతి తేలికగా భరించగలిగే శక్తిని కోరుకోనీ**
**నన్ను ఆశించనీ**
**నా జీవిత పోరాటంలో మిత్రుల సహకారాన్ని**
**దిగ్విజయం పొందడానికి నా స్వంత శక్తిని ఆశించనీ**
**ఓ ప్రభూ!**
**నాకు కలిగే దిగ్విజయాలలో మాత్రం నీ కరుణా**
**కటాక్షాలను స్మరించే పిరికివానిగా చేయకు**
**పరాజయాలలో నీ చేయూత అర్థించనీ"!**

శభాష్, ఈ నిర్మలమైన మనస్సు పాలకుల మెదళ్లను ఏనాటికి కుదిపి కదుపుతుందో!

abkprasad2006@yahoo.co.in

**గ్రహం అనుగ్రహం** శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.దశమి రా.2.43 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** హస్త పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.2.21 నుండి 4.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.01 నుండి 10.49 వరకు, తదుపరి ప.2.28 నుండి 3.16 వరకు, **అమృత ఘడియలు:** రా.12.48 నుండి 2.33 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.21, **సూర్యాస్తమయం:** 5.21.

## క్లుప్తంగా...

### ఆ బిల్లు సంగతి తేల్చండి

- ఎస్సీ రిజర్వేషన్ల పెంపుపై బీఆర్ఎస్ ఎంపీ నామా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్ల పెంపు బిల్లు సంగతి తక్షణమే తేల్చాలని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం 2014, నవంబర్ 29నే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపిందని ఆయన తెలిపారు. బుధవారం లోక్‌సభలో జమ్మూ–కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. జమ్మూ–కశ్మీర్‌లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపు, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు, కశ్మీర్ పండిట్లు, పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ సభ్యత్వం బిల్లుకు మద్దతు తెలిపారు. తెలంగాణలో బీసీలుగా ఉన్న వడ్డెర కులస్తులను ఎస్టీలుగా పరిగణిస్తూ, వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. జమ్మూ–కశ్మీర్ బిల్లులను ఆమోదించడం సమర్థనీయమే కానీ, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 153కు పెంచాల్సి ఉండగా, ఇంతవరకు పెంచలేదని, ఈ అంశాన్ని త్వరితగతిన తేల్చాలని అన్నారు. అలాగే ఏపీకి సంబంధించి 175 అసెంబ్లీ స్థానాలను 225కి పెంచుతామని హామీ ఇచ్చారని నామా సభ దృష్టికి తీసుకువచ్చారు.

### మాజీ మంత్రి చాంబర్ నుంచి ఫర్నిచర్ తరలింపు!

- అడ్డుకున్న ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు



ఫర్నిచర్‌ను తీసుకువెళ్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రవీంద్రభారతిలో ఉన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చాంబర్ నుంచి కొందరు ఫర్నిచర్‌ను తీసుకువెళ్లడం ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం కొంతమంది వ్యక్తులు ఫర్నిచర్‌ను తీసుకువెళుతుండగా ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఆ వ్యక్తులకు, ఓయూ జేఏసీ నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రభుత్వానికి సంబంధించిన ఫర్నిచర్‌ను ఎలా తీసుకువెళతారని జేఏసీ నాయకులు వారిని ప్రశ్నించారు. దీంతో వారు ఫర్నిచర్‌ను అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఈ ఘటనపై టీజీఓ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ, తమ కార్యాలయంలో వినియోగించుకునేందుకు ఆ ఫర్నిచర్‌ను తీసుకువెళ్లాలనుకున్నామని, అయితే అది ప్రభుత్వానిదని తెలియడంతో ఆ ప్రయత్నం మానుకున్నామని తెలిపారు.

# రూ. లక్ష పెంచితేనే 'డబుల్ బెడ్రూం' ఇళ్ల పనులు!

- అలా అయితేనే పనులు చేస్తామంటూ కాంట్రాక్టర్ల అల్టిమేటం
- కొత్త ప్రభుత్వానికి ప్రతిపాదించనున్న అధికారులు
- ఇంకా పూర్తి చేయాల్సిన ఇళ్లు 74 వేలు

సాక్షి, హైదరాబాద్: నిర్వహణ లోపాలతో ఇప్పటికే అస్తవ్యస్తంగా మారిన రెండు పడక గదుల ఇళ్ల విషయంలో కొత్త సమస్య తలెత్తింది. ప్రాజెక్టు యూనిట్ కాస్టును భారీగా పెంచాలని కాంట్రాక్టర్లు గృహనిర్మాణ సంస్థకు తేల్చి చెప్పారు. ఒక్కో ఇంటిపై రూ.లక్ష చొప్పున యూనిట్ కాస్టును సవరించాలని, లేని పక్షంలో పనులు కొనసాగించలేమని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఇప్పుడు అధికారులు ఇదే విషయాన్ని కొత్త ప్రభుత్వం ముందు ప్రతిపాదించనున్నారు. అసలే ఖజానాకు తీవ్ర భారంగా మారిన ఈ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టి గృహలక్ష్మి పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. పనులు ప్రారంభించిన ఇళ్లను మాత్రం పూర్తి చేసి, టెండర్లు పిలవాల్సిన వాటిని ప్రారంభించకపోవటమే మంచిదన్న అభిప్రాయం అప్పట్లో వ్యక్తమైంది. ఇప్పుడు కాంట్రాక్టర్ల కొత్త డిమాండ్‌తో, అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయటం కొత్త సవాల్‌గా మారబోతోంది.



**ఎందుకు పెంచుతున్నారంటే..**

ఇల్లు లేని పేదలకు ఏకంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఉచితంగా అందించాలని అప్పట్లో బీఆర్ఎస్ సర్కారు నిర్ణయించిన విషయం తెలిసిందే. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కావటంతో ఒక్కో ఇంటికి ప్రాంతాల వారీగా రూ.5.10 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. కానీ, ఆ మొత్తం కూడా సరిపోదని, యూనిట్ కాస్టును పెంచాలని పథకాన్ని ప్రారంభించిన కొత్తలోనే కాంట్రాక్టర్లు కోరారు. దీంతో చాలా ప్రాంతాల్లో టెండర్లకు స్పందన కూడా లేకుండా పోయింది. కాంట్రాక్టర్లతో పలువురు మంత్రులు స్వయంగా భేటీ అవుతూ, ఇతర ప్రాజెక్టుల్లో పనులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొనటంతో కొన్ని ప్రాంతాల్లో టెండర్లకు స్పందన వచ్చింది. ఆ క్రమంలో పనులు మొదలైనా, ఆ యూనిట్ కాస్ట్‌తో ప్రాజెక్టులు పూర్తి చేయటం కష్టమంటూ చాలా మంది పనులను నెమ్మదిగా చేస్తూ వచ్చారు. తాజాగా ఇప్పుడు యూనిట్ కాస్టును పెంచకుంటే పనులు చేయలేమని, ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని, రూ.లక్ష మేర పెంచాలంటూ ఇటీవల వారు ప్రతిపాదించినట్టు తెలిసింది.

**ఈ ఇళ్లను పూర్తి చేసేందుకు రూ.4500 కోట్లు అవసరం**

రాష్ట్రవ్యాప్తంగా 2.93 లక్షల ఇళ్లను నిర్మించేందుకు పరిపాలన అనుమతులు ఇవ్వగా, 2.29 లక్షల ఇళ్లకు టెండర్లు పూర్తయ్యాయి. వీటిల్లో ఇప్పటి వరకు 1.55 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. ఇంకా 74 వేల ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. వీటిల్లో 45 వేలు తుది దశలో ఉన్నాయి. వీటిని కచ్చితంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో యూనిట్ కాస్ట్ పెంచాల్సిందే. ఈ మేరకు ఈ ఇళ్లను పూర్తి చేసేందుకు రూ.4500 కోట్లు అవసరం. కాగా, లబ్ధిదారుల జాబితా రూపొందించకుండానే పనులు జరుపుతున్న తీరును తప్పుపడుతూ కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాసయోజన నిధులు ఇచ్చేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. దీంతో నిధుల కోసం తీవ్ర ఇబ్బందులు ఉన్న తరుణంలో, అదనంగా భారం పడటం పథకానికి శరాఘాతంగా మారనుంది.



ఎల్ఐసీ పెద్దమ్మగుడి డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న ఎల్ఐసీ జోనల్ మేనేజర్ ఎల్‌కే శ్యాంసుందర్

### పెద్దమ్మగుడి మెట్రో స్టేషన్ పేరు మార్పు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని పెద్దమ్మగుడి మెట్రో స్టేషన్ పేరు మార్చారు. ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి పేరుతో ఈ మెట్రో స్టేషన్ కొనసాగుతోంది. ఇకనుంచి దీనిని ఎల్ఐసీ పెద్దమ్మగుడి మెట్రోస్టేషన్‌గా పిలవనున్నారు. బుధవారం ఇందుకు సంబంధించిన నేమ్‌ప్లేట్‌ను ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ మేనేజర్ కె. శ్యాంసుందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఎం ఉతుప్ జోసెఫ్, జీవన్ ఉత్సవ్, ఎల్అండ్‌టీ ఎండీ సీఈఓ కేవీబీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ... ఎల్ఐసీ పెద్దమ్మగుడి స్టేషన్‌తో పాటు ఎల్ఐసీ ఎంజీబీఎస్ స్టేషన్ కూడా పేరు మార్చినట్లు వెల్లడించారు.



# శతశాతమే 'లక్ష్య'ం

- టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణతకు వ్యూహం
- తొలి గంట అదనంగా తరగతులు
- రోజుకో సబ్జెక్టుపై పునశ్చరణ
- జనవరి నుంచి మరో గంట అదనం
- పాఠశాల విద్యాశాఖ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పాఠ శాల విద్య డైరెక్టరేట్ కార్యా లయం ఈ మేరకు జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేస్తూ..'లక్ష్య' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని కార్యాచరణలోకి తెచ్చింది. ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా చూడటం దీని ఉద్దేశం. ఎన్నికలు కూడా ముగియడంతో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు టెన్త్ విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలని డీఎస్ఈ సూచించింది. వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక బోధన చేపట్టాలని ఆదేశించింది. వీలైనంత త్వరగా సిల బస్ పూర్తి చేసి, జనవరిలో పునశ్చరణకు వెళ్లాలని పేర్కొంది. లక్ష్యం సాధించిన పాఠశాలలకు అవార్డు లిచ్చే అంశాన్ని కూడా ఉన్నతాధికారులు పరిశీలిస్తు న్నారు. టెన్త్ పరీక్షలు మార్చి, ఏప్రిల్ నెలలో జరుగుతాయి. ప్రైవేటు పాఠశాలలు ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి, పరీక్షలకు సన్నద్ధమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలపై మరింత దృష్టి పెట్టాలని అధికారులు భావిస్తున్నారు.

**ప్రభుత్వ స్కూళ్లపైనే..:** రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థల పాఠశాలల్లో టెన్త్ ఫలితాలు తక్కువగా నమోదవుతున్నాయి. 2023లో జెడ్పీ పాఠశాలల నుంచి 1,39,922 మంది టెన్త్ పరీక్షకు హాజరైతే, 1,10,738 మంది మాత్రమే ఉత్తీర్ణుల య్యారు. అంటే 79.14 శాతం రిజల్ట్ నమోదైంది. ప్రభుత్వ స్కూళ్లలో 21,495 మంది పరీక్ష రాస్తే, 15,561 (72.39 శాతం) మంది పాసయ్యారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 98 శాతం, గురుకు లాల్లో 95 శాతం ఫలితాలొచ్చాయి. ఇది ప్రైవేటు పాఠశాలకన్నా ఎక్కువ. అయితే ప్రభుత్వ, జెడ్పీ స్కూళ్లల్లో ఫలితాలపై ఈసారి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

**ఆ సబ్జెక్టులపైనే దృష్టి:** ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎక్కు వగా మేథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఎక్కువగా ఫెయిల్ అవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సబ్జెక్టులపై ప్రత్యేక బోధనకు ప్లాన్ చేశారు. టెన్త్ విద్యార్థులకు ఉదయం గంట అదనంగా క్లాసులు తీసుకుంటారు. వారంలో 3 సబ్జెక్టులు రోజుకు ఒకటి చొప్పున చేపట్టాలని నిర్ణయించారు. ఇది కూడా సంబంధిత సబ్జెక్టులో కఠినంగా ఉండే చాప్టర్లను ఎంపిక చేసుకోవాలని పాఠశాలలకు సూచిస్తున్నారు. జనవరి ఆఖరివారం లేదా ఫిబ్రవరి నుంచి సాయంత్రం కూడా అదనంగా మరో గంట ప్రత్యేక బోధన చేపట్టాలని నిర్ణయించారు. దీనివల్ల టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం సాధ్యమనేది అధికారుల ఆలోచన.

**టెన్త్ ఫలితాలు ఇలా...**

| సంవత్సరం | పరీక్ష రాసినవారు | ఉత్తీర్ణులు | ఉత్తీర్ణత శాతం |
|---|---|---|---|
| 2015 | 5,13,473 | 3,98,253 | 77.56 |
| 2016 | 5,19,494 | 4,44,808 | 85.62 |
| 2017 | 5,07,938 | 4,27,414 | 84.15 |
| 2018 | 5,01,732 | 4,20,307 | 83.77 |
| 2019 | 5,06,202 | 4,67,859 | 92.43 |
| 2020 | 5,08,960 | 5,08,953 | 99.99 |
| 2021 | 5,16,545 | 5,16,545 | 100 |
| 2022 | 5,03,579 | 4,53,201 | 90.00 |
| 2023 | 4,84,370 | 4,19,460 | 86.60 |

## డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలి

- ఏపీ ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు
- తెలంగాణలో ఓటు వేసిన వారిని ఏపీలో ఓటేయకుండా చూడాలని వినతి
- చంద్రబాబు దుష్ప్రచారాలను నమ్మొద్దు
- ప్రజలకు మంత్రుల వినతి



ఏపీ ఎన్నికల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేస్తున్న మంత్రులు, నేతలు

సాక్షి, అమరావతి: తెలంగాణలో ఓటు వేసిన వారిని తిరిగి ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వేయకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ నేతలు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో బుధవారం మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, శాసన మండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ గురుమూర్తి, గోరంట్ల మాధవ్ తదితరులు మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలనేది సీఎం జగన్ ఆకాంక్షగా చెప్పారు. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్టని, మోసాలు చేయడమే ప్రధాన అజెండాగా పెట్టుకుని పనిచేస్తున్నారని ఆరోపించారు. ఒక సామాజికవర్గానికి చెందిన కొంతమంది ఓట్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్నాయని తెలిపారు. డూప్లికేట్ ఓట్లను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు తాను చేసిన తప్పులను ఇతరులపైకి నెడతూ తనకున్న పచ్చమీడియా సహకారంతో దుష్ప్రచారానికి ఒడిగడుతుంటారని, ఢిల్లీ వెళ్లి జాతీయ మీడియాలో అబద్ధాలు చెప్పేందుకు యత్నిస్తున్నారని.. ఆయన మాటలను ప్రజలు నమ్మొద్దని సూచించారు.

**హైదరాబాద్, ఏపీలో కలిపి 4 లక్షల 30 వేల 264 డూప్లికేట్ ఓట్లు**

మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ హైదరాబాద్, ఏపీలో రెండుచోట్ల కలిపి 4 లక్షల 30 వేల 264 డూప్లికేట్ ఓట్లున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని ఆధారాలతో సహా ఎన్నికల కమిషన్‌కు ఇచ్చినట్టు తెలిపారు. ముఖ్యంగా డబుల్ ఎంట్రీలను తొలగించాలని కోరినట్టు తెలిపారు. అర్హులైన వ్యక్తికి దేశంలో ఒకేచోట ఓటు ఉండాలనేది వైఎస్సార్‌సీపీ విధానమన్నారు. ఇదే అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ఎన్నికల కమిషన్‌కు తెలియచేశామని, తాము అందించిన ఆధారాలను పరిశీలించి ఇలాంటి ఓట్లపై విచారణ జరిపించి.. తొలగించాలని కోరినట్టు వివరించారు.









# ఇక 'పంచాయతీ' సమరం!

▶ మొదటి పేజీ తరువాయి

మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉంది. జీపీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ ఆఫీసర్లు, పోలింగ్ సిబ్బంది ఎంపిక, నియామకం అనేది కీలకమైన నేపథ్యంలో ఈ నెల 30 లోగా దీనికి సంబంధించిన కసరత్తు పూర్తి చేయాల్సిందిగా కలెక్టర్లను ఎస్ఈసీ ఆదేశించింది. ఈ ఎన్నికల నిర్వహణ, శిక్షణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్ సర్క్యులర్ పంపించారు. పోలింగ్ బూత్‌లలో 200 మంది ఓ టర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారిని నియమించాలని సూచించారు. 201 నుంచి 400 ఓటర్ల దాకా ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులను, 401 నుంచి 650 వరకు ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాలని తెలిపారు. ఏదైనా వార్డులో ఓటర్ల సంఖ్య 650 దాటితే రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా ప్రతి జిల్లాలో 3 విడతలుగా ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ ఏర్పాట్లు చేస్తున్నందున, మొదటి దశలో ఎన్నికలు నిర్వహించిన రిటర్నింగ్, ప్రిసైడింగ్, పోలింగ్ ఆఫీసర్ల సేవలను మూడో దశ ఎన్నికల నిర్వహణకు ఉపయోగించుకోవాలని సూచించారు.

## భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

- రాష్ట్ర గవర్నర్ తమిళిసై



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ తమిళిసై

కవాడిగూడ (హైదరాబాద్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప నాయకుడని, భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. అనంతరం టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుకరాజు, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు మాదిగలు మాట్లాడుతూ, నూతనంగా ఏర్పాటుకానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య, డిక్కీ సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు నర్రా రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, మాదిగ సంఘాల ఫ్రంట్ అధ్యక్షుడు కొక్కెర భూమన్న, డిక్కీ సంస్థ ప్రతినిధులు బీఎస్ఎన్ మూర్తి, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగా శ్రీనివాస్‌తోపాటు వివిధ దళిత సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు. కాగా, ఎమ్మెల్యే రాజాసింగ్ అంబేడ్కర్‌కు నివాళి అర్పించిన సమయంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, దళిత సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. రాజాసింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. కాగా, పంజాగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని తాను ఏర్పాటు చేయాలనుకున్న స్థలంలో ప్రభుత్వమే విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, కాబట్టి మదీన చౌరస్తాలో ఏర్పాటు చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో 5,764 కిలోమీటర్ల రైల్వే లైన్లను విద్యుదీకరించాం: అశ్వినీ వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 5,764 కిలోమీటర్ల రైల్వే లైన్లను విద్యుదీకరించామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2014 నుంచి 2023 అక్టోబర్ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 3,841 కిలోమీటర్లు, తెలంగాణలో 1,923 కిలోమీటర్లు విద్యుదీకరించామని ఆయన పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లలో దేశ వ్యాప్తంగా పలురాష్ట్రాలలో మొత్తం 38,650 కిలోమీటర్లు రైల్వే లైన్లను విద్యుదీకరించామని తెలిపారు.

## కొత్త ఎమ్మెల్యేల్లో 82 మందిపై కేసులు

- కాంగ్రెస్‌లో 51 మంది, బీఆర్ఎస్‌లో 19, బీజేపీలో ఏడుగురు, ఎంఐఎంలో నలుగురు, సీపీఐ నుంచి ఒకరు
- 119 మందిలో 114 మంది కోటీశ్వరులు
- ఏడీఆర్, ఎలక్షన్ వాచ్ నివేదిక విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన మొత్తం 119 మంది ఎమ్మెల్యేల్లో 82 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో అందరికంటే ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ 85 మందికి సీట్లు కేటాయించగా వారిలో 51 మంది విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. బీజేపీ నుంచి బరిలో నిలిచిన 79 మందిలో ఏడుగురు, బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన 57 మందిలో 19 మంది, ఏఐఎంఐఎం కేటాయించిన ఐదుగురిలో నలుగురు గెలిచా రు. కాగా సీపీఐ నుంచి గెలిచిన కూనంనేని సాంబశివరా వుపై కూడా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), తెలంగాణ ఎలక్షన్ వాచ్ సంస్థలు వెల్లడించాయి. 119 నియోజకవర్గాల్లో గెలుపొందిన ఎమ్మెల్యేల అఫిడవిట్ల ఆధారంగా ఈ సంస్థలు బుధవారం ఒక నివేదికను విడుదల చేశాయి.

**ఆస్తుల్లో అగ్రస్థానంలో వివేక్**

ప్రధాన రాజకీయ పార్టీల నుంచి గెలిచిన 119 మందిలో 114 (96%) మంది కోటీశ్వరులు ఉన్నారు. అత్యధికంగా కాంగ్రెస్ నుంచి 60 (94%) మంది, బీఆర్ఎస్ నుంచి 38 (97%) మంది, బీజేపీ నుంచి 8 (100%) మంది, ఏఐఎంఐఎం నుంచి ఏడుగురు (100%), సీపీఐకి చెందిన ఒకరు (100%) తమకు కోటి రూపాయలకు పైగా ఆస్తులు ఉన్న ట్లు వెల్లడించారు. చెన్నూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన గడ్డం వివేకానంద్ (కాంగ్రెస్) తన ఆస్తుల విలువ రూ.606+ కోట్లుగా ప్రకటించి ప్రథమ స్థానంలో నిలిచారు. రూ.458+ కోట్లతో మునుగోడు కాంగ్రెస్ ఎమ్మె ల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రూ.433+ కోట్లతో పాలేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రూ.58+ కోట్లు, సిరిసిల్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.తారక రామారావు రూ.53+ కోట్లు, సీఎల్పీ నాయకుడు, టీపీసీ సీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రూ.30+ కోట్ల ఆస్తులు ప్రకటించారు. రూ.24+ లక్షలతో ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అతి తక్కువ ఆస్తులు ఉన్న ఎమ్మెల్యేగా నిలిచారు. రూ.28+ లక్షలతో దేవరకొండ కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలు నాయక్ నెనావత్, రూ.56+లక్షలతో అశ్వారావు పేట కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదినారాయణలు తదుపరి స్థానాల్లో ఉన్నారు. 2023లో గెలిచిన అభ్యర్థుల సగటు ఆస్తులు రూ. 38.88 కోట్లు కాగా.. 2018లో గెలిచిన ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.15.71 కోట్లు కావడం గమనార్హం.

**అప్పుల్లో దానం టాప్**

మొత్తం 119 మంది ఎమ్మెల్యేల్లో 61 మంది తమకు రూ. కోటి కంటే ఎక్కువ అప్పులు ఉన్నాయని ప్రకటించారు. రూ.49+ కోట్ల అప్పుతో ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రథమ స్థానంలో నిలిచారు. పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (రూ.43+ కోట్లు), చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద్ (రూ.41+ కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**96 మంది ఎమ్మెల్యేల వయసు 51 పైనే**

తాజా ఎన్నికల్లో గెలిచిన వారిలో 23 (19%) మంది ఎమ్మెల్యేల వయస్సు 25 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండగా, 96 మంది (81%) ఎమ్మెల్యేలు 51–80 సంవత్సరాల మధ్య వయస్సుతో ఉన్నారు. అత్యంత ఎక్కువ వయస్సు ఉన్న ఎమ్మెల్యేగా బాన్సువాడ నుంచి గెలుపొందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి (74) నిలిచారు. అత్యంత పిన్న వయస్కులైన ఎమ్మెల్యేలుగా పాలకుర్తి నుంచి గెలుపొందిన యశస్విని (26), మెదక్ నుంచి గెలిచిన మైనంపల్లి రోహిత్ (26) నిలిచారు. కాగా కొత్త అసెంబ్లీలో 109 మంది పురుషులు, 10 మంది మహిళలు ఎమ్మెల్యేలుగా అడుగుపెట్టనున్నారు.

## నిరుద్యోగ సమస్యకు కొత్త ప్రభుత్వం దారి చూపిస్తుంది

- నిరుద్యోగ విజయోత్సవ ర్యాలీలో ప్రొఫెసర్ కోదండరాం



చిక్కడపల్లి: నిరుద్యోగ సమస్యకు కొత్త ప్రభుత్వం తగిన పరిష్కార మార్గం చూపిస్తుందన్న ఆశాభావాన్ని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ నుంచి నిరుద్యోగ అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ నిరుద్యోగుల ఆశలు నెరవేర్చి ఉద్యోగాలు ఇచ్చే దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ సారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగ సమస్య ప్రధాన అజెండాగా మారిందని, ఇలా జరగడం దేశంలోనే మొదటి సారన్నారు. ఈ మేరకు ప్రతి నిరుద్యోగి తన ఓటు వేయడమే కాకుండా కుటుంబ సభ్యులతో కూడా ఓట్లు వేయించారని, ఆ ఫలితంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోయిందన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, కాంగ్రెస్ నేతలు, విద్యార్థి సంఘాల నేతలు రియాజ్, అశోక్, రఘు, మహిపాల్ రెడ్డి ఈ ర్యాలీలో పాల్గొన్నారు.




# పవర్‌ఫుల్ నిర్మల

## ఫోర్బ్స్ జాబితాలో 32వ స్థానం

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ స్థానం సంపాదించారు. తమ తమ రంగాలను ప్రభావవంతం చేయగల సత్తా, మీడియా, డబ్బు, సమాజంపై ప్రభావం చూపగల భిన్న రంగాల అతివలతో ఈ జాబితాను ఫోర్బ్స్ మేగజైన్ తయారుచేసింది. 2023 ఏడాదికి విడుదలచేసిన ఈ జాబితాలో నిర్మలా సీతారామన్ 32వ స్థానంలో నిలిచారు. నిర్మలతోపాటు మరో ముగ్గురు భారతీయ మహిళలు ఈ జాబితాలో స్థానం సంపాదించారు. హెచ్‌సీఎల్ కార్పొరేషన్ సీఈఓ రోషినీ నాడార్ మల్హోత్రా, స్టీల్ అథారిటీ చైర్‌పర్సన్ సోమా మొండల్, బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా ఈ జాబితాలో ఉన్నారు. రోషినీ 60వ ర్యాంక్, మొండల్ 70వ ర్యాంక్, కిరణ్ 76వ ర్యాంక్ సాధించారు. ఐరోపా కమిషన్ మహిళా చీఫ్ ఉర్సులా వోన్ డీర్ లేయెన్ ఈ జాబితాలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు.రెండో ర్యాంక్‌లో యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ చీఫ్ క్రిస్టినా లగార్డే, మూడో స్థానంలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ నిలిచారు.

## అమెరికాలో మళ్లీ కాల్పుల మోత

ఆస్టిన్(అమెరికా): అమెరికాలో మళ్లీ తుపాకుల మోత మోగింది. గతంలో జైలుకు వెళ్లొచ్చిన 34 ఏళ్ల షేన్ జేమ్స్ అనే వ్యక్తి టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్ నగరంలో నాలుగు వేర్వేరు చోట్ల జరిపిన కాల్పుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు పోలీసులు అధికారులుసహా ముగ్గురు గాయపడ్డారు. నిందితుడిని కారులో వెంబడించి మరీ పోలీసులు అరెస్ట్‌చేశారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం పదిన్నర నుంచి రాత్రి ఏడింటి దాకా ఈ కాల్పుల ఘటనలు జరిగాయి. శాన్ ఆంటోనియో ప్రాంతంలో కాల్పులు జరిపాక 129 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మరో చోటా ఇతను కాల్పులకు తెగబడ్డాడు. ఎందుకు కాల్పులు జరిపాడు? మృతులతో ఈయనకు ఉన్న సంబంధం ఏంటి? అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అమెరికాలో ఈ ఏడాది ఇది 42వ కాల్పుల ఘటన.



## కన్నీటి కిమ్

### సోషల్ మీడియాలో వీడియో వైరల్

ప్యాంగ్యాంగ్: కఠిన ఆంక్షలతో దేశ ప్రజలకు కన్నీరుపెట్టించే ఉత్తరకొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ తాజాగా ఒక కార్యక్రమంలో కంటతడిపెట్టుకున్నారు. సంబంధిత వీడియో ఒకటి ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. అగ్రరాజ్యం అమెరికా సహా పలు దేశాలు ఉత్తరకొరియాపై ఆంక్షల కొరడా ఝుళిపించడంతో ఉత్తరకొరియా పరిస్థితి ఏమాత్రం బాగోలేదని పలు అంతర్జాతీయ కథనాలు కోడై కూస్తున్నాయి. దీంతో రోజు గడవడమే కష్టంగా ఉన్న దయనీయ పరిస్థితుల్లో అక్కడి ప్రజలు పిల్లలను కనడం తగ్గించేశారు. గత ఏడాది ఉ.కొరియాలో జననాల రేటు రికార్డు స్థాయిలో 1.8 శాతానికి పడిపోయింది. జనాభా ఊహించనంతగా తగ్గిపోతుండటంతో దేశాధినేత కిమ్‌కు బెంగ పట్టుకుంది. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అనే నానుడి విన్నాడో ఏమో.. దేశ జనాభా రేటును పెంచాలని కంకణం కట్టుకున్నాడు. అనుకున్నదే తడవుగా తల్లులతో ఇటీవల ఒక సమావేశం ఏర్పాటుచేశాడు. 'జననాల రేటులో తగ్గుదలను అడ్డుకుందాం. జనాభాను పెంచే బాధ్యత మీదే. రాజకీయ పార్టీలో, దేశ వ్యవహారాల్లో ఒడిదుడుకులు ఎదురైన ప్రతీ సందర్భంలో తల్లులనే గుర్తుచేసుకుంటా. కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ అందరి బాగోగులు చూసుకునే తల్లులకు నా ధన్యవాదాలు' అని తల్లులతో మాట్లాడుతూ కిమ్ ఒకింత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నాడు. ప్రస్తుతం ఉత్తరకొరియా జనాభా 2.5 కోట్లు మాత్రమే.

# పెంట్ హౌస్ రూ.1,133 కోట్లు!

## దాని విస్తీర్ణం 22 వేల చదరపు అడుగులు • దుబాయ్‌లో దుమ్ము రేపే రికార్డు



వామ్మో అనుకుంటున్నారా? కానీ ఇది నిజంగా నిజం. దుబాయ్‌లో అత్యంత ఖరీదైన పామ్ జుమేరియా ప్రాంతంలో కడుతున్న కోమో రెసిడెన్సెస్ అనే 71 అంతస్తుల ఆకాశహర్మ్యంపై ఈ పెంట్ హౌస్ రానుంది. ఓ అజ్ఞాత కుబేరుడు దీన్ని ఏకంగా రూ.1,133 కోట్లకు కొనుక్కున్నాడు! ఈ ఐదు పడకగదుల పెంట్ హౌస్ విస్తీర్ణం 22 వేల చదరపు అడుగులు. ప్రపంచ రియల్టీ మార్కెట్లో అత్యంత ఎక్కువ ధర పలికిన మూడో పెంట్ హౌస్‌గా ఇది కొత్త రికార్డు సృష్టించింది. దుబాయ్ వరకూ అయితే దీనిదే రికార్డు. 2027లో కోమో టవర్ నిర్మాణం పూర్తయ్యాక ఇది కొనుగోలుదారుకు అందుబాటులోకి రానుంది! అతని వివరాలను రహస్యంగా ఉంచినట్లు నిర్మాణ భాగస్వామి ప్రావిడెంట్ ఎస్టేట్ పేర్కొంది. అయితే ''ఆ కుబేరుడు తూర్పు యూరప్ ప్రాంతానికి చెందిన వ్యక్తి'' అని ప్రావిడెంట్ ఎస్టేట్‌కు అసోసియేట్ పార్ట్‌నర్ అయిన శామ్ హౌరానీ వెల్లడించారు. రియల్టీ స్వర్గధామమైన దుబాయ్‌లో అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్లు, విల్లాలు, పెంట్ హౌస్‌ల ధరలు చుక్కలనంటడం ఇది తొలిసారేమీ కాదు. కొద్ది నెలల క్రితం మర్సా అల్ అరబ్ హోటల్ పెంట్ హౌస్ ఏకంగా రూ.956 కోట్లకు అమ్ముడైంది.

### ప్రత్యేకతలెన్నో...

ఎన్నెన్నో ప్రత్యేకతలు కోమో రెసిడెన్స్ పెంట్ హౌస్ సొంతం

- ఇందులో 360 డిగ్రీల స్కై పూల్ ఉంటుంది.
- ఇది వ్యూహాత్మకంగా కూడా చాలా కీలకమైన చోట రానుంది.
- దీనిపై నుంచి ఇటు చూస్తే ప్రపంచంలోకెల్లా ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫా. అటు చూస్తే దానికి సాటి వచ్చే బుర్జ్ అల్ అరబ్, దుబాయ్ మరీనా వంటి ఆకాశాన్నంటే నిర్మాణాలెన్నో కనువిందు చేస్తాయి.
- కోమో రెసిడెన్సెస్ టవర్ ఎత్తు 300 మీటర్ల (984 అడుగుల) పై చిలుకే.
- ఇంతా చేసి, ఈ అపార్ట్‌మెంట్‌లో ఒక్కో ఫ్లోర్‌లో కేవలం ఒకట్రెండు ఫ్లాట్లు మాత్రమే ఉంటాయి.
- రెండు నుంచి ఏడు పడకగదులతో కూడుకుని ఉండే ఈ ఫ్లాట్లకు ప్రైవేట్ లిఫ్టులు, ప్రైవేట్ శాండీ బీచ్‌లు, 25 మీటర్ల లాప్ పూల్స్, రూఫ్ టాప్ ఇన్ఫినిటీ పూల్ వంటి చాలా ప్రత్యేకతలుంటాయి.
- ఈ ఫ్లాట్ల ధర రూ.47.5 కోట్ల నుంచి మొదలవుతుంది.

**ప్రపంచ రికార్డు రూ.3,670 కోట్లు**

మొనాకోలోని ఓడియన్ టవర్ పెంట్ హౌస్ రూ.3,670 కోట్లతో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పెంట్ హౌస్‌గా రికార్డు సృష్టించింది. లండన్‌లోని వన్ హైడ్ పార్క్ పెంట్ హౌస్ రూ.1,975 కోట్లతో రెండో స్థానంలో ఉంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

# కశ్మీర్ అసెంబ్లీలో పీఓకేకు 24 సీట్లు!

## పాక్ ఆక్రమిత్ కశ్మీర్ మనదే

- అందుకే 'రిజర్వ్' నిర్ణయం: అమిత్ షా
- కశ్మీరీ నిర్వాసితులకు 2 సీట్లు
- పీఓకే నిర్వాసితులకు ఒక స్థానం
- రెండు బిల్లులకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతానికి 24 సీట్లు రిజర్వు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది! పీఓకే కూడా మన భూభాగమే కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ మేరకు జమ్మూ కశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ (సవరణ), రిజర్వేషన్ (సవరణ) బిల్లులను బుధవారం ఆయన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆరు గంటలపై చిలుకు చర్చ అనంతరం సభ వాటిని ఆమోదించింది. అసెంబ్లీలో సీట్లను పెంచడంతో పాటు పలు కీలక అంశాలు ఈ బిల్లుల్లో ఉన్నాయి. గతంలో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో 83 స్థానాలుండగా వాటిని 90కి పెంచాలని ప్రతిపాదించారు. కశ్మీర్ డివిజన్లో స్థానాలను 46 నుంచి 47కు, జమ్మూ డివిజన్లో 37 నుంచి 43కు పెంచారు. ''పాక్ ఆక్రమిత కశ్మీర్ కూడా భారత్‌లో అంతర్భాగమే. కనుక అక్కడ కూడా 24 స్థానాలను అసెంబ్లీలో రిజర్వు చేశాం'' అని అమిత్ షా సభకు వెల్లడించారు.

**అన్యాయాన్ని సరిదిద్దేందుకే బిల్లులు**

70 ఏళ్లుగా తమ హక్కులన్నింటినీ కోల్పోయి అన్ని విధాలా అన్యాయానికి గురైన కశ్మీరీలకు పూర్తిగా న్యాయం చేయడమే ఈ బిల్లుల ఉద్దేశమని అమిత్ షా చెప్పారు. కశ్మీర్లో ఉగ్రవాదానికి ఇప్పటిదాకా 45 వేల మంది బలయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యమివ్వకుండా మొదట్లోనే ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపి ఉంటే పండిట్లు లోయను వీడాల్సిన అవసరమే వచ్చేది కాదన్నారు. ''కశ్మీర్లో 1947లో 31,789 కుటుంబాలు 1965–71 మధ్య 10,065 కుటుంబాల వారు నిర్వాసితులయ్యారు. ఇక 1980ల్లో ఉగ్రవాదం వల్ల మరెన్నో వేల మంది స్వదేశంలోనే శరణార్థులయ్యారు. వారందరికీ తిరిగి గుర్తింపుతో పాటు హక్కులు, అన్నిరకాల ప్రాతినిధ్యం కల్పించడమే తాజా బిల్లుల లక్ష్యం'' అని వివరించారు. 2024లోనూ కేంద్రంలో మోదీ ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వస్తుందన్న నమ్మకం మాకుంది. అనంతరం రెండేళ్లలో జమ్మూ కశ్మీర్‌ను పూర్తిగా ఉగ్రవాద విముక్తం చేసి తీరతాం'' అని చెప్పారు. ''కశ్మీరీల్లో ఎంతోమంది శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. బిల్లుతో వారికి హక్కులు సమకూరుతాయి. విద్య, ఉద్యోగావకాశాలు వస్తాయి. ఎన్నికల్లో నిలబడి గెలిచే ఆస్కారముంటుంది'' అని తెలిపారు.

### బిల్లుల విశేషాలు..

- జమ్మూ కశ్మీర్లో అసెంబ్లీ స్థానాల సంఖ్య 90కి పెరుగుతుంది.
- ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు అసెంబ్లీలో తొలిసారిగా 9 స్థానాలు రిజర్వు చేశారు.
- కశ్మీర్ నుంచి వలస వెళ్లిన వారి కుటుంబాలకు 2 స్థానాలు కేటాయించారు. వీటిలో ఒక మహిళకు అవకాశమిస్తారు.
- పీఓకే నుంచి నిర్వాసితులై వచ్చి స్థిరపడిన వారికి ఒక స్థానం కేటాయించారు.
- రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలు, వృత్తి విద్యా సంస్థల్లో పలు కేటగిరీల వారికి జమ్మూ కశ్మీర్ రిజర్వేషన్ బిల్లు ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తారు.
- ఆర్థికంగా వెనకబడ్డ వర్గాలకు కూడా రిజర్వేషన్లు అందుతాయి.
- ప్రస్తుత రిజర్వేషన్ చట్టంలోని 'బలహీన, గుర్తింపునకు నోచని వర్గాలు (సామాజిక కులాలు)' అనే పదబంధాన్ని 'ఇతర వెనకబడ్డ'గా మారుస్తారు.
- జమ్మూ కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రాన్ని లద్దాఖ్, కశ్మీర్ అని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తారు.

# నెహ్రూ వల్లే కశ్మీర్లో కుంపట్లు

- అమిత్ షా వ్యాఖ్యలు
- లోక్‌సభలో దుమారం
- కాంగ్రెస్, విపక్షాల వాకౌట్

జమ్మూ కశ్మీర్ ఏడు దశాబ్దాలుగా అనుభవిస్తున్న కష్టనష్టాలన్నింటికీ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన భారీ తప్పిదాలే ఏకైక కారణమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ఆరోపించారు. అవే అక్కడ ఉగ్రవాదానికి, వేర్పాటువాద కుంపట్లకు, పాక్ ఆక్రమిత కశ్మీర్ పుట్టుకకు కారణమయ్యాయని దుయ్యబట్టారు. ''మన సైన్యం పాక్ దళాలను తరిమికొడుతున్న వేళ కశ్మీర్‌ను పూర్తిగా తిరిగి స్వాధీనం చేసుకోక ముందే నెహ్రూ ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించారు. అంతటితో ఆగకుండా కశ్మీర్ అంశాన్ని హడావుడిగా, అనవసరంగా ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చేసిన ఈ రెండు ఘోర తప్పిదాలే కశ్మీర్‌లో ఆరని కుంపట్లకు కారణమయ్యాయి. నెహ్రూది నిజంగా చారిత్రక తప్పిదం!'' అని మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్, విపక్షాలు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చాయి. బీజేపీ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించాయి. షా వ్యాఖ్యలను నిరసిస్తూ వాకౌట్ చేశాయి. అనంతరం అమిత్ షా మాట్లాడుతూ, నెహ్రూయే గనక అప్పట్లో సరైన చర్యలు తీసుకుని ఉంటే కశ్మీర్లో చాలా భాగాన్ని పాక్‌కు కోల్పోయేవాళ్లమే కాదని పునరుద్ఘాటించారు. అంతేగాక పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎప్పుడో తిరిగి భారత్‌లో అంతర్భాగంగా మారేదని అభిప్రాయపడ్డారు. ''అప్పటికి మన సైన్యం పంజాబ్ దాటి కశ్మీర్‌కేసి దూసుకుపోతోంది. నెహ్రూ కాల్పుల విరమణను కనీసం మూడు రోజులు ఆలస్యం చేసినా పీఓకే ఇప్పుడు భారత్‌లో అంతర్భాగంగా ఉండేది'' అని ఆక్షేపించారు. అంతా అయిపోయాక, కాల్పుల విరమణ పొరపాటు నిర్ణయమని నెహ్రూ తీరిగ్గా అంగీకరించారని విమర్శించారు. ఆయన చేసిన సరిదిద్దుకోలేని తప్పిదం వల్ల భారీ భూభాగాన్ని దేశం కోల్పోవాల్సి వచ్చిందన్నారు. 1962లో చైనాతో భారత యుద్ధానికి దారి తీసిన నెహ్రూ 'భారీ తప్పిదం' గురించి కూడా మాట్లాడాలని బిజూ జనతాదళ్ సభ్యుడు భర్తృహరి మహతబ్ కోరగా అమిత్ షా తనదైన శైలిలో స్పందించారు. ''నెహ్రూ తప్పిదాల్లో రెండింటిని ప్రస్తావిస్తేనే విపక్షాలు అలిగి వాకౌట్ చేశాయి. ఇక భారీ తప్పిదం గురించి మాట్లాడితే ఏకంగా రాజీనామా చేసేవేమో!'' అంటూ ఎద్దేవా చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఎవరినీ అవమానించడానికి కాదని, జరిగిన వాస్తవాలను దేశం ముందుంచే ప్రయత్నం మాత్రమేనని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఇక 370 ఆర్టికల్‌ను రద్దు చేసే దమ్ము గత కాంగ్రెస్ సర్కారుకు లేకపోయిందని అమిత్ షా ఎద్దేవా చేశారు.

# రాహుల్‌కు పరిణతి లేదు

- గాంధీల అహంకారమే తప్ప చతురత అబ్బలేదు
- కాంగ్రెస్‌ను ఆయన కాపాడటం అనుమానమే
- డైరీలో రాసుకున్న ప్రణబ్ ముఖర్జీ
- తాజా పుస్తకంలో వెల్లడించిన కూతురు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీలో చరిష్మా గానీ, రాజకీయ పరిణతి, అవగాహన గానీ లేవని దివంగత రాష్ట్రపతి, ఆ పార్టీ దిగ్గజ నేత ప్రణబ్ ముఖర్జీ అభిప్రాయపడ్డారట. అది కాంగ్రెస్‌కు చాలా సమస్యగా పరిణమించిందని ఆవేదన పడ్డారట. అంతేకాదు, గాంధీ–నెహ్రూ కుటుంబ అహంకారమైతే రాహుల్ కు వచ్చింది గానీ వారి రాజకీయ చతురత మాత్రం అబ్బలేదు' అని కొన్నేళ్ల కిందట తన డైరీలో రాసుకున్నారట. 'కాంగ్రెస్ పార్టీకి పునర్‌వైభవాన్ని రాహుల్ తీసుకురాగలడా? ప్రజల్లో స్ఫూర్తి నింపగలరా? ఏమో! నాకైతే తెలియదు' అంటూ అనుమానాలు వెలిబుచ్చారట. 'ప్రణబ్: మై ఫాదర్' పేరిట రాసిన తాజా పుస్తకంలో ఆయన కూతురు శర్మిష్ఠ ముఖర్జీ ఈ మేరకు పలు వివరాలు వెల్లడించారు. సోమవారం విడుదల కానున్న ఈ పుస్తకంలో ఇలాంటి చాలా విషయాలను ఆమె పంచుకున్నారు. ముఖ్యంగా రాహుల్ కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్సు చించివేశారని తెలిసి ప్రణబ్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారని చెప్పారు. 'అలా చేయడానికి ఆయన ఎవరసలు? కనీసం కేబినెట్ సభ్యుడు కాదు. పైగా అప్పుడు ప్రధాని (మన్మోహన్ సింగ్) విదేశాల్లో ఉన్నారు. తన చర్య పార్టీపై, ప్రభుత్వం పై ఎలాంటి ప్రభావం చూపుతుంది ఆలోచించరా? సొంత ప్రభుత్వ ఉత్తర్వులను అలా మీడియా ముందు ముక్కలు చేయడం 2014లో యూపీఏ కూటమి ఓటమికి కూడా ఒక కారణమైంది' అని ప్రణబ్ మండిపడ్డారట. 'రాహుల్ హుందాగానే ప్రవర్తిస్తారు. కానీ దేన్నీ సీరియస్‌గా తీసుకోరు. బహుశా ఆయనకు అన్నీ చాలా సులువుగా లభించడమే కారణం కావచ్చు. రాహుల్ మాత్రం అత్యంత కీలక సమయాలు, సందర్భాల్లో కూడా చీటికీమాటికీ దేశం విడిచి ఎటో మాయమవుతారు. ఇది కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకు తప్పుడు సందేశమే ఇచ్చింది' అని ప్రణబ్ అభిప్రాయపడ్డట్టు శర్మిష్ఠ తెలిపారు.

# ఎంపీ పదవికి 10 మంది రాజీనామా

- త్వరలో రాజీనామా చేయనున్న మరో ఇద్దరు
- కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకోనున్న ముగ్గురు నేతలు
- రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో వీరికి కీలక పదవులు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్‌తోపాటు పలువురు బీజేపీ ఎంపీలు తమ పార్లమెంట్ సభ్యత్వానికి బుధవారం రాజీనామా సమర్పించారు. ఇటీవల జరిగిన రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో వీరు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఇకపై ఎమ్మెల్యేలుగానే కొనసాగాలని నిర్ణయించుకున్నారు. మొత్తం 12 మంది బీజేపీ ఎంపీలు పార్లమెంట్ సభ్యత్వం వదులుకుంటున్నారు. వీరికి సొంత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి లేదా మంత్రి పదవులు దక్కుతాయని ప్రచారం సాగుతోంది. బుధవారం 10 మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాకేశ్ సింగ్, ఉదయప్రతాప్ సింగ్, రితీ పాఠక్, రాజస్తాన్‌కు చెందిన కిరోడీలాల్ మీనా, దియా కుమారి, రాజవర్ధన్ సింగ్ రాథోడ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గోమతిసాయి, అరుణ్ సావో రాజీనామా సమర్పించారు. వీరిలో కిరోడీలాల్ మీనా ఒక్కరే రాజ్యసభ సభ్యుడు. మిగిలినవారంతా లోక్‌సభ సభ్యులు. మరో కేంద్ర మంత్రి రేణుకా సింగ్‌తోపాటు ఎంపీ మహంత్ బాలక్‌నాథ్ యోగి అతి త్వరలో రాజీనామా చేస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. నరేంద్రసింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, రేణుకా సింగ్ కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకోనున్నారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో నూతన ముఖ్యమంత్రులను బీజేపీ అధిష్టానం ఇంకా నియమించలేదు. ఎంపీ పదవులకు రాజీనామా చేసిన వచ్చిన వారిలో కొందరికి ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించబోతున్నానని తెలుస్తోంది. మరోవైపు కేంద్రంలో మూడు మంత్రి పదవులు ఖాళీ అవుతున్నాయి. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కంటే ముందే ఈ మూడు పదవులను భర్తీ చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోచిస్తున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి లబ్ధి చేకూరేలా ఈ భర్తీ ఉంటుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు.

# వందకు పైగా వెబ్‌సైట్లపై నిషేధం

## వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా

న్యూఢిల్లీ: పార్ట్ టైమ్ జాబ్ మోసాలు, మోసపూరిత పెట్టుబడులకు పాల్పడుతున్న 100కు పైగా వెబ్‌సైట్లను నిషేధిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఈ తరహా ఆన్‌లైన్ మోసాలపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ లోతుగా పరిశీలన జరిపిన తర్వాత చేసిన సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. నిషేధానికి గురైన వెబ్‌సైట్లు అన్నీ విదేశాల నుంచే పని చేస్తున్నట్లు వెల్లడించింది. 'చాట్ మెసెంజర్లు, రెంటెడ్ అకౌంట్ల ద్వారా ఇవి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇలా మోసపూరితంగా కొల్లగొట్టిన మొత్తాల ద్వారా కొన్ని అంతర్జాతీయ కంపెనీలు, విదేశీ ఏటీఎం కార్డులు, క్రిప్టో కరెన్సీ వంటివాటికి సాయంతో మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నారు' అని తెలిపింది.

**తస్మాత్ జాగ్రత్త**

పార్ట్ టైం జాబ్ మోసాలు తదితరాలపై ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పలు హెచ్చరికలు చేసింది. 'నిరుద్యోగులు, రిటైర్డ్ వ్యక్తులు, మహిళలను వీరు ఎక్కువగా లక్ష్యం చేసుకుంటారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లేదా మరేదైనా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువ అవుతారు. 'ఇంట్లో కూర్చొనే ఉద్యోగాలు చేయండి', 'ఇంట్లో కూర్చొనే సంపాదించండి' వంటి ఆకట్టుకునే పదాలతో డిజిటల్ ప్రకటనలు ఇచ్చి ప్రజలపై వల విసురుతారు. ఇన్ని లైకులు కొడితే చాలు అనో ఇంకా ఏవేవో చెప్పి నమ్మబలుకుతారు. నమ్మకం కలిగించేందుకు తొలుత కమిషన్ ఇస్తారు. తర్వాత భారీ లాభాలను ఆశ చూపి పెద్ద మొత్తాలను పెట్టుబడిగా పెట్టేలా నమ్మిస్తారు. వారి వలలో పడి పెట్టుబడి పెట్టగానే మోసగిస్తారు' అని హెచ్చరించింది. అనుమానాస్పద లింకులు, ఫోన్‌కాల్స్ వంటివి వస్తే వెంటనే ఆయా ఫోన్‌నంబర్లు, సోషల్ మీడియా లింకుల వివరాలను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ) హెల్ప్‌లైన్‌కు అందించి, ఫిర్యాదు చేయాలని సూచించింది. సైబర్ సేఫ్ భారత్ ఏర్పాటే లక్ష్యమని కేంద్రం పేర్కొంది.

# దేశాన్ని విడదీసే కుట్రలు సాగనివ్వం

## లోక్‌సభలో కేంద్రమంత్రి అర్జున్‌రామ్

న్యూఢిల్లీ: గోమూత్ర రాష్ట్రాలు అంటూ తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు బుధవారం లోక్‌సభలో తీవ్ర అలజడి సృష్టించాయి. అధికార బీజేపీ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం 12 గంటలకు సభకు పునఃప్రారంభమైన తర్వాత కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ అంశాన్ని లేవనెత్తారు. సెంథిల్ కుమార్ అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, డీఎంకే సీనియర్ నేత టీఆర్ బాలు ఆమోదిస్తున్నారా? అని నిలదీశారు. దేశాన్ని ఉత్తర, దక్షిణ భారతదేశంగా విడదీసే కుట్రలను సాగనివ్వబోమని తేల్చిచెప్పారు. సెంథిల్ కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని మేఘ్వాల్ డిమాండ్ చేశారు. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపించారని, దేశం పట్ల వారి తీర్పును వెలువరించారని అన్నారు. టీఆర్ బాలు స్పందిస్తూ.. సెంథిల్ కుమార్ అలా మాట్లాడడం సరైంది కాదని చెప్పారు. సెంథిల్‌ను తమ ముఖ్యమంత్రి స్టాలిన్ హెచ్చరించారని తెలిపారు. సెంథిల్ కుమార్ వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రికార్డుల నుంచి తొలగించారు.

**సభలో సెంథిల్ కుమార్ క్షమాపణ**

తను వ్యాఖ్యల పట్ల డీఎంకే ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం లోక్‌సభలో క్షమాపణ కోరారు. ప్రజల మనోభావాలను గాయపర్చడం తన ఉద్దేశం కాదని, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని చెప్పారు. అనుకోకుండానే ఈ మాట ఉపయోగించానని, తనకు ఎలాంటి దురుద్దేశం లేదని సెంథిల్ కుమార్ వివరణ ఇచ్చారు. ఆయన మంగళవారం క్షమాపణ కోరుతూ 'ఎక్స్'లో పోస్టు చేసిన సంగతి తెలిసిందే.

**భారతీయ సంస్కృతిని కించపర్చే కుట్ర**

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు రాష్ట్రాల్లో పరాజయం పాలైన కాంగ్రెస్ పార్టీ భారతీయ సంస్కృతిని, గుర్తింపునకు కించపర్చేందుకు కుట్ర పన్నిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం మండిపడ్డారు. ఎన్నికల్లో ఓటమికి కారణాలు అన్వేషించకుండా దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కుయుక్తులు సాగిస్తోందని ధ్వజమెత్తారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అమేథీలో రాహుల్ గాంధీ ఓడిపోయిన తర్వాతే ఉత్తర–దక్షిణ భారతదేశం అనే విభజనను తెరపైకి తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు.



ఉత్తరగాజాలోని రఫా పట్టణంలో సహాయక శిబిరం వద్ద ఆహారం తీసుకుంటున్న చిన్నారులు

# గాజాలో భయం భయం

- భూతల దాడులు ఉధృతం చేసిన ఇజ్రాయెల్ సైన్యం
- ఆహారం, నీరు, ఔషధాలు అందక జనం విలవిల

ఖాన్ యూనిస్: గాజాస్ట్రిప్‌లో పరిస్థితులు మరింత క్షీణిస్తున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు ఉధృతం చేసింది. మిలిటెంట్ల ఆచూకీ కోసం ఇజ్రాయెల్ సైనికులు ప్రతి ఇంటినీ సోదా చేస్తున్నారు. మరోవైపు దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్, ఉత్తర గాజాలోని జబాలియా, షుజాయియా నగరాలను ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు చుట్టుముడుతున్నాయి. ఈ మూడు నగరాల్లో వేలాది మంది పాలస్తీనా పౌరులు చిక్కుకుపోయారు. దక్షిణ గాజాలో 6 లక్షల మందికి పైగా ఉన్నారని, వారంతా ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించిందని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. గాజాలోని శరణార్థి శిబిరాలన్నీ ఇప్పటికే బాధితులతో నిండిపోయాయని, ఇక ఎక్కడికి వెళ్లాలో తెలియక ఎవరికీ దిక్కుతోచడం లేదని పేర్కొంది. ప్రజలకు ఆహారం, నీరు, ఔషధాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. ఖాన్ యూనిస్ సిటీపై ఇజ్రాయెల్ సైన్యం బుధవారం బాంబుల వర్షం కురిపించింది. హమాస్ ముఖ్యనేతలంతా ఖాన్ యూనిస్‌లో మాటు వేశారని, వారిని బంధించక తప్పదని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది.

# సాక్షి కరీంనగర్

గురువారం । 7 । డిసెంబర్ । 2023




## స్ట్రాంగ్ రూములకు ఈవీఎంలు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని అధికారులు ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి, తాళాలు, సీల్ వేశారు. 8లో▸

## నేడు జమ్మికుంట మార్కెట్‌కు సెలవు

జమ్మికుంట(హుజూరాబాద్): వర్షం కారణంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులుగా వర్షం కురుస్తోందని, మార్కెట్‌లో క్రయవిక్రయాలకు అంతరాయం కలుగుతోందన్నారు. శుక్రవారం యథావిధిగా కొనుగోళ్లు జరుగుతాయని, రైతులు గమనించాలని కారారు.



గరిష్టం/కనిష్టం
23.0/20.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తుపాను కారణంగా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ఎమ్మెల్యే గంగులకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్: కరీంనగర్ ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించిన గంగుల కమలాకర్‌ను కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి శాలువాతో సన్మానించారు. ఆయన కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఆర్యవైశ్యుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ఖర్మకాండ నిలయానికి 6 గంటల భూమి, నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఏవీ మల్లికార్జున్, సుడా మాజీ డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు సురేందర్, రమేశ్ పాల్గొన్నారు.

### సీపీఎస్‌ను రద్దు చేయాలి

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్



గన్నేరువరం(మానకొండూర్): రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న రేవంత్‌రెడ్డికి సీపీఎస్ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లిలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలును ఆశిస్తున్నామని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. తొలి కేబినెట్ సమావేశంలోనే దీన్ని ఆమోదించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తే 1.70 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు మేలు జరుగుతుందని తెలిపారు.

### విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక



రఘుపతి



అనిల్‌కుమార్

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కరీంనగర్ సర్కిల్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. రెండేళ్లకోసారి జరిగే ఈ ఎన్నిక కోసం బుధవారం జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్కిల్ అధ్యక్షుడిగా పులి రఘుపతి(ఏఏవో), ప్రధాన కార్యదర్శిగా కె.అనిల్‌కుమార్ (జేఏవో), ఉపాధ్యక్షుడిగా టి.తిరుపతి(ఏఏవో), కోశాధికారిగా కుసుమ శ్రీనివాస్ (జేఏవో), జాయింట్ సెక్రటరీగా జి.రవీందర్ (జేఏవో), మహిళా సెక్రటరీగా ఎస్.సునీత (ఏఏవో) ఎన్నికయ్యారు. సమావేశానికి కంపెనీ అధ్యక్షుడు, జీఎం (ఫైనాన్స్) వి.వేణుబాబు, ఉపాధ్యక్షుడు ఎస్.లక్ష్మణ్, ఎస్ఏవో రాజేశం ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ బండి సంజయ్ కుమార్



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్




నగరపాలకసంస్థ కార్యాలయంలో మేయర్ సునీల్‌రావు, కమిషనర్ శ్రీనివాస్

## అణగారిన వర్గాల దిక్సూచి అంబేడ్కర్

కరీంనగర్/కరీంనగర్‌టౌన్/కరీంనగర్ కార్పొరేషన్: జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాలకు ఆ మహనీయుడు దిక్సూచి అని కొనియాడారు. రాష్ట్రంలో కొలువుదీరనున్న కాంగ్రెస్ ప్రభుత్వం బహుజనుల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని, కేసీఆర్ ప్రభుత్వమే దానికి నిదర్శనమన్నారు. దేశ విభజన, 370 ఆర్టికల్‌ను వ్యతిరేకించిన వ్యక్తి అంబేడ్కరన్నారు. దళితుల అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. జన్‌ధన్ ఖాతాల్లో అత్యధికంగా దళితులే లబ్ధి పొందుతున్నారన్నారు. మహనీయుల ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నగర మేయర్ వై.సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోర్టుచౌరస్తా, నగరపాలకసంస్థ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళి అర్పించారు. కార్పొరేటర్లు గంట కల్యాణిశ్రీనివాస్, చాడగొండ బుచ్చిరెడ్డి, కంసాల శ్రీనివాస్, అర్ష కిరణ్మయి మల్లేశం, సరిళ్ల ప్రసాద్, మెండి శ్రీలత చంద్రశేఖర్, మేడి మహేశ్, రాజీవ్‌ర్, ఆనంద్‌రావు, సముద్రాల అజయ్, కిరణ్, రవి నాయక్, సత్యం, భూమయ్య, శంకర్, కనుకయ్య, తాళ్ల వెంకటేశ్, ఎస్ఈ నాగమల్లేశ్వర్ రావు, డీసీపీ సుభాష్, ఈఈ కిష్టప్ప, ఆర్వో ఆంజనేయులు, టీపీబీవో శ్రీహరి, శానిటేషన్ సూపర్ వైజర్ రాజమనోహర్ తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు 35వ డివిజన్ సప్తగిరికాలనీలో అరుంధతి బుద్ధవనం, అంబేడ్కర్ విగ్రహాన్ని కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి ప్రారంభించారు.

# ఇక ‘పల్లె పోరు’



## ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పంచాయతీల గడువు

- సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్లకు ఎస్ఈసీ ఆదేశాలు
- పంచాయతీరాజ్ ఆకస్మిక సమావేశాలు
- పెరిగిన ఓట్లతో స్వల్పంగా పెరగనున్న పోలింగ్ కేంద్రాల సంఖ్య

పెరిగిన ఓటర్ల సంఖ్య

| నియోజకవర్గం | కొత్త ఓటర్లు |
|---|---|
| కోరుట్ల | 20,652 |
| జగిత్యాల | 24,021 |
| ధర్మపురి | 17,890 |
| రామగుండం | 25,882 |
| మంథని | 23,591 |
| పెద్దపల్లి | 27,413 |
| కరీంనగర్ | 54,831 |
| చొప్పదండి | 16,957 |
| వేములవాడ | 25,451 |
| సిరిసిల్ల | 22,408 |
| మానకొండూర్ | 15,909 |
| హుజూరాబాద్ | 35,181 |
| హుస్నాబాద్ | 14,005 |

ఉమ్మడి జిల్లా పంచాయతీల సమాచారం

| జిల్లా | మండలాలు | పంచాయతీలు | వార్డులు |
|---|---|---|---|
| పెద్దపల్లి | 14 | 263 | 2436 |
| జగిత్యాల | 20 | 380 | 3500 |
| సిరిసిల్ల | 13 | 255 | 2444 |
| కరీంనగర్ | 16 | 313 | 2966 |

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి:

అసెంబ్లీ పోరు ముగిసిన నేపథ్యంలో మరో ఎన్నికల పోరుకు తెరలేవనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) సిద్ధం అవుతోంది. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలతో జిల్లాల వారీగా నివేదికలు పంపాలని ఆదేశాలు జారీచేసింది.

**ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పదవీకాలం**

వచ్చే ఏడాది(2024) ఫిబ్రవరి ఒకటితో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుంది. ఆర్టికల్ 2(4)(3) ప్రకారం గ్రామపంచాయతీల పదవీకాలం ఐదేళ్లు. పంచాయతీరాజ్ యాక్ట్14(2) ప్రకారం గ్రామ పంచాయతీల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందుగానే ఎన్నికలు నిర్వహించాలి. ఈమేరకు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తుగా సమాచారం ఇస్తుంది. అలాగే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేస్తుంది. ఆ మేరకు రిజర్వేషన్లకు సంబంధించి గ్రామ కార్యదర్శులు ఎన్నికల అధికారులకు నివేదికలు పంపాల్సి ఉంటుంది. వాటిని క్రోడీకరించిన తర్వాత రిజర్వేషన్లతోసహా ఎన్నికల తేదీలు ప్రకటిస్తారు. అందులో భాగంగానే తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల కలెక్టర్లకు ఆదేశాలు వచ్చాయి. ఎన్నికల సిబ్బంది, సాంకేతిక అంశాల పరంగా సంసిద్ధంగా ఉండాలని ఆదేశాల్లో ఎస్ఈసీ స్పష్టంచేసింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆకస్మిక సమావేశం నిర్వహించిన జిల్లా అధికారులు.. ఎస్ఈసీ సూచనలు, ఎన్నికల ప్రక్రియ, అనుసరించాల్సిన వ్యూహం, మానవ వనరులు, సాంకేతిక అంశాలపై చర్చించారు.

**పెరిగిన ఓట్లు.. బూత్‌లు పెరిగేనా?**

ఉమ్మడి జిల్లాలో 2018 ఎన్నికల నాటికి 13 నియోజకవర్గాల్లో 27,88,092 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా జరిగిన ఎన్నికల్లో 31,12,283 మందికి చేరుకున్నారు. కొత్తగా 3,24,191 మంది ఓటర్లు వచ్చారు.

**మరిన్ని పెరిగే అవకాశం..**

గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీ నాటికి కొత్త ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు 200 మంది ఓటర్ల వరకు ప్రతీ పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక పోలింగ్ ఆఫీసర్ ఉండాలని, 201 నుంచి 400 ఓట్ల వరకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు, 401 నుంచి 650 ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ముగ్గురు పోలింగ్ ఆఫీసర్లు ఉండాలి. ఈ మేరకు సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపింది. 650 ఓట్లు దాటితే అధికారులు అదనంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్నారు.

### మూడు దశల్లో ఎన్నికలు..

జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. గ్రామాల్లోని జనాభాను బట్టి బడుగు, బలహీనులు పోటీ చేసే అవకాశాలు ఉంటాయి. అయితే, ఈసారి.. ఐదేళ్ల కింద జరిగిన పద్ధతిలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈసారి కూడా గతంలో లాగానే మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలిదశలో వినియోగించుకున్న సిబ్బందిని మూడోదశలోనూ వినియోగించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,211 గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే, కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఇంకా గ్రామస్థాయిలో రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయాల్సి ఉంది. ఆ తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుంది. అయితే, గడువులోగానే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక మరికొంత సమయం తీసుకుంటుందా? అనేది వేచిచూడాలి.

# మంత్రివర్గంలో మనోళ్లు?!



- దుద్దిళ్ల, పొన్నంలకు చోటు
- జీవన్‌రెడ్డికి సైతం అవకాశం

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో సీఎంగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్న ఎనుముల రేవంత్‌రెడ్డి కేబినెట్‌లోకి ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురిని మంత్రివర్గంలోకి చోటు లభించనున్నట్లు సమాచారం. రాష్ట్రం ఏర్పాటు అయ్యాక మూడోసారి కొలువుదీరనున్న మంత్రివర్గంలోకి మంథని నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హుస్నాబాద్ నుంచి విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌లకు మంత్రివర్గంలో స్థానం లభించడం ఖాయమైనట్లు తెలిసింది. సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్‌రెడ్డికి సైతం మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం యోచిస్తోంది. పెద్దపల్లి జిల్లాకు చెందిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డిల కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన అనుభవంతోపాటు ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్‌గా వ్యవహరించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా పనిచేసి పార్టీ అధిష్టానం దృష్టిలో పడ్డారు. బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి గెలిచిన శ్రీధర్‌బాబుకు అన్ని అర్హతలు ఉన్నాయని, కీలక పదవీ వరించనుందని విశ్వసనీయ సమాచారం. మాజీ ఎంపీగా, గతంలో మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేయడమే కాకుండా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర బాధ్యులుగా వ్యవహరించి పార్టీ అధిష్టానం దృష్టిలో గుర్తింపు పొందిన హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్‌కు బీసీ కోటాలో మంత్రి పదవి వరించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమసమయంలో పార్లమెంట్‌లో ఆయన పాత్రతోపాటు సామాజిక సమీకరణాల్లో పొన్నం ప్రభాకర్ ముందు వరుసలోనే ఉన్నట్లు వినికిడి. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, జగిత్యాల ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని అనుభవం రీత్యా మంత్రివర్గంలోకి తీసుకొని ఆయన సేవలను వినియోగించుకోవాలని పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు అమాత్యులుగా ప్రమాణం చేయనున్నారని సమాచారం.

## మేనిఫెస్టోను కాంగ్రెస్ అమలు చేయాలి

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన మేనిఫెస్టోను కాంగ్రెస్ అమలు చేయాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గురువారం సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న రేవంత్‌రెడ్డికి టీఎన్జీవో జిల్లా శాఖ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో ఉద్యోగులంతా మార్పు కోరుకున్నారని తెలిపారు. ఉద్యోగులకు జీతాలు మొదటి తారీఖునే ఇచ్చేలా చూడాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. గెలుపొందిన ఎమ్మెల్యేలందరికీ తెలంగాణ ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, సహాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి కిరణ్‌కుమార్, మహిళా జేఏసీ చైర్‌పర్సన్ శారద, అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు హర్మీందర్ సింగ్, అఫ్జల్, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్ భరద్వాజ్, కిషన్, రవీందర్ రెడ్డి, సుధీర్, రమేశ్, శంకర్, ప్రసాద్‌రెడ్డి, కిషన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, నరసింహారెడ్డి, డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

# 63 మంది డిపాజిట్ గల్లంతు

- కరీంనగర్, హుజూరాబాద్‌లలో బీఆర్ఎస్, బీజేపీ మధ్య..
- చొప్పదండి, మానకొండూర్‌లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య టఫ్ ఫైట్
- రెండుచోట్ల బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్ దక్కలే

కరీంనగర్: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని 4 నియోజకవర్గాలు కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్‌లలో ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 73 మంది పోటీ చేశారు. కరీంనగర్‌లో 27, హుజూరాబాద్‌లో 22, మానకొండూర్‌లో 10, చొప్పదండిలో 14 మంది బరిలో నిలిచారు. బీజేపీతోపాటు చిన్న పార్టీల అభ్యర్థులు 63 మంది డిపాజిట్ కోల్పోయారు. కరీంనగర్, హుజూరాబాద్‌లలో బీఆర్ఎస్, బీజేపీల మధ్య, మానకొండూర్, చొప్పదండిల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ నువ్వానేనా అన్నట్లు జరిగింది. కరీంనగర్ నుంచి గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కు 92,179 ఓట్లు రాగా రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు 89,016 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్‌కు 38,526 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ, ఆర్పీఐ, ఏఐఎఫ్‌బీ, శివసేన అభ్యర్థులతోపాటు స్వతంత్రులు 24 మందికి 1,000లోపు ఓట్లు మాత్రమే వచ్చాయి. హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి 80,333, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 63,460, కాంగ్రెస్ అభ్యర్థి ఒడితెల ప్రణవ్‌కు 53,164 ఓట్లు రాగా 19 మంది స్వతంత్ర అభ్యర్థులు 1,000 లోపే ఓట్లు సాధించి, డిపాజిట్ కోల్పోయారు. చొప్పదండిలో కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యంకు 90,395, బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు 52,847 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బొడిగె శోభ 26,507 ఓట్లు మాత్రమే సాధించారు. ఆమెతోపాటు బరిలో ఉన్న 12 మంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు. మానకొండూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణకు 96,773, బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు 64,408 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ 14,879 ఓట్లు సాధించి డిపాజిట్ కోల్పోయారు. స్వతంత్రులు ఏడుగురిదీ ఇదే పరిస్థితి.

**అగ్రనేతలు ప్రచారం చేసినా దక్కని ఫలితం..**

జిల్లాలో ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి తదితర బీజేపీ అగ్రనేతలు ప్రచారం చేసినప్పటికీ ఫలితం దక్కకపోవడంతో కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బండి సంజయ్ గెలుస్తాడన్న ధీమాలో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం ఆయన ఓటమితో నిరుత్సాహపడింది. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ సైతం అగ్రనాయకత్వాన్ని ప్రచారంలో దించినా ఫలితం పొందలేదు. బీఆర్ఎస్ టికెట్ లభించకపోవడంతో బీజేపీలో చేరి, మానకొండూర్‌లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, చొప్పదండి బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ అనుకున్న స్థాయిలో పోటీ ఇవ్వలేకపోయారు. బీఎస్పీ పోటీ చేసిన నాలుగు నియోజకవర్గాల్లో 2 వేల ఓట్లు దాటకపోవడం గమనార్హం.

# పౌల్ట్రీ.. పట్టీ

- నష్టాల ఊబిలో పౌల్ట్రీ రంగం
- కష్టపడినా లాభం పొందని రైతులు
- కార్పొరేట్ శక్తుల రాకతో పరిస్థితి అస్తవ్యస్తం

కరీంనగర్ అర్బన్: కోళ్ల వ్యాపారం పూర్తిగా ట్రేడర్లు, కార్పొరేట్ శక్తుల్లోకి వెళ్లింది. ప్రభుత్వపరంగా నియంత్రణ, ధరలపై నిర్దిష్ట విధానం లేకపోవడంతో లాభాలు అటుంచితే పెట్టుబడి వస్తుందన్న నమ్మకం లేకుండా పోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే కోళ్ల పరిశ్రమకు స్వస్తి పలికే అవకాశాలు లేకపోలేదు. లాభాలుంటాయన్న ఆశతో చాలామంది యువ రైతులు పోటీపడి, పౌల్ట్రీలను ఏర్పాటు చేసుకున్నారు. బ్యాంకర్లు పావలా వడ్డీ రుణాలు ఇస్తామని చెప్పడంతో షెడ్లను నిర్మించి, కోళ్ల పెంపకం చేపట్టారు.

**6 వేల కోళ్లకు రూ.3 లక్షలకు పైగా నష్టం**

బ్రాయిలర్ కోళ్ల పరిశ్రమ మూడు నెలలుగా పౌల్ట్రీ రైతులను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. పౌల్ట్రీ రంగంలోకి కార్పొరేట్ శక్తులు రావడంతో కోళ్లు, చికెన్ ధరలు పడిపోతున్నాయి. షెడ్డులో 6 వేల కోళ్లను పెంచడానికి రూ.12 లక్షలు పెట్టుబడి అవసరం. కోడిపిల్లలను ఒక్కోదానికి రూ.25 నుంచి రూ.30 వరకు వెచ్చించి, కొనుగోలు చేయాల్సి వస్తోంది. మొక్కజొన్న, సోయాబీన్ ధరలు తగ్గినా దాణా రేట్లు తగ్గించడం లేదు. కోడి పిల్ల దశ నుంచి విక్రయించే వరకు 45 రోజుల్లో మూడున్నర కిలోల దాణా ఆహారంగా తీసుకుంటుంది. ఇందుకు దాదాపు రూ.170 వరకు ఖర్చవుతుంది. ఊక, వైద్యం, విద్యుత్, పనిచేసే వాళ్లతో కలిపి ఒక్కో కోడి పెంపకానికి రూ.195 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఇక కోళ్లను విక్రయించే సమయంలో పేపర్ రేట్ 66 ఉండగా మైనస్ 10కు అంటే రూ.56కి విక్రయిస్తున్నారు. ఒక్కో కోడి సగటు బరువు 2.300 కిలోలు లెక్కగట్టినా రూ.128 మాత్రమే రైతుకు వస్తోంది. అంటే పెట్టిన పెట్టుబడిలో రూ.67 నష్టం. మొత్తంగా 6 వేల కోళ్లకు మోటాలిటీ పోను రూ.3 లక్షలకు పైగా నష్టం. ఇక దాణా సరఫరా చేసేవారు, కోళ్లను కొనుగోలు చేసే ట్రేడర్లు, చికెన్ సెంటర్ల నిర్వాహకులకు మాత్రం లాభాలు వస్తున్నాయి.

**రేట్లు కొందరే నిర్ణయిస్తున్నారా?**

మామూలుగా చికెన్ సెంటర్ల ధరలకు కోళ్ల ఫారం యజమానులకు సంబంధం లేదు. కొందరు వ్యక్తులు మాత్రమే రేట్లను నిర్ణయిస్తున్నారనేది మార్కెట్‌లో వినిపిస్తున్న మాట. తమ కోళ్ల ఫారాలకు ఇబ్బంది లేకుండా ధరలు పెంచుతుండగా వారివి విక్రయించాక మళ్లీ ధర తగ్గిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవలి కాలంలో కరీంనగర్ రేట్ అంటూ డెలివరీ పేరిట మరింత దోచుకుంటున్నారు. కరీంనగర్‌లోని ఓ వ్యక్తి కోళ్ల ఫారాలపై గుత్తాధిపత్యం ప్రదర్శిస్తూ అనుకున్న స్థాయిలో లాభాలు గడిస్తున్నట్లు తెలిసింది. డెలివరీ రేట్‌పై మైనస్, పేపర్ రేట్‌పై మైనస్ అంటూ కిలోకు రూ.15 నుంచి రూ.25 వరకు దండుకుంటున్నారు. ఫలితంగా ఫారం యజమానులు నష్టపోతున్నారు.

**సరఫరా అంతా కార్పొరేట్ శక్తులదే**

రూ.లక్షలు వెచ్చించి, షెడ్లు నిర్మించుకున్న తర్వాత పెట్టుబడులు పెట్టలేని స్థితిలో పౌల్ట్రీ రైతులు కార్పొరేట్ శక్తులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో కోడి పిల్లల నుంచి దాణా వరకు అంతా వారే సరఫరా చేస్తున్నారు. రైతులు షెడ్డుతోపాటు విద్యుత్, కోళ్లను మాత్రమే చూసుకోవాలి. తీరా మార్కెట్‌లో ధర లేదని, ఇంతే ఇస్తాం అంటూ దబాయిస్తున్నారని వాపోతున్నారు. కూలీ కూడా గిట్టుబాటుకావడం లేదని అంటున్నారు.



ఫారంలో కోళ్లు

**దాణా తయారీ, ట్రేడింగ్‌కు నిర్ణయం**

దాణా ధరలు తగ్గకపోవడం, ట్రేడర్లతోపాటు డెలివరీ రేటు పేరుతో సాగుతున్న మోసాలను అరికట్టాలని కోళ్ల ఫారాల యజమానులు కోరుతున్నారు. జిల్లాలోని కోళ్ల ఫారాల యజమానులు సంఘటితంగా సొంత దాణా తయారీ, ట్రేడింగ్ చేసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వ చేయూత కోసం సీఎంను కలుస్తామని యజమానుల సంఘం నాయకుడు మనోహర్ తెలిపారు.

**ధరలు తగ్గినా ఆగని దోపిడీ**

ధరలు తగ్గినా చికెన్ సెంటర్ల దోపిడీ ఆగడం లేదు. స్కిన్‌తో కూడిన మాంసం కిలో రూ.128కి బదులు రూ.140కి విక్రయిస్తున్నారు. స్కిన్‌లెస్ కిలో రూ.145కి బదులు రూ.180 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు.

### పరిస్థితి అత్యంత దుర్భరం



స్వయం ఉపాధి పొందాలని పౌల్ట్రీ పరిశ్రమను నమ్ముకుంటే పరిస్థితి అత్యంత దుర్భరంగా మారింది. కోళ్లు అమ్ముకునేందుకు సిద్ధమైతే ధర రూ.66 ఉండగా మైనస్ పేరుతో రూ.56 మాత్రమే ఇస్తామంటున్నరు. ఇలాగైతే మేము బతికేదెలా?

– గోలి శ్రీనివాస్, పౌల్ట్రీ రైతు

### ప్రభుత్వ నియంత్రణ ఉండాలి



కోడి పిల్లలు వేసినప్పుడు ఉన్న ధర కోడి పెరిగాక విక్రయించేటప్పుడు ఉండటం లేదు. అసలు పౌల్ట్రీ రంగంలో నిర్దిష్ట విధానం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోళ్ల ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి.

– బందెల వెంకటేశ్, పౌల్ట్రీ రైతు

## క్లుప్తంగా

### యువ వైద్యురాలి అదృశ్యం

కరీంనగర్ క్రైం: నగరంలోని ఓ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్‌గా పని చేసే యువతి అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నగరంలోని కోతిరాంపూర్‌కు చెందిన యువతి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తోంది. గత 20 రోజులుగా ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు తెలిసినవారి ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### వృద్ధురాలు..

కరీంనగర్ క్రైం: నగరంలో ఓ వృద్ధురాలు అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లికి చెందిన విలాసాగరం కొమురయ్య కరీంనగర్‌లోని అశోకనగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి వాచ్‌మెన్‌గా పని చేస్తూ తన భార్య గౌరమ్మతో అక్కడే ఉంటున్నాడు. ఆమె పదేళ్లుగా మానసిక వ్యాధితో బాధ పడుతోంది. అప్పుడప్పుడు ఆలయాలకు వెళ్లి వస్తుండేది. గత నెల 25న బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. తెలిసినవారి ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కొమురయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### నూతన వధూవరులకు కేటీఆర్ ఆశీర్వాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బొమ్మకంటి భాస్కర్–జ్యోతి దంపతుల కుమారుడు అభిమన్యు వివాహం సుదీప్తతో జరుగనుండగా బుధవారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ కలిసి ఆశీర్వదించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మిర్యాల్‌కర్ శ్రీనివాస్ కూతురు సృజన వివాహం జరుగగా.. వారి దంపతులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

### 'తెలుగు మహాసభలను విజయవంతం చేయండి'

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా జనవరిలో రాజమహేంద్రవరంలో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు ప్రచారకార్యదర్శి డాక్టర్ వాసరవేణి పర్శరాములు తెలిపారు. 25 సాహిత్య ప్రక్రియలపై సదస్సులు ఉంటాయని, భాషాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 'మాతృభాష పరిరక్షణకు భాషోపాధ్యాయుల కర్తవ్యం' 'మాతృభాష ద్వారా నైతిక విలువల పరిరక్షణ' 'సాంకేతిక పరిజ్ఞానంతో మాతృభాషాభివృద్ధి' 'సాహిత్యం మాతృభాష తులనాత్మకత' అనే అంశాలపై ఈనెల 15లోపు వ్యాసాలు పంపాలని కోరారు. వివరాలకు 90007 34466, 94945 53425 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. రచయిత దుంపెన రమేశ్, గజభీంకార్ అజయ్, మహమ్మద్ రిహాన్, దుంపెన సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



# స్ట్రాంగ్ రూములకు ఈవీఎంలు

- అయిదేళ్ల వరకు భద్రపరచాల్సిందే..
- ఎలక్షన్ కోడ్ ఎత్తివేత
- 11 నుంచి ప్రజావాణి పునరుద్ధరణ



కరీంనగర్ అర్బన్: ఎన్నికల క్రతువు ముగియడంతో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు. వాటిని వచ్చే అయిదేళ్ల వరకు కాపాడాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారులు ఈవీఎంలు, వీవీప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీప్యాట్లలోని స్లిప్పులు, మాక్‌పోల్ ధ్రువపత్రాలు, పీవో డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్ తదితరాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి, తాళాలు, సీల్ వేశారు.

**56 రోజులు.. సామాన్యుల పాట్లు**

గత అక్టోబర్ 9న ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నుంచి కోడ్ అమలులోకి రాగా 56 రోజులపాటు సామాన్యుల నానాపాట్లు పడ్డారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే వ్యాపార, వాణిజ్య వర్గాలతోపాటు పేద, మధ్య తరగతి ప్రజలు భయపడ్డారు. మంగళవారం సాయంత్రం నుంచి కోడ్ ఎత్తివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**స్ట్రాంగ్ రూములపై నిఘా..**

ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూములపై ఎన్నికల అధికారులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. వాటిని నిరంతరం పర్యవేక్షించడానికి సీసీ కెమెరాలు బిగించడంతోపాటు కేంద్ర బలగాలు మోహరించాయి. తిరిగి ఎన్నికల సంఘానికి అప్పగించేవరకు జిల్లా ఎన్నికల అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**ఎప్పుడైనా ఫిర్యాదు చేయొచ్చు..**

ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన అభ్యర్థిపై పరాజితులు ఎప్పుడైనా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. ఓట్ల లెక్కింపు సమయంలో అవకతవకలు జరిగాయని భావించినా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులకు న్యాయం చేయడానికి ఈవీఎంల కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను మళ్లీ లెక్కించాలని కోర్టు ఆదేశించవచ్చు. అలాంటప్పుడు ఏ నియోజకవర్గంలో ఫిర్యాదు అందితే దానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్లలో ఓట్లను తక్షణమే లెక్కించడానికి వీలుగా అధికారులు ఈవీఎంలను భద్రపరిచారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించిన తర్వాత 45 రోజులపాటు జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈవీఎంలకు భద్రత కల్పిస్తారు. అనంతరం వాటిని ఎన్నికల సంఘానికి అప్పగించి, గోదాములకు చేర్చుతారు. అక్కడ ఈవీఎంలను ఐదేళ్లపాటు భద్రపరుస్తారు. అనంతరం ఎన్నికల సంఘం నియమించిన ఇంజినీర్లు వచ్చి, వాటిలోని డేటాను తొలగించి, అవసరాన్ని బట్టి దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడికి తీసుకెళ్లి, ఉపయోగిస్తారు.

**కంట్రోల్ యూనిట్లే కీలకం**

అభ్యర్థుల మధ్య ఎన్నిక పోటాపోటీగా జరిగినప్పుడు గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంల కంట్రోల్ యూనిట్లు కీలకమవుతాయి. అతి తక్కువ ఓట్లతో ఓడిపోయినవారు ఎప్పుడైనా ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానాలను ఆశ్రయిస్తారు. ఆ సందర్భంలో ఇవి ముఖ్య పాత్ర పోషిస్తాయి. 2018 ఎన్నికల్లో 441 ఓట్లతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మపురి నియోజకవర్గం నుంచి కొప్పుల ఈశ్వర్ (టీఆర్ఎస్) గెలిచారు. ఆయన దొడ్డిదారిన విజయం సాధించారని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, ఈసారి జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో 3,163 ఓట్లతో గంగుల కమలాకర్ గెలవగా హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎక్కువ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

**8 వారాలు ప్రజావాణి నిర్వహించలే..**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణిని ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి నిలిపివేసిన విషయం విధితమే. 8 వారాలుగా ప్రజావాణి లేకపోవడంతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా ఎలక్షన్ కోడ్ ఎత్తివేయడంతో వచ్చే సోమవారం కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతో వందల సంఖ్యలో అర్జీలు రానున్నాయి.

# 'పారమిత' విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులను కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం అభినందించారు. ఈ నెల 5న తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. డి.శివచరణ్ రెడ్డి, బి.గౌరీశ్(పదోతరగతి), కె.ఋుగ్వేద్(ఆరోతరగతి)లు రూపొందించిన వెండర్స్ ఫ్రెండ్లీ వెజిటేబుల్ కార్ట్ ప్రాజెక్టు జాతీయ పోటీలకు ఎంపికైనట్లు సైన్స్ అండ్ టెక్నాలజీ మెంబర్ సెక్రటరీ నగేశ్ తెలిపారు. విద్యార్థులు బుధవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ ప్రాజెక్టు ద్వారా కూరగాయలు, పండ్లను ఎక్కువ సమయం తాజాగా ఉంచవచ్చని వివరించడంతో ఆమె అభినందించారు.

# 'అల్ఫోర్స్'లో జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



పోటీలను పారంభిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జోనల్ స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీలకు సుమారు 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరవగా అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మారుతి (ఫైల్)

కరీంనగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన కల్వల మారుతి(25) మేస్త్రీ పని చేస్తున్నాడు. గత సోమవారం రాత్రి మారుతి, అతని స్నేహితులు కల్యాణ్, రాకేశ్ బైక్‌లపై బొమ్మకల్ బైపాస్ నుంచి హైదరాబాద్ రోడ్డు వైపు వెళ్తున్నారు. మారుతి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి, పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మారుతి కనిపించకపోవడంతో ముందు వెళ్తున్న కల్యాణ్, రాకేశ్ తిరిగి వచ్చారు. అతని మృతదేహాన్ని అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తండ్రి పర్శరాములు, తల్లి పద్మ, సోదరి శరిష్మ ఉన్నారు. మంగళవారం కుమారుడి మృతదేహాన్ని చూసి పర్శరాములు స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రిలో చేర్పించారు. తన కుమారుడి మృతికి కారణమైన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### అమ్మను వదిలించుకున్నారు..

- రోడ్డుపై వదిలేశారు..



నటరాజ్ విగ్రహం వద్ద వృద్ధురాలు

వేములవాడఅర్బన్: నవమాసలు మోసి.. కనిపెంచిన అమ్మను వదిలించుకున్నారు. రోడ్డుపై వదిలేసి అనాథను చేశారు. కళ్లు కనిపించక.. మాటలు రాక.. ఎటూ వెళ్లలేక బిక్కుబిక్కుమంటూ ఆ మాతృమూర్తి చూపులు అందరిని కలచివేస్తున్నాయి. వేములవాడలోని భీమేశ్వర ఆలయం పక్కన ఉన్న నటరాజ్ విగ్రహం వద్ద మంగళవారం ఆటోలో తీసుకొచ్చి ఓ వృద్ధురాలును వదిలివేశారు. మాటలు స్పష్టంగా రాక, కళ్లు కనిపించక రోడ్డు పక్కన పడుకుని ఉంటుంది. గమనించిన స్థానికులు, హోటళ్ల యజమానులు ఆ వృద్ధురాలికి టిఫిన్, మంచినీరు అందించారు. రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో చలికి తట్టుకోలేకపోతుంది. ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పడం లేదు.

# రాజన్న వసతి గదుల ధరలు పెంపు

- వంద రూపాయల గదికి రూ.12 జీఎస్టీ
- కొత్త ధరలతో బోర్డు ఏర్పాటు



పెంచిన ధరలు తెలిపే బోర్డు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్నను దర్శించుకునేందు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. పేదల దేవుడిగా పేరున్న రాజన్న ఆలయ అద్దె వసతి గదుల ధరలను పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు ఆలయం ఆవరణలోని గదుల సమీపంలో బోర్డును ఏర్పాటు చేశారు. రాజన్న అద్దె గదులకు రూ.100కు రూ.12 జీఎస్టీ వసూలు చేయడంతో సామన్య భక్తులకు భారంగా మారిందంటున్నారు. గతంలో రూ.వెయ్యి దాటిన అద్దె గదికి మాత్రమే జీఎస్టీ పన్ను వసూలు చేశారు. కానీ ఇప్పుడు రూ.100 గదికి కూడా రూ.12 జీఎస్టీ వసూలు చేస్తున్నారు. అలాగే అద్దె గదుల ధరలను కూడా పెంచారు. అమ్మవారి అతిథి గృహంలో గదికి అద్దె రూ.వెయ్యి ఉండగా దాన్ని రూ.1500లకు పెంచి జీఎస్టీతో కలిపి రూ.1,680 చెల్లించాలి. భీమేశ్వర అతిథిగృహం, నందీశ్వర సూట్ గదుల అద్దె రూ.2,200 ఉండగా దాన్ని రూ.2500లకు పెంచి రూ.300 జీఎస్టీతో కలిపి రూ.2,800 చెల్లించాలి. నందీశ్వరలో వసతిగదికి రూ.350 ఉండగా దానికి రూ.150 పెంచి రూ.500 చేయడంతో జీఎస్టీతో కలిపి రూ.560 చెల్లించాలి. పార్వతీపురం వసతిగది రూ.200 ఉండగా రూ.100 పెంచి దాన్ని రూ.300 చేసి జీఎస్టీతో కలిపి రూ.336 చెల్లించాలి. పార్వతీపురం బ్లాకులలో రూ.500 అద్దె ఉండగా దాన్ని రూ.100 పెంచి రూ.600 చేసి జీఎస్టీతో కలిపి రూ.672 చెల్లించాలి. లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో గదికి రూ.250 ఉండగా రూ.150 పెంచి రూ.400 చేసి దాన్ని జీఎస్టీతో కలిపి రూ.448 చెల్లించాలి. శంకరపురం ధర్మశాల వసతి గది రూ.50 ఉండగా మరో రూ.50 పెంచి రూ.100 చేసి జీఎస్టీతో రూ.112 చెల్లించాలి. పెంచిన ధరలతో రాజన్న ఆలయ ఆవరణలోని గదుల సమీపంలో కొత్త ధరల బోర్డును ఏర్పాటు చేశారు.

# విద్యుత్ సరఫరాలో లోపాలు ఉండొద్దు

- కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్



మాట్లాడుతున్న ఎస్ఈ గంగాధర్

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ సరఫరాలో లోపాలు ఉండొద్దని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. కరీంనగర్‌లోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్ డివిజన్ల ఓఅండ్ఎం సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారంతోపాటు బ్రేక్‌డౌన్లను నివారించాలని, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీఈ రాజం, ఎస్ఏవో రాజేశం, ఏడీఈ కొలుపుల రాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థి మృతి



అక్షయ్ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్‌కు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. నామాపూర్‌కు చెందిన మంగళి అక్షయ్(17) సోమవారం చీకోడు నుంచి స్నేహితుడితో కలిసి నామాపూర్ వైపు వస్తుండగా వాహనంపై నుంచి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన అక్షయ్‌ను సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న అక్షయ్ మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు శమంత, దేవయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కాగానొక్క కొడుకు మృతితో తాము దిక్కులేని వారమయ్యామని వారు రోదించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాజేందర్ (ఫైల్)



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న యువకులు

వెల్గటూర్: మండలకేంద్రంలోని పెద్దవాగులో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమవడం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన నస్పూరి రాజేందర్ (42)కు మండలకేంద్రానికి చెందిన పుట్టపాక శంకరమ్మ–కిష్టయ్య కూతురు స్రవంతితో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. రజక కులానికి చెందిన రాజేందర్ శుభకార్యాలకు వంట పనులు చేస్తుంటాడు. మంగళవారం ఉదయం పనినిమిత్తం వెలటూర్‌లోని తన అత్తగారింటికి వచ్చాడు. ఓ శుభకార్యంలో మేకలు కోసేందుకు వెళ్లి రాత్రయినా ఇంటికి రాలేదు. దీంతో బావమరిది పుట్టపాక జయందర్ మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. బుధవారం ఉదయం రాజేందర్ మృతదేహం వెల్గటూర్‌లో పెద్దవాగులో లభ్యమైంది. అయితే రాజేందర్ మంగళవారం సాయంత్రం రాజక్కపల్లిలోని ధర్మాజి సత్యం ఇంటికి వెళ్లాడని, అక్కడ గొడవ జరగడంతో పారిపోతుండగా పెద్దవాగులో ఈదుకుంటూ వెళ్లి మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో రాజేందర్ మృతిపై ధర్మాజి సత్యం, ధర్మాజి గంగారాంపై అనుమానాలున్నాయని జయంధర్ ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత పేర్కొన్నారు.

### విద్యుదాఘాతంతో బాలుడు..

జగిత్యాలక్రైం: విద్యుత్‌షాక్‌తో ఓ బాలుడు మృతిచెందని ఘటన జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని మహబూబ్‌పుర ప్రాంతానికి చెందిన అయాన్ (15) అలీ డెకరేషన్ పనిచేస్తాడు. గణేశ్‌నగర్‌లో బుధవారం మధ్యాహ్నం ఓ బంగ్లాపై డెకరేషన్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలపై పడగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి షరీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ పాల్గొన్నారు.

### సుగ్లాంపల్లిలో చోరీ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లిలో బుధవారం చోరీ జరిగింది. ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సుల్తానాబాద్ మండలం పెర్కపల్లి చెందిన పల్లె సదయ్య కుటుంబ సభ్యులతో కలిసి సుగ్లాంపల్లిలో నివాసముంటున్నాడు. సదయ్య ఓ మిల్లులో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా భార్య రజిత ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. బుధవారం ఇద్దరు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండగా ఇంట్లోని రూ.28వేలు నగదు, బంగారం, 10తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### జాతీయ సెస్టోబాల్ పోటీలకు విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సెస్టో పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన మహాలక్ష్మి, హారిణి, అస్మిత, అక్షర, స్ఫూర్తి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికవడంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. వీరు ఈనెల 15,16,17 తేదీల్లో పంజాబ్‌లోని ధూరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. కరస్పాండెంట్ రజని, ప్రిన్సిపాల్ రజియొద్దీన్, విజయ్, స్రవంతి, నవీన్ ఉన్నారు.

# గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం

- పెద్దపల్లి డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో బుధవారం గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం–1994 జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికార అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ప్రమోద్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో ప్రతీ వెయ్యిమంది మగపిల్లలకు 926 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని తెలిపారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ అరికట్టేందుకు ఆరోగ్యశాఖ సిబ్బందితో కూడిన బృందం ప్రతీనెల ఐదు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తోందని వెల్లడించారు. తద్వారా స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ నివారణ చట్టంపై పూర్తిఅవగాహన కల్పించాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేశ్, ప్రోగ్రామ్ అధికారి (ఎంహెచ్ఎన్) డాక్టర్ ఆర్.రాజమౌళి, పిల్లల వైద్య నిపుణుడు రవీందర్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో రెండ్రోజులుగా సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న ఎనిమిదో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో చాంపియన్‌గా వరంగల్ జిల్లా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాలు నిలవగా కరీంనగర్ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలతో పాటు బంగారు, రజత, కాంస్య పతకాలు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో జిల్లాలో జూడో క్రీడకు గ్రామాల్లో ఆదరణ రానుందన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన 18 మంది బాలబాలికలను కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసామన్నారు. కార్యక్రమంలో భారత జూడో సమాఖ్య కోశాధికారి కైలాసం యాదవ్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం. రవీందర్, జిల్లా జూడో సంఘం చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్, జిల్లా పెటా సంగం కార్యదర్శి వేల్పుల సురేందర్, సాయిరి మహేందర్, అంతటి శంకరయ్య, దాసరి రమేశ్, బిట్ర శ్రీనివాస్, ఎండీ యూనిస్ పాషా, బైరగోని రవీందర్ గౌడ్, కుమార్ కిషోర్, బాలసాని రాజ్‌కుమార్ గౌడ్, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్ యాదవ్, ఇక్బాల్, శివ, సత్యనారాయణ వివిధ జిల్లాల నుంచి హాజరైన కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సోహెల్



దీక్షిత

జగిత్యాల రూరల్: మండలంలోని పొరండ్ల జెడ్పీ పాఠశాలకు చెందిన ఎండీ సోహెల్, ఆకుల దీక్షిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ అంజన్న తెలిపారు. ఈనెల 4న కరీంనగర్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎండీ సోహెల్ డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం, దీక్షిత 5 కి.మీ వాకింగ్‌లో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 7 నుంచి 9 వరకు వరంగల్ హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

**రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు..**



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీ

జగిత్యాలరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ నాగసుధారాణి తెలిపారు. బాస్కెట్‌బాల్ అండర్ 17 బాలుర విభాగంలో మహేశ్, చరణ్, అఖిల్, అండర్ 14 బాలికల విభాగంలో రోహిత ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకాగా, బుధవారం పాఠశాల పీఈటీ వినీత్, అజీమ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# కవితను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు



ఎమ్మెల్సీ కవితతో టీబీజీకేఎస్ నాయకులు

రామగిరి(మంథని): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి. వెంకట్రావు, జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్య కలిశారు. సింగరేణి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికలపై చర్చించారు. కార్మికుల్లో 50 శాతం యువ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నందున ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని కవిత సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను లాభాల బాటా పట్టించిన విషయాన్ని కార్మికులకు తెలిపాలన్నారు. టీబీజీకేఎస్ ద్వారా యువత, మహిళలకు ఉద్యోగ కల్పన సాధ్యమైందన్న విషయాన్ని కార్మికులకు వివరిస్తూ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

### 'ఉద్యోగుల పాత్ర కీలకం'

మెట్‌పల్లి: అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన సంజయ్‌ను బుధవారం మున్సిపల్ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుజాత ఉన్నారు. అలాగే పలు సంఘాల నాయకులు కూడా ఎమ్మెల్యేను సన్మానించారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



కరీంనగర్: కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన గంగుల కమలాకర్‌ను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల మధు తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం

కరీంనగర్: చోళమండలం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 31 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. దేశాన్ని నమ్ము, చోళని నమ్ము, నిన్ను నువ్వు నమ్ము అని దేశవ్యాప్తంగా ప్రతి చోళ ఫైనాన్స్ కంపెనీ బ్రాంచులో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చోళమండలం సభ్యులు ప్రమోద్, నవీన్, రంజిత్, చక్రధర్, సీహెచ్ అశోక్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ల గద్దె ఎత్తు పెంపు



కొత్తగా నిర్మించిన గద్దెపై ట్రాన్స్‌ఫార్మర్

కరీంనగర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించేందుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. రహదారుల వద్ద తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదాలపై గతంలో సాక్షి దినపత్రికలో పలు కథనాలను ప్రచురించగా.. అధికారులు స్పందించారు. మొగ్దుంపూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఇరుకుల్ల–చెర్లభూత్కూర్ రహదారిలో ఎత్తు తక్కువగా ఉన్న ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి కొత్తగా గద్దెల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. ఇటీవల నిర్మాణ అనుమతులు మంజూరు కావడంతో కొత్తగా గద్దెలను నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు ఏఈ నరేశ్ తెలిపారు. రోడ్డుకు సమీపంలో ఉన్న సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం మరో దిక్కున బిగించినట్లు వివరించారు.

### రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్(సీబీఎస్ఈ)కు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి తెలిపారు. అండర్–17 బాలుర విభాగంలో రిషి సహిత్, భువన్‌చంద్ర(10వతరగతి), తరుణ్(9వ), అండర్–14 విభాగంలో వరుణ్, వైష్ణవి(8వ) రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, కోచ్ వెంకటేష్‌ను బుధవారం అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాళ్లు భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

### గంగులకు ఆత్మీయ సన్మానం



కరీంనగర్: కరీంనగర్ ఎమ్మెల్యేగా నాల్గోసారి విజయం సాధించిన గంగుల కమలాకర్‌ను ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సారథ్యంలో నగరంలోని ఫ్లవర్ మర్చంట్ అసోసియేషన్, కరీంనగర్ ఓల్డ్ టైర్ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్, కరీంనగర్ రెగ్జిన్ షాప్స్ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్, కరీంనగర్ పట్టణ పీవోపీ అసోసియేషన్లకు సంబంధించిన కమిటీల బాధ్యులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. వివిధ అసోసియేషన్లకు ఎన్నికల ముందిచ్చిన హామీలను నెరవేరుస్తానని, సంఘాల భవనాలకు భూమి, భవనాల నిర్మాణానికి నిధులను మంజూరు చేయించి అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పీవోపీ అసోసియేషన్ బాధ్యుడు జమీల్, రెగ్జిన్ షాప్స్ వర్కర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జహంగీర్, ఓల్డ్ టైర్స్ ఓనర్స్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమూద్ ఖాన్, ఫ్లవర్ మర్చంట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు మహమ్మద్ మోహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



ఆర్టీసీ బస్టాండ్‌లో నివాళులర్పిస్తున్న ఆర్ఎం తదితరులు



కిసాన్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు



నివాళులర్పిస్తున్న ఆర్పీఐ నాయకులు



నినాదాలు చేస్తున్న ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ తదితరులు

## అంబేడ్కర్‌కు ఘన నివాళి

కరీంనగర్/కరీంనగర్‌కార్పొరేషన్/కరీంనగర్‌టౌన్/విద్యానగర్(కరీంనగర్)/కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్: బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం కరీంనగర్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో రీజనల్ మేనేజర్ సుచరిత నివాళులర్పించారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్ భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మంకమ్మతోటలోని సంఘ కార్యాలయంలో నివాళులర్పించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో నివాళులర్పించారు. 3వ డివిజన్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ కిసాన్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఆర్ట్, ఫిజికల్, వర్క్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(టీపీవేటా) జిల్లా అధ్యక్షుడు తాడూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కోర్టు చౌరస్తాలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు పురుమల్ల శ్రీనివాస్ డీసీసీ కార్యాలయంలో నివాళి అర్పించారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాలరెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కొత్తపల్లి పట్టణంలోని విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల సమర్పించి నివాళులర్పించారు. మొగ్దుంపూర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.



కొత్తపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



డీసీసీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కరీంనగర్‌టౌన్: నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



మొగ్దుంపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

### జాబ్ మేళాకు స్పందన



నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన వచ్చింది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. పీజీ, యూజీ, ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గత అయిదేళ్లలో 565 మంది ఉద్యోగాలు సాధించారని అన్నారు. టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ శోభారాణి మాట్లాడుతూ.. జాబ్ మేళాలో 180 మంది అభ్యర్థులు పాల్గొన్నారని తెలిపారు. కంటెంట్ క్రియేటర్, ఎస్ఈవో ఎక్స్‌పర్ట్, వీడియో ఎడిటర్, పోస్టర్ డిజైన్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడర్స్ తదితర ఉద్యోగాలకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్ నిర్వహించారని అన్నారు. 25 మందిని ఎంపిక చేసి, అప్పటికప్పుడు ఆఫర్ లెటర్స్ ఇచ్చారని తెలిపారు. కంపెనీల సభ్యులు పవిత్ర, శివ, ప్రశాంత్, దివ్య, రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు



సరుకులు అందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌కు చెందిన 3 నుంచి 9వ తరగతుల విద్యార్థులు తమవంతు సహాయంగా బియ్యం, పప్పులు, వంటనూనె, చక్కెర, పిండి తదితర నిత్యావసర సరుకులను జమ చేశారు. వాటిని విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమం, నియో ఆర్గనైజేషన్ మేనేజర్లకు అందించారు. ఈ సందర్భంగా గొప్ప ఆలోచన చేశారని ఆయన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### చిత్ర కథ




#### సగంసగం పనులు..

నగరంలో స్మార్ట్‌సిటీలో భాగంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులు అర్థంతరంగా వదిలేశారు. దీంతో దుకాణదారులకు ప్రమాదకరంగా మారింది. అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ పనులను పూర్తి చేయాలని దుకాణదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

# పల్లె దారుల్లో పచ్చని కళ



ఫకీర్‌పేటలో ఎస్సారెస్పీ కాలువపై ఇరువైపులా పూల మొక్కలు



సీసీ రోడ్డుకిరువైపులా చెట్లు

కరీంనగర్‌రూరల్: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు వృక్షాలుగా మారి నీడనిస్తున్నాయి. గ్రామీణ రహదారులన్నీ పచ్చని చెట్లతో కళకళలాడుతున్నాయి. కరీంనగర్ మండలం 17 పంచాయతీల పరిధిలో ప్రతి ఏటా చేపడుతున్న హరితహారంలో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నారు. ఐదారేళ్ల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. ప్రధానంగా రహదారులకిరువైపులా నాటిన మొక్కలను జాగ్రత్తగా సంరక్షించడంతో చెట్లుగా మారి నీడనిస్తున్నాయి. ఏ గ్రామాన్ని సందర్శించినా.. రహదారులకు పచ్చని తోరణాలుగా దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎండలో ప్రయాణం చేసి చెట్ల నీడలో సేదతీరేందుకు ఉపయోగపడుతున్నాయి. ఆదర్శ గ్రామ పంచాయతీ ఫకీర్‌పేటలో సర్పంచ్ కటకం నందయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రహదారులకిరువైపులా పండ్లు, పూల మొక్కలను నాటించారు. ప్రధానంగా ఎస్సారెస్పీ కాలువ రోడ్డు, ఊర చెరువుకు వెళ్లే దారిలోని చెట్లు పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.





#### ముసురు తిప్పలు

మిచాంగ్ తుపాను ముసురుకుంది. కరీంనగర్‌లో రెండో రోజు బుధవారం చిరుజల్లులతో కూడిన వర్షం కురవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనుల నిమిత్తం బయటికి వెళ్లినవారు తడవకుండా గొడుగులను తీసుకెళ్లారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

# కేసులు పెట్టిన వాళ్లతో కుమ్మక్కా..




మాట్లాడుతున్న పురుమల్ల శ్రీనివాస్

- కుట్రపూరితంగానే వదంతులు
- కాంగ్రెస్ నాయకుడు పురుమల్ల శ్రీనివాస్

కరీంనగర్‌కార్పొరేషన్: తనపై అక్రమంగా కేసులు పెట్టి వేధించిన వారితో కుమ్మక్కు కావాల్సిన అవసరం తనకేమిటని కాంగ్రెస్ నాయకుడు పురుమల్ల శ్రీనివాస్ అన్నారు. కక్షపూరితంగా, కావాలనే తనపై ఇలాంటి నిందలు వేస్తున్నారని, వదంతులు నమ్మొద్దని కోరారు. బుధవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను సరెండర్ అయ్యానంటూ జరుగుతున్న ప్రచారం కుట్రలో భాగమేనన్నారు. తాను కాంగ్రెస్ నుంచి పోటీ చేసిందే తనను ఇబ్బందులు పెట్టిన వారిపై కసి తీర్చుకోడానికని చెప్పారు. అలాంటిది తాను కుమ్మక్కయ్యానంటూ ప్రచారం చేయడం సరికాదని, నిజాలు నిలకడగా తెలుస్తాయని తెలిపారు. తనపై కేసులు పెట్టి వేధించిన వారికి బుద్ధి చెప్పే పనిలో ఉన్నానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల నిర్ణయాన్ని శిరసావహిస్తానని అన్నారు. ఎన్నికల్లో తనకోసం పని చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. ఎన్నికలకు ముందు చెప్పినట్లు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్, నాయకులు నెల్లికుమార్, బేగం, పొన్నం మధు, రజితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయం.. శరవేగం

### ఏపీ సీఎం ఆదేశాలతో సహాయక చర్యలు ముమ్మరం



సాక్షి, అమరావతి / సాక్షి నెట్‌వర్క్: తుపాను ప్రభావానికి గురైన జిల్లాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం వేగంగా సహాయక చర్యలు చేపట్టింది. తుపాను ప్రారంభం కాక ముందు నుంచే కట్టుదిట్టంగా ముందస్తు ఏర్పాట్లు చేయడం వల్ల ప్రాణ నష్టాన్ని నివారించగలిగారు. ఎనిమిది జిల్లాల్లో 320 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.. 20,572 మందిని తరలించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 124 శిబిరాల్లో 6,077 మందికి ఆశ్రయం కల్పించారు. తిరుపతి జిల్లాలో 36 కేంద్రాల్లో 3,386 మందికి, పశ్చిమగోదావరి జిల్లాలో 12 కేంద్రాల్లో 5,113, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 37 కేంద్రాల్లో 910, బాపట్ల జిల్లాలో 74 కేంద్రాల్లో 3,888, గుంటూరులో 14 శిబిరాల్లో 1,111, కోనసీమ జిల్లాలో 36 శిబిరాల్లో 910, పశ్చిమ గోదావరిలో 32 శిబిరాల్లో 5,113, తూర్పు గోదావరిలో 3 కేంద్రాల్లో 87 మందికి పునరావాసం కల్పించారు. బాధితులందరికీ భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించారు. వారికి అక్కడే నిత్యావసరాలు అందిస్తున్నారు. బాధిత కుటుంబాలు ఇళ్లకు వెళ్లే ముందు ఆర్థిక సాయంగా రూ.1000 నుంచి రూ.2500 అందిస్తున్నారు. తుఫాను ప్రభావిత గ్రామాల్లో 6 ఎస్డీఆర్ఎఫ్, 6 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. కృష్ణా జిల్లా అవనిగడ్డ, మచిలీపట్నం, ప్రకాశం జిల్లా ఒంగోలు, నెల్లూరు, ఉలవపాడు, బాపట్ల, నాయుడుపేటలో ఈ బృందాలు సేవలు అందిస్తున్నాయి. అధికార యంత్రాంగం దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించడంతో రాకపోకలు యథాతథంగా కొనసాగుతున్నాయి. వర్షం తెరిపి ఇవ్వడంతో రైతులు ముంపునకు గురైన పంటలను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఆర్బీకే సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మరోవైపు రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం తీసుకున్న సత్వర చర్యలతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఆపదలో ఉన్న రైతులను గుర్తించడమే కాకుండా, వారి వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వెంటనే కొనుగోలు చేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు. సీఎం ఆదేశాల మేరకు తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

# టీడీపీకి లక్ష్యంగా అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి

**ఆయనపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర రీతిలో తప్పుడు ప్రచారం**

- ఐటీడీపీ నేతృత్వంలో ఆయన పేరుతో నకిలీ ఖాతాలు
- ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలను పొన్నవోలు దూషించినట్లు పోస్టులు
- ఆయనే వాటిని పోస్టు చేసినట్లు చిత్రీకరణ
- చంద్రబాబు స్కాంలపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుల్లో వాదిస్తున్న సుధాకర్‌రెడ్డి
- దీంతో సుధాకర్‌రెడ్డిపై టీడీపీ వర్గాల దుష్ప్రచారం



**సాక్షి, అమరావతి:** గత టీడీపీ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయస్థానాల్లో వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా చేసుకుంది. ఆయనపై అనైతిక దాడులకు పాల్పడుతోంది. టీడీపీ పెద్దల ప్రోద్బలంతో సోషల్ మీడియాలో ఆ పార్టీ అనుబంధ సంఘం ఐటీడీపీ అసభ్యకర రీతిలో పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఆయన పేరుతో సామాజిక మాధ్య మాల్లో నకిలీ ఖాతాలు తెరిచి అందులో అసభ్య పదజాలం ఉపయోగిస్తూ పోస్ట్ చేస్తోంది. ఆయనే వాటిని పోస్ట్ చేసినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తోంది. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, తెలంగాణ సీఎల్పీ నేత రేవంత్‌రెడ్డికి, పలువురు ఎంపీలకు వ్యతిరేకంగా పొన్నవోలు ట్వీట్లు చేసినట్లుగా సామాజిక మాధ్య మాల్లో ప్రచారం చేస్తోంది. ఇందుకోసం సుధాకర్‌రెడ్డి పేరుతో ఆయన ఫొటోను ఉపయోగించి నకిలీ ఖాతాలను తెరిచింది. న్యాయవ్యవస్థపై సుధాకర్‌రెడ్డి ఆరోపణలు చేసినట్లు నకిలీ వార్తలను వ్యాప్తి చేస్తోంది. న్యాయస్థానాల్లో పొన్నవోలును ఢీకొట్టలేని టీడీపీ ఇలా తప్పుడు మార్గాలను అనుసరిస్తోంది. తద్వారా సుధాకర్‌రెడ్డి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది.

సీఎంగా ఉండగా చంద్రబాబు చేసిన అనేక కుంభకోణాలపై సీఐడీ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఏసీబీ కోర్టు మొదలు సుప్రీం కోర్టు వరకు గట్టిగా, సమర్థంగా వాదనలు వినిపిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయన వాదనాపటిమతో చంద్రబాబు జైలుకెళ్లక తప్పలేదు. చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు పాటు రిమాండ్ విధించడం, మధ్యంతర బెయిల్ వచ్చే వరకు ఆయన జైలులోనే ఉండటంలో పొన్నవోలు కీలక పాత్ర పోషించారు. చంద్రబాబు మధ్యంతర బెయిల్, రెగ్యులర్ బెయిల్‌ను కూడా సుధాకర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. హైకోర్టులో గట్టిగా వాదనలు వినిపించారు. హైకోర్టు చంద్రబాబుకు బెయిల్ ఇచ్చిన వెంటనే హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేయించారు. దగ్గరుండి పిటిషన్ దాఖలు చేయించి అతి తక్కువ సమయంలోనే అది విచారణకు వచ్చేలా చేయడంలో విజయం సాధించారు. ఇలా ప్రతి దశలో సుధాకర్‌రెడ్డి అడ్డు తగులుతుండటంతో టీడీపీ వర్గాలు ఆయన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఆ పార్టీ సీనియర్ నేతలు గత వారంలో ప్రతి రోజూ సుధాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా మీడియా సమావేశాలు పెట్టి మరీ దూషించడం మొదలుపెట్టారు. ఆయనపై సీఎస్‌కు సైతం ఫిర్యాదు చేశారు. హైకోర్టులో సైతం ఆయనపై పిల్ దాఖలు చేయించారు. అయితే, ఇవన్నీ అంతగా ఫలించలేదు. దీంతో టీడీపీ వర్గాలు మరింత బరి తెగించాయి. ఆయన పేరుతో ప్రముఖ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు తెరిచి, వాటి ద్వారా అసభ్య పదజాలంతో ట్వీట్లు చేస్తూ వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. సుధాకర్‌రెడ్డే ఆ ట్వీట్లు చేస్తున్నట్లు కూడా ప్రచారం మొదలుపెట్టాయి. ఈ విషయం సుధాకర్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. టీడీపీ తప్పుడు ప్రచారంపై పొన్నవోలు బుధవారం సీఐడీకి ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమైన 'ఎక్స్'కు సైతం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆ ట్వీట్లను తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి వాటికి భయపడేది లేదని, ఇలా వెనుక నుంచి కాకుండా తనతో నేరుగా పోట్లాడాలని ఆయన టీడీపీ నాయకులకు సవాలు విసిరారు. కుంభకోణాల్లో చంద్రబాబుకు శిక్ష పడే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలిపారు.

# తుపాను మృతులకు ప్రధాని మోదీ సంతాపం

### విపత్తులో విశేష సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసలు



సాక్షి, న్యూఢిల్లీ: 'మిచాంగ్' తుపాను ప్రభావంతో మృతి చెందిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. తుపాను ప్రభావిత రాష్ట్రాల్లో పెనుగాలుల బీభత్సం, వర్ష సంబంధిత ఘటనల్లో పలువురు మృతి చెందడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్న అధికారుల సేవలను ప్రధాని కొనియాడారు. పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వీరంతా సేవలందిస్తారని బుధవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

## ఉత్తర తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌పై కొనసాగుతున్న వాయుగుండం



సాక్షి, హైదరాబాద్: ఉత్తర తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారుతుందని, దీని ప్రభావంతో గురువారం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మాదిరి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది. శుక్రవారం రాష్ట్రంలో పొడివాతావరణమే ఉంటుందని తెలిపింది. కాగా, బుధవారం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత మహబూబ్‌నగర్‌లో 30 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 17.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

## గూడ్స్ రైలుకు తప్పిన ప్రమాదం

పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి సమీపాన గూడ్స్ రైలుకు ప్రమాదం తప్పింది. భారీ వర్షాల కారణంగా ఇక్కడ రైల్వే ట్రాక్‌పై కొండచరియలు పడ్డాయి. అదే సమయానికి గూడ్స్ వస్తుండగా, గుర్తించిన సిబ్బంది రాకపోకలను నిలిపివేశారు. యుద్ధ ప్రాతిపదికన ట్రాక్‌పై రాళ్లను తొలగించి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, సత్తుపల్లి మండలంలోని ఓసీల నుంచి నిత్యం కొత్తగూడెంకు వేల టన్నుల బొగ్గు గూడ్స్ రైళ్ల ద్వారా రవాణా జరుగుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగానే కొండచరియలు ట్రాక్‌పై పడి ఉంటాయని భావిస్తున్నారు.

# పంట.. నీటిపాలు



బూర్గంపాడులో వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేను



కూసుమంచి మండలం నేలపట్లలో తడిసిన మిర్చిని ఆరబోస్తున్న రైతులు

▶ మొదటి పేజీ తరువాయి

నేలవాలుతోంది. గాలులకు ఆరిపోయి ఉన్న కంకుల నుంచి గింజలు నేలరాలిపోతున్నాయి. ఇక నేలవాలిన కంకులు తేమ కారణంగా మొలకొచ్చే ప్రమాదం కూడా ఉంది. ఇక నేలవాలిన వరిని యంత్రాలు కోయటం అంతగా సాధ్యం కాదు. కూలీలతో వరికోతలు జరిపించాల్సి ఉంటుంది. దీంతో రైతులకు ఖర్చులు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఓ వైపు పంట నేలవాలి కొంత దెబ్బ తినగా, మరో వైపు కూలీల ఖర్చులు పెరిగి పెట్టుబడులు మరింతగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక కల్లాల్లో ఆరబెట్టిన రైతులు రాశులుగా చేసి టార్పాలిన్లను కప్పి రక్షించుకునే పనిలో ఉన్నారు. తేమతో ఉన్న ధాన్యం రాశులు నాణ్యత కోల్పోతాయని రైతులు దిగులు చెందుతున్నారు. రెండు రోజులు తుపాను కొనసాగితే రాశుల్లో మొలకొచ్చే ప్రమాదం కూడా ఉందని రైతులు చెబుతున్నారు.

**మిర్చిది అదే పరిస్థితి...**

కాత దశలో ఉన్న మిర్చి పైర్లు నేలవాలే ప్రమాదం ఉంది. మిర్చి కాయబరువుతో చెట్టు పడిపోతుందని రైతులు చెబుతున్నారు. అక్కడక్కడ తొలి కోతలు కూడా సాగుతున్నాయి. కోసిన మిర్చి ఆరబెట్టకుండా రాశులుగా కల్లాల్లో ఉంచితే తేమబారిన పడి నాణ్యత కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తేమతో ఉన్న కాయకు నల్లమచ్చ ఆశించే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వానలు మాత్రం రైతులను నష్టపరుస్తున్నాయే తప్పా ప్రయోజనం కలిగించటం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీగానే నష్టం**

ఖమ్మం జిల్లాలో 53,903 మంది రైతులకు చెందిన 82,191 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఇందులో అధికంగా వరి 59,307 ఎకరాల్లో నష్టపోయినట్టు చెబుతున్నారు.

- భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 7,450మంది రైతులకు సంబంధించిన 13,608 ఎకరాల్లో వరి, వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి, పత్తి పంటలు ధ్వంసమైనట్లు అంచనావేశారు. ప్రస్తుతం అధికారులు అంచనాల్లో నిమగ్నం కాగా.. ఒకటి, రెండు రోజుల్లో పంట నష్టంపై స్పష్టత రానుంది.
- వాజేడు మండలంలో ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ ఆధ్వర్యంలో అధికారులు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ ప్రాంత ప్రజలను కాపాడేందుకు ఏటూరునాగారంలో పోలీస్ విపత్తు దళం ముళ్లకట్ట వద్ద హైపవర్ బోటులో రీహార్సల్ చేపట్టింది.

**చనిపోయిన 13 వేల బాతులు... గుండెపోటుతో యజమాని మృతి**



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టాపురానికి ఏపీలోని జగ్గయ్యపేట మండలానికి చెందిన పేరం ఆదిలక్ష్మి(67) కుటుంబ సభ్యులతో కలిసి బాతులను తీసుకొచ్చి పెంచుతున్నారు. తుపాన్ ప్రభావంతో తడిచిన 13వేల బాతు పిల్లలు మృతి చెందడంతో యజమాని ఆదిలక్ష్మి గుండెపోటుతో మృతి చెందారు.

**పరిహారం ఇవ్వాలి: తెలంగాణ రైతు సంఘం**

రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాన్ని తక్షణం అంచనా వేసి నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ. 20 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 40 వేలు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి.సాగర్ కోరారు.

**పంటలు తడిసి ముద్దయ్యాయి: కూనంనేని**

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. పత్తి, మిర్చికి ఎకరాకు రూ. 40 వేలు, వరికి ఎకరాకు రూ.20 వేలు, కూరగాయలకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు.

# ఆత్మరక్షణ.. శారీరక దృఢత్వం

- ఆత్మవిశ్వాసం లక్ష్యంగా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న బాల, బాలికలు
- 'జూడో'కు ఆతిథ్యం ఇచ్చిన సుల్తానాబాద్
- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు




తలపడుతున్న బాల, బాలికలు

సుల్తానాబాద్ (రామగుండం): బాల, బాలికల్లో ఆత్మ స్థైర్యం, శారీరక దారుఢ్యం పెంపొందించడం లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో రెండ్రోజులపాటు నిర్వహించిన జూడో రాష్ట్రస్థాయి బాల, బాలికల పోటీలు బుధవారం ముగిశాయి. మంగళవారం 8వ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు.

**క్రీడల హబ్.. సుల్తానాబాద్**

- సుల్తానాబాద్ క్రీడల హబ్‌గా ఇప్పటికే పేరు పొందింది.
- ఇప్పటికే ఖోఖో, వాలీబాల్ క్రీడలకు కేరాఫ్‌గా నిలిచింది.
- తాజాగా యుద్ధక్రీడ జూడో రాష్ట్రస్థాయి పోటీలకు మంగళ, బుధవారాల్లో ఆతిథ్యం ఇచ్చింది.
- ఖోఖో, వాలీబాల్‌తోపాటు ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, టెన్నికాయిట్, బేస్‌బాల్, ఫ్లోర్‌బాల్, పవర్ లిఫ్టింగ్ తదితర విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యం ఇచ్చింది.
- తాజాగా జూడో పోటీలను రెండ్రోజుల పాటు విజయవంతంగా నిర్వహించింది.

**ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారుల రాక..**

ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు జూడో పోటీలకు హాజరైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సిలివేరి మహేందర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ తెలిపారు. 300 మంది బాల, బాలికలు, 50మంది కోచ్‌లు, 50 మంది మేనేజర్లు, 30మంది పీఈటీలు పోటీలను విజయవంతంగా నిర్వహించారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి కల్పించారు.

**కేరళలో జాతీయస్థాయి పోటీలు**

సుల్తానాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు ఈనెల మూడో వారంలో కేరళ రాష్ట్రంలో జరిగే పోటీలకు హాజరవుతారు. అయితే, ఆ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని జూడో అసోసియేషన్ జాతీయ కోశాధికారి కైలాస్ యాదవ్ తెలిపారు.

**ఆటలు అంటే ఇష్టం**



నాకు ఆటలు అంటే ఎంతో ఇష్టం. జూడో అంటే ఇంకా ఇష్టం. అందుకే జాతీయస్థాయిలో ఆడి మంచిపేరు తీసుకొస్త. ఆత్మరక్షణకు జూడో ఎంతో అవసరం.

– రామ్‌చరణ్, భువనగిరి

**గోల్డ్‌మెడల్ సాధించా**



సుల్తానాబాద్‌లో జరిగిన జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించా. ఆటలు ఆడడం ముఖ్యం నైపుణ్యం చూపడం ముఖ్యం. మెలకువలు నేర్చుకుని ప్రతిభ చూపిన.

– హన్సిక, వరంగల్

**మంచిపేరు తెస్తా**



జూడోలో ప్రతిభ చూపి జిల్లాకు మంచిపేరు తేవాలనేది నా సంకల్పం. భవిష్యత్‌లో జాతీయస్థాయిలో రాణించానేదే లక్ష్యం. అందుకే ఇప్పుడు గోల్డ్‌మెడల్ సాధించిన.

– కె.శ్రీవిజన్, మహబూబాబాద్

**ఒలింపిక్స్ లక్ష్యం**



ఒలింపిక్స్‌లో జూడో ఆడి మంచిపేరు తేవడమే నా లక్ష్యం. అమ్మానాన్న, కోచ్‌ల ప్రోత్సాహంతో మెలకువలు నేర్చుకున్న. ఇప్పుడు జరిగిన పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన.

– ఐజా, కరీంనగర్

# మార్పు.. గెలిచే

- రిజర్వ్ స్థానాల్లో మార్పునకే చోటు
- మారిన అభ్యర్థులు, కొత్త వారికి ఆదరణ
- ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో సత్ఫలితాలు



చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సాక్షి,ఆదిలాబాద్: రిజర్డ్వ్ నియోజకవర్గాల్లో మార్పునకే చోటు దక్కింది. మార్పు అంటే కాంగ్రెస్ నినాదం అని ఇక్కడ అనుకుంటే పొరపాటు. ఈ నియోజకవర్గాల్లో ఆయా పార్టీల నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కాకుండా ఇతరులు, కొత్త ముఖానికి ఆదరణ లభించింది. వారే గెలిచారు. ఈ ఫలితాలు ఆసక్తి కలిగిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ ఉండగా, రెండు ఎస్సీ నియోజకవర్గాల్లో చెన్నూర్, బెల్లంపల్లి ఉన్నాయి.

**ఎస్టీ నియోజకవర్గాల్లో..**

ఎస్టీ నియోజకవర్గాలైన బోథ్, ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలను కాకుండా ఇతరులకు టికెట్ ఇచ్చారు. బోథ్‌లో రాథోడ్ బాపూరావును కాదని అనిల్ జాదవ్‌కు, ఆసిఫాబాద్‌లో ఆత్రం సక్కుకు కాకుండా కోవ లక్ష్మికి కేటాయించారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ గెలిచిన స్థానాలు ఈ రెండే కావడం గమనార్హం. ఇక్కడ మార్చిన అభ్యర్థికి పట్టం కట్టారు ఓటర్లు. మరో ఎస్టీ నియోజకవర్గం అయిన ఖానాపూర్‌లో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి రాథోడ్ రమేశ్ పోటీ చేశారు. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. కాంగ్రెస్ యువ నాయకుడు వెడ్మ బొజ్జు పటేల్‌ను బరిలోకి దింపి సక్సెస్ అయింది. ఖానాపూర్ ప్రజలు బొజ్జును ఆదరించడంతో విజయం దక్కింది.

**ఎస్సీ నియోజకవర్గాల్లో..**

ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలైన చెన్నూర్, బెల్లంపల్లిలో గడ్డం బ్రదర్స్ కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచారు. చెన్నూర్‌లో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బొర్లకుంట వెంకటేశ్ నేతకాని పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ చేతిలో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల సమయంలో వెంకటేశ్ నేతకాని బీఆర్ఎస్‌లో చేరి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ చివరి క్షణంలో గడ్డం వివేక్‌ను బరిలోకి దించింది. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆయనకు వెంటనే టికెట్ కన్ఫమ్ చేసింది. మంచి మెజార్టీతో వివేక్ విజయం సాధించడంతో హస్తం శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తుంది.

ఇక బెల్లంపల్లి నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా సీపీఐ ఇక్కడి నుంచి పోటీ చేయగా గుండా మల్లేశ్ బరిలో దిగారు. అప్పుడు కాంగ్రెస్ టికెట్ ఆశించి వినోద్ బీఎస్పీ నుంచి పోటీలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య గెలుపొందారు. ఈ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ టికెట్ సాధించి గడ్డం వినోద్ బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యపై గెలుపొందారు. మొత్తంగా ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖాలను మార్చి సక్సెస్ సాధించింది.

**బీజేపీకి దక్కని ఫలితం**

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ అనూహ్య ఫలితాలు సాధించింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ జనరల్ నియోజకవర్గాల పరిధిలో విజయం సాధించింది. ఇదే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాల్లో ఓటమి చవిచూసింది. బోథ్‌లో బీజేపీ రెండో స్థానం సాధించగా, ఖానాపూర్‌లో మూడో స్థానం, ఆసిఫాబాద్‌లో నాల్గో స్థానానికి పరిమితం అయింది. ఇక ఎస్సీ నియోజకవర్గాలైన చెన్నూర్, బెల్లంపల్లిలో బీజేపీ నామమాత్రంగా పోటీ ఇచ్చింది.

# డబ్బులు తీసుకొని.. ఉద్యోగాలు ఇవ్వట్లే

- బాధితుల ఆవేదన



మాట్లాడుతున్న బాధితులు

**హుజూరాబాద్‌రూరల్:** విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, మోసం చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట మాట్లాడారు. వారి వివరాల ప్రకారం.. అనారోగ్య కారణాల వల్ల విద్యుత్ లైన్‌మెన్లు సమ్మిరెడ్డి, రాజేశ్, సంపత్‌లను అధికారులు పక్కనబెట్టారు. అయితే, విద్యుత్ శాఖలోనే పని చేస్తున్న చెల్లమల్ల తిరుపతి రెడ్డి, షకీల్‌లు తమకు సంస్థలో మంచి సంబంధాలు ఉన్నాయని, మీ కుమారులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని వారిని నమ్మించారు. డబ్బులు తీసుకొని, ఇప్పటి వరకు ఉద్యోగాలు ఇప్పించలేదు. అడిగిన ప్రతీసారి తిప్పించుకుంటున్నారని, ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.





## వణికిస్తున్న చలి





మిచాంగ్ తుపాను ప్రభావంతోతో నిర్మల్ జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చల్లటి ఈదురుగాలులతో జనం ఇక్కట్లు పడుతున్నారు. భానుడు మేఘాలు దాటి బయటకు రావట్లేదు. మబ్బులు కమ్ముకుని చీకటిని తలపిస్తోంది. వాతావరణ మార్పులతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. చల్లటి గాలులతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు స్వెట్టర్లు వేసుకుని, నెత్తికి వెచ్చని టోపీలు ధరించి వస్తున్నారు. ఉన్ని దుస్తువులకు గిరాకీ మరింతగా పెరిగింది. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

విజయానికి తొలి మెట్టు కల కనడం.
కల కనడం ఎంత తేలికో ఆ కలను నిజం చేసుకోవడం అంత కష్టం.
అయితే లక్ష్య సాధన వైపు బలంగా అడుగులు వేసే వారికి
కలను నెరవేర్చుకోవడం కష్టం కాదని ఈ ఇద్దరు నిరూపించారు.
మిజోరం నేపథ్యంగా చరిత్ర సృష్టించి వార్తల్లో వ్యక్తులుగా నిలిచారు
వన్నెహ్సోంగీ, మనీషా పధి...

# కలల సాధకులు... చరిత్ర సృష్టించారు

## ఎమ్మెల్యే బారిల్

మిజోరంలో రాజకీయ సంప్రదాయాన్ని పక్కన పెట్టి అధికారంలోకి రాబోతున్న జోరం పీపుల్స్ మూమెంట్ (జెడ్‌పీఎం) గురించి మాట్లాడుకున్నట్లుగానే ఆ పార్టీ నుంచి శాసనసభకు ఎన్నికైన బారిల్ వన్నెహ్సోంగి గురించి కూడా ఘనంగా మాట్లాడుకుంటున్నారు. రేడియో జాకీగా పని చేసిన 32 ఏళ్ల బారిల్ వన్నెహ్సోంగి 'జెడ్‌పీఎం' నుంచి శాసనసభకు ఎన్నికైన అత్యంత చిన్న వయస్కురాలైన మిజోరం శాసన సభ్యురాలిగా రికార్డ్ సృష్టించింది...


● బారిల్ వన్నెహ్సోంగి

మిజోరం శాసనసభ ఎన్నికల్లో జోరం పీపుల్స్ మూమెంట్ (జెడ్‌పీఎం) ఘన విజయం సాధించడమనేది రాత్రికి రాత్రే జరిగిన అద్భుతం కాదు. అదృష్టం కాదు. మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్), కాంగ్రెస్‌లను దాటుకొని అధికారం లోకి రావడం అంత తేలిక కాదు. అయితే 'జోరం పీపుల్స్ మూమెంట్' ఎప్పుడూ ధైర్యాన్ని కోల్పోలేదు.

'మనకంటూ ఒకరోజు తప్పకుండా వస్తుంది' అని గట్టిగా అనుకుంది. సరిగ్గా ఇదే స్ఫూర్తి వన్నెహ్సోంగిలో కనిపిస్తుంది. చలాకీగా, నవ్వుతూ, నవ్విస్తూ కనిపించే వన్నెహ్సోంగి రాజకీయ, సామాజిక సంబంధిత విషయాలను మాట్లాడుతున్నప్పుడు మాత్రం 'ఈ అమ్మాయి ఆ అమ్మాయి ఒకరేనా' అన్నట్లుగా ఉంటుంది.

బలమైన రాజకీయ అభిప్రాయాలు ఉన్న వారికి సైద్ధాంతిక పునాది కూడా ముఖ్యం. కాలేజీ రోజుల నుంచే రాజకీయ దిగ్గజాలతో మాట్లాడడం, ఎన్నో పుస్తకాలు చదవడం ద్వారా ఎన్నో విషయాలపై సాధికారత సాధించ గలిగింది వన్నెహ్సోంగి.

హైస్కూల్ రోజుల నుంచి మొదలు మేఘాలయా రాజధాని షిల్లాంగ్ లోని నార్త్ ఈస్ట్ హిల్ యూనివర్శిటీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ చేసిన సమయం వరకు వన్నెహ్సోంగి ఎప్పుడూ విన్న మాట, బాధ పెట్టిన మాట ... 'రాజకీయాలు మహిళలకు తగనివి. రాజకీయాల్లోకి వచ్చినా రాణించలేరు'

ఈ భావన తప్పు అని నిరూపించడానికి క్రియాశీల రాజకీయాల్లోకి రావాలనే కోరిక ఆమె మనసులో బలంగా పడింది.

రేడియో జాకీగా, టీవి ప్రెజెంటర్‌గా పని చేసిన వన్నెహ్సోంగి ఆ తరువాత రాజకీయాల్లోకి అడుగు పెట్టింది.

'రాజకీయాలు అంటే టీవి మైక్ ముందు మాట్లాడినంత తేలిక కాదు' అని ముఖం మీదే అన్నారు చాలామంది. వారి మాటలతో డీలా పడలేదు వన్నెహ్సోంగి. తమ మీద తమకు నమ్మకం ఉన్న వారి దగ్గర ఢీ అంటే ఢీ అనే ధైర్యం ఉంటుంది. ఆ ధైర్యంతోనే తొలిసారిగా మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసి కార్పోరేటర్‌గా గెలిచింది. విశాల రాజకీయ ప్రపంచంలో కార్పోరేటర్‌గా గెలవడం చిన్న విజయమే కావచ్చుగానీ ఆ విజయం తనకు అపారమైన ధైర్యం ఇచ్చి–

'యస్. నేను సాధించగలను' అని ముందుకు నడిపించింది.

మిజోరంలోని ఐజ్వాల్ సౌత్–3 నియోజక వర్గం నుంచి 1,414 ఓట్ల మెజార్టీతో గెలిచిన బారిల్ వన్నెహ్సోంగి 'సంకల్ప బలం ఉండాలేగానీ మన కలల సాధనకు జెండర్ అనేది ఎప్పుడూ అవరోధం కాదు' అంటుంది.

ఇన్‌స్టాగ్రామ్‌తో ఎంతో మందికి చేరువ అయింది వన్నెహ్సోంగి. ఇన్‌స్టాగ్రామ్ అనేది ఆమె ఇంటి పేరుగా మారింది. ఇన్‌స్టాలో ఆమెకు మూడు లక్షల వరకు ఫాలోవర్‌లు ఉన్నారు.

'భవిష్యత్ లక్ష్యం ఏమిటీ?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం...'చదువు ద్వారా అద్భుతాలు సాధించవచ్చు. అభివృద్ధి పథంలో పయనించవచ్చు. అందుకే రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి నా వంతుగా ప్రయత్నిస్తాను' అంటుంది వన్నెహ్సోంగి.

యంగ్, ఎనర్జిటిక్ అండ్ డేరింగ్ అని అభిమానులు పిల్చుకునే వన్నెహ్సోంగి మదిలో ఎన్నో కలలు ఉన్నాయి. అవి రాష్ట్ర అభివృద్ధితో ముడిపడి ఉన్న కలలు. ఆ కలల సాకారంలో శాసనసభ్యురాలిగా తొలి అడుగు వేసింది.

## ఏడీసీ మనీషా

● మిజోరం గవర్నర్ హరిబాబుతో స్క్వాడ్రన్ లీడర్ మనీషా


చిన్నప్పుడు తండ్రి యూనిఫాంను పోలిన డ్రెస్ ధరించి ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా తెగ హడావిడి చేసింది మనీషా. అద్దంలో తనను తాను చూసుకుంటూ మురిసిపోయింది. తండ్రి నడకను అనుకరించింది. ఆరోజు తమ ముద్దుల బిడ్డను చూస్తూ తెగ నవ్వుకున్న మనీషా తల్లిదండ్రులు, ఇప్పుడు కుమార్తె ఉన్నతిని చూసి గర్విస్తున్నారు. స్క్వాడ్రన్ లీడర్ మనీషా పాధి మిజోరం గవర్నర్ సహాయకురాలి (ఏడీసీ)గా నియామకం అయింది. మన దేశంలో గవర్నర్‌కు ఎయిడ్–డి–క్యాంప్ (ఏడీసీ)గా నియామకం అయిన ఫస్ట్ ఉమన్ ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆఫీసర్‌గా చరిత్ర సృష్టించింది...

మనీషా పధి స్వస్థలం ఒడిషా రాష్ట్రంలోని బెర్హంపూర్. తల్లి గృహిణి. తండ్రి మనోరంజన్ పధి ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. చిన్నప్పటి నుంచే చదువులో ముందుండేది మనీషా. చదువుకు తగ్గ ధైర్యం ఉండేది. తండ్రిలాగే 'ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్' కావాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నది.

చిన్నప్పుడు తండ్రి యూనిఫామ్‌ను పోలిన డ్రెస్‌ను ధరించి సందడి చేసేది.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ చేసిన మనీషా ఆ తరువాత ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరింది. గతంలో ఎయిర్ ఫోర్స్ స్టేషన్–బీదర్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్– పుణె చివరగా భటిండాలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో పనిచేసింది

'ఏడీసీగా మనీషా పధి నియామకం ఒక మైలురాయి మాత్రమే కాదు. లింగ వివక్షతను కాలదన్ని వివిధ రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్న మహిళా శక్తికి నిదర్శనం. ఈ అద్భుత విజయాన్ని సెలబ్రేట్ చేసుకుందాం. అన్ని రంగాల్లో మహిళా సాధికారతను కొనసాగిద్దాం' అని వ్యాఖ్యానించారు మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు.

'ఎయిడ్–డి–క్యాంప్' అనేది సాయుధ దళాల్లో ఉన్నత స్థాయి అధికారికి సహాయపడే అధికారి హోదాను సూచిస్తుంది. మన దేశంలో 'ఎయిడ్–డి–క్యాంప్' గౌరవప్రదమైన హోదా. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్... మొదలైన వాటిలో సర్వీస్ చీఫ్‌లకు సాధారణంగా ముగ్గురు 'ఎయిడ్–డి–క్యాంప్'లు ఉంటారు రాష్ట్రపతికి ఆర్మీ నుంచి ముగ్గురు, నేవీ, ఎయిర్ ఫోర్స్ నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం అయిదుగురు ఉంటారు. ఇక రాష్ట్ర గవర్నర్‌లకు ఇద్దరిని నియమిస్తారు.

### మా కూతురు మా శక్తి

మనిషా పధి తల్లిదండ్రులు ఒడిషాలోని భువనేశ్వర్‌లో నివాసం ఉంటున్నారు. తమ కుమార్తె మిజోరం గవర్నర్ 'ఏడీసీ'గా నియామకం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. '2015లో ఫస్ట్ పోస్టింగ్ నుంచి ఇప్పటి వరకు విధి నిర్వహణకు సంబంధించి ఎంతో అనుభవాన్ని సొంతం చేసుకుంది. ఆ అనుభవమే మనీషాను 'ఏడీసీ'గా నియామకం అయ్యేలా చేసింది. మనిషా తల్లిదండ్రులుగా ఈ నియామకం విషయంలో సంతోషిస్తున్నాం. గర్విస్తున్నాం' అంటున్నాడు మనీషా తండ్రి మనోరంజన్ పధి.

'చదువు విషయంలో, వృత్తి విషయంలో మనీషా మమ్మల్ని సంతోషానికి గురి చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయితే ఇప్పుడు మాత్రం నా సంతోషాన్ని వ్యక్తీకరించడానికి మాటలు రావడం లేదు. మా అమ్మాయి చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో పెరిగింది' అంటుంది మనీషా తల్లి.

'తన కలను నిజం చేసుకోవడానికి సొంత ఊరు దాటి బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టినప్పుడు మాతో పాటు మనీషాకు ఎంతో మంది నిరుత్సాహపరిచే మాటలెన్నో చెప్పారు. మనీషా ఒక్క నిమిషం కూడా అధైర్యపడింది లేదు. అలాంటి మాటలను పట్టించుకోవద్దని మేము గట్టిగా చెప్పేవాళ్లం. అమ్మాయిల కెరీర్ డ్రీమ్స్‌కు తల్లిదండ్రులు అండగా నిలబడితే వారు అద్భుత విజయాలు సాధిస్తారు. తల్లిదండ్రులు గర్వపడేలా చేస్తారు' అంటున్నాడు మనోరంజన్ పధి.


● మనీషా తల్లిదండ్రులు

మనీషా పధి తల్లిదండ్రులకు ఎన్నో ఫోన్ కాల్స్ వస్తున్నాయి. వాటి సారాంశం 'మీ అమ్మాయి బంగారం'

---

**పుస్తకం**

# పని ప్రదేశంలో ఎలా ఉండాలంటే...



ఆఫీసు అంటేనే అక్కడ ఉన్న అందరితోనూ కలిసి పని చేయాలి.
ఇలాంటప్పుడు ఎవ్వరితోనైనా కలిసి ఎలా పని చేయాలి?
వర్క్‌ప్లేస్ ఎక్స్‌పర్ట్, స్పీకర్, రైటర్, హార్వర్డ్ బిజినెస్ రివ్యూ పాడ్‌కాస్ట్ హోస్ట్ అమీ గలో
కార్యాలయాలలో ఎలా ఉండాలో పుస్తకంగా మన ముందుకు తీసుకువచ్చారు.
'గెటింగ్ ఎలాంగ్' అనే ఈ బుక్
ఇప్పుడు పని ప్రదేశాల్లో ఉండే ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.
ప్రపంచవ్యాప్తంగా పని ప్రదేశాలలో ఎదుర్కొనే సమస్యలను అమీ గలో వివిధ రంగాల నుండి స్వయంగా సేకరించింది.
ఈ యేడాది చదివి తెలుసుకోదగిన పుస్తకాలలో అమీ బుక్ ప్రముఖంగా నిలిచింది.
వర్క్ ప్లేస్‌లో ఎలా ఉండాలో అమీ సేకరించిన విషయాలు, సూచించిన పరిష్కారాలు ఉద్యోగులందరికీ ఎంతగానో తోడ్పడుతున్నాయి.

పనిలో సంఘర్షణ ఉంటుంది. పనిచేసే చోట సంబంధాలు కఠినంగా ఉంటాయి. వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు ఒత్తిడి ఉంటే మన సృజనాత్మకత, ఉత్పాదకత కూడా తగ్గుతుంది. స్పష్టంగా ఆలోచించి, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యమూ తగ్గుతుంది. ఈ విషయాల గురించి రాత్రిపూట ఆందోళన చెందుతూ నిద్రలేని రాత్రులు గడపవచ్చు. ఈ ప్రవర్తన చేస్తున్న ఉద్యోగం వదులుకునేలా చేస్తుంది. చేస్తున్న పని నుండి బయటకు వచ్చేసి, ఆ తర్వాత పశ్చాత్తాప పడవచ్చు. మీటింగ్‌లో కళ్లు తిప్పడం, ఎగరేయడం, సహోద్యోగులపై విరుచుకుపడటం లేదా మనం మాట్లాడాల్సినప్పుడు మౌనంగా ఉండటం కూడా మనల్ని ఉద్యోగం నుంచి వేరు చేస్తాయి. చాలావరకు నవ్వుతూ, వేరే మార్గం లేనట్టుగా వ్యక్తులను భరిస్తుంటారు. సరైన పరిష్కారాలు తెలియక హానికరమైన ప్రవర్తనలను భరిస్తుంటారు. ఇక్కడ చూడాల్సింది మనలోని చిత్తశుద్ధి, కెరియర్ మాత్రమే అని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

• • •

వర్క్‌ప్లేస్ ఎక్స్‌పర్ట్ అమీ 'గెటింగ్ ఎలాంగ్'లో కష్టతరమైన సహోద్యోగులను గుర్తించి, ఇలా మన ముందుంచింది.

● **సరైన బాస్ లేకపోవడం:** వీరిపై ఉద్యోగుల్లో విశ్వాసం ఉండదు. ఫలితంగా ఏదో విధంగా మేనేజ్ చేస్తుంటారు. ఇలాంటి బాస్ తన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో అనే దాని గురించే ఎక్కువ ఆందోళన చెందుతారు. నిర్ణయాలు తీసుకోవడానికి, కట్టుబడి ఉండటానికి కష్టపడవచ్చు.

● **నిరాశగా ఉండేవారు:** ఇలాంటి వారితో సరైన ప్రోత్సాహం, కెరీర్‌లో పెరుగుదల ఉండదు.

● **దూకుడుతనంగా ఉండటం:** సహోద్యోగులు తమ గురించి ఏం ఆలోచిస్తున్నారు అనే ధోరణి ఉండదు. తాము ఏదైనా తెలియజేయడానికి పరోక్ష పద్ధతులను ఉపయోగిస్తారు. ఎప్పుడూ ఇతరుల అవసరాలను తీర్చడానికి ఉన్నట్టు కనిపిస్తారు.

● **అన్నీ తెలుసు అనే ఆలోచన:** అత్యంత తెలివైన వారిగా చూపించుకోవడానికి తపన పడుతుంటారు. తగినంత సమాచారం లేకపోయినా, చెప్పేది తప్పు అని తెలిసినా తనదే కరెక్ట్ అనే ధోరణిలో ఉంటారు.

● **హింసించే వ్యక్తులతో ఎప్పుడూ ప్రమాదమే:** సాధారణంగా ఒక సీనియర్ వ్యక్తి ఎన్నో ఆటుపోట్లను అధిగమిస్తేనే ఆ స్థాయికి చేరుకుంటారు. కానీ, అది మర్చిపోయి తన కింద ఉన్నవారితో అనుచితంగా ప్రవర్తిస్తుంటారు. తన ప్రవర్తనతో ఇతరులు బాధపడుతున్నారా అనేది కూడా ఆలోచించరు.

● **పక్షపాతంతో పనిచేసే సహోద్యోగి:** పై స్థాయిలో ఉన్నవారికి ఎప్పుడూ ఏదో ఒకటి చెబుతూనే ఉంటాడు. వారిని పొగుడుతుంటాడు. ఏదైనా నీ కోసం చేస్తాను అంటారు.

● **రాజకీయాలు చేసేవాళ్లు:** ఈ వ్యక్తులు తమ కెరీర్‌ను ఏ విధంగానైనా ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటారు. అందుకోసం అధికంగా ఖర్చు పెట్టడానికి కూడా వెనకాడరు. అబద్ధాలు చెబుతుంటారు.

### అభద్రత పెంచే భయం

నాయకత్వ పాత్రను పోషించాల్సిన సందర్భంలో అభద్రత పెరుగుతుందని పరిశోధనలో తేలింది. అధికారుల అతిపెద్ద భయం అసమర్థతే అని ఒక సర్వేలో తేలింది. సీనియర్ స్థానానికి ప్రమోట్ అయినప్పుడు పనితీరుపై ఒత్తిడి పెరగడం వల్ల ఇది సంభవించవచ్చు.

### టీమ్ వర్క్

బాస్ నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను గుర్తించాలి. సంవత్సరాంతపు లక్ష్యాలను చేధించడం, వర్క్ పాలసీ గురించి నిరంతరం తెలుసుకోవాలి. ఉద్యోగులపై ఉన్న అభద్రతా భావాలను తొలగించగలగాలి. పనిని ఉమ్మడిగా చేయడానికి ప్రయత్నించాలి. పై అధికారి దగ్గర సాధ్యమైనంతవరకు 'మేము' వాక్యాన్నే జోడించాలి. ఉదాహరణకు..'ఈ ప్రాజెక్ట్ విజయవంతం చేయడానికి 'మేమంతా' కష్టపడ్డాం. టీమ్‌గా ఇంకా బాగా కనిపించాలనే మేమంతా కోరుకుంటున్నాం' అని విజయం సాధించినప్పుడు బాస్‌కు తెలియజేయాలి. పనిలో టీమ్ సహకారం ఎంత ఉందో తెలియజేయాలి.

### కలిసిపోవడానికి ముఖ్యమైనవి


ఎవరితోనైనా ఇట్టే కలిసిపోవడానికి సహాయపడేది ముందుగా మన దృష్టి కోణం. అందుకు ఎదుటివారికి ప్రపంచమంతా తెలియాల్సిన అవసరం లేదు. ముందుగా మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. ఎదుటివారికి గురించి తప్పుగా అనుకోకూడదు. సహోద్యోగి ఎంత సన్నిహితమైనా మన స్థాయిని మర్చిపోకూడదు. నియంత్రణలపై దృష్టి పెట్టాలి. సహోద్యోగిని మార్చమని పై అధికారులకు చెప్పే బదులు మనం విభిన్నంగా ఏం చేయగలమో వాటిపైన దృష్టి పెట్టాలి. సహోద్యోగులతో నేరుగా పనులు చేసే అవకాశం లేకపోవచ్చు. ఇలాంటప్పుడు ఇ–మెయిల్ వంటి ఇతర మాధ్యమాలను ఉపయోగించుకోవాలి. ఒకరి దృక్పథాన్ని మరొకరు అర్థం చేసుకోవాలి. లేదంటే, సహోద్యోగి ప్రవర్తన ఎందుకు అలా ఉంది? వారు సహకరించకపోతే నేను మాత్రమే ఎలా పరిష్కరించగలను? ప్రతిదీ ప్రయత్నించాను.. కానీ, ఇప్పుడు ఎలా? ... ఇలాంటి ప్రశ్నలు కొన్ని సార్లు భయానికి ఉదాహరణలుగా నిలుస్తాయి. పనిలో కష్టతరమైన సంబంధాలను కొనసాగించడానికి, వ్యక్తుల మధ్య మంచి బంధాలను పెంపొందించడానికి గెటింగ్ ఎలాంగ్ ఒక మంచి గైడ్‌లా ఉపయోగపడుతుంది.

### ఆఫీసులో స్నేహాలు



'గెటింగ్ ఎలాంగ్ కోసం నేను న్యూరోసైన్స్, వ్యక్తుల హావభావాలలో చూపించే తెలివి, చర్చలు, మేనేజ్‌మెంట్ సైన్స్.. వంటి వివిధ అంశాల నుండి విషయ సేకరణ చేశాను. స్నేహితుల బృందాలు ఉంటేనే మెరుగైన ఫలితాలు వస్తాయి. సపోర్టివ్‌గా ఉండే సహోద్యోగులతో ఉన్న వ్యక్తులు తక్కువ ఒత్తిడిని ఎదుర్కొంటారు. సహోద్యోగులతో సన్నిహితంగా ఉండటం వల్ల సమాచారం, ఆలోచనలు పంచుకోవడం, ఆత్మవిశ్వాసం, సాధన పెరుగుతాయి. ఇతరులతో సామాజిక సంబంధాలు ఎలా ఉంటున్నాయో కూడా దీని ద్వారా అర్థమవుతుంది. స్నేహాలు కెరీర్‌కు కూడా మంచివి. స్నేహితులుగా భావించే సహోద్యోగుల బృందాలు, వారి పనితీరుపై చేసే పరిశోధనలో ఎక్కువ ఉత్పాదకత వచ్చింది.

– అమీ గలో




---

**ఇంటిప్స్**

రెండు టేబుల్ స్పూన్ల కర్బూజా గుజ్జులో టీస్పూను నిమ్మరసం, టేబుల్ స్పూను శనగ పిండి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లై చేసి మర్దన చేయాలి. ఇరవై నిమిషాలు ఆరాక చల్లటి నీటితో కడిగేయాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తే.. చర్మం మీద పేరుకుపోయిన మృతకణాలు, ట్యాన్ తొలగి చర్మం మృదువుగా, కాంతిమంతంగా మారుతుంది.



కెచప్‌లో కొద్దిగా అయోడిన్ వేసి కలపాలి. అయోడిన్ వేసిన తరువాత కెచప్ రంగు మారితే పాడైపోయినట్టు. అంతేగాక ఇతర రసాయనాలు కలిసిన కల్తీ కెచప్ మాత్రమే ఇలా రంగు మారుతుంది.



చీజ్ ముక్కను మంట దగ్గర పెట్టినప్పుడు మండితే చీజ్ నకిలీది. ఇలా కాకుండా నిప్పు సెగకు చీజ్ కరిగితే స్వచ్ఛంగా ఉన్నట్టు.



నిమ్మకాయలను ముప్పైసెకన్లపాటు మైక్రోవేవ్‌లో పెట్టి, ఆ తరువాత పిండితే రసం బాగా వస్తుంది.

కేక్ మిగిలిపోయినప్పుడు అంచులకిరువైపులా బ్రెడ్‌స్లైసులను పెట్టాలి. స్లైసులు పడిపోకుండా టూత్ పిక్ గుచ్చి, రిఫ్రిజిరేటర్‌లో పెడితే కేక్ పాడవకుండా తాజాగా ఉంటుంది.



బ్రెడ్ లేదా బిస్కెట్స్‌ను పాలల్లో ముంచుకుని తినేటప్పుడు...చేతితో కాకుండా... ఫోర్క్‌తో పట్టుకుని ముంచితే పాలల్లో చక్కగా మునిగి మరింత రుచిగా ఉంటాయి.




బాస్కెట్‌లో అడుగున కొన్ని పేపర్ ముక్కలు వేసి బంగాళదుంపలు వేయాలి. దుంపలపైన మరికొన్ని పేపర్ ముక్కలు వేసి నిల్వచేస్తే పాడవకుండా తాజాగా ఉంటాయి.





మిగిలిపోయిన నిమ్మచెక్కలకు ఉప్పు అద్ది ఉంచితే పాడవకుండా తాజాగా ఉంటాయి.

మిగిలిపోయిన బ్రెడ్ ప్యాకెట్‌ను క్లాత్ బ్యాగ్‌లో ఉంచితే బూజు పట్టకుండా తాజాగా ఉంటుంది.





ఉల్లిపాయను ముక్కలు తరిగిన తరువాత చేతులు ఉల్లి వాసన వస్తుంటే... కొద్దిగా టూత్ పేస్టుని తీసుకుని దానితో చేతులను రుద్ది కడగాలి. ఇలాచేస్తే ఉల్లిఘాటు వదిలి పోతుంది.

పేపర్ బ్యాగ్‌కు రంధ్రాలు చేసి లోపల వెల్లుల్లిని పెడితే నెలలపాటు నిల్వ ఉంటుంది.



## నడక ఆగే వరకు ఐపీఎల్ ఆడతా: మ్యాక్స్‌వెల్

క్రికెట్ ప్రపంచంలో అత్యుత్తమ లీగ్ అయిన ఐపీఎల్‌పై ఆసీస్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ తన అభిమానాన్ని ప్రదర్శించాడు. టోర్నీలో ప్రతీసారి తాను ఆడేందుకు ప్రయత్నిస్తానని చెప్పాడు. 'నా కెరీర్‌లో నేను ఆడే ఆఖరి టోర్నమెంట్ ఐపీఎలే అవుతుంది. నేను నడవలేని స్థితికి వచ్చేవరకు ఐపీఎల్ ఆడుతూనే ఉంటా. ఈ టోర్నీ నాపై బాగా ప్రభావం చూపించింది. కోహ్లి, డివిలియర్స్‌లాంటి వారితో కలిసి ఆడే అవకాశం వచ్చింది. నా పురోగతిలో ఈ లీగ్ పాత్ర చాలా పెద్దది' అని మ్యాక్స్‌వెల్ అభిప్రాయపడ్డాడు.



## ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో వొజ్నియాకి

ప్రపంచ మాజీ నంబర్‌వన్, డెన్మార్క్ టెన్నిస్ స్టార్ వొజ్నియాకి వచ్చే ఏడాది జరిగే తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగనుంది. ప్రస్తుతం 242వ ర్యాంక్‌లో ఉన్న 33 ఏళ్ల వొజ్నియాకికి నిర్వాహకులు 'వైల్డ్ కార్డు' కేటాయించారు. 2018లో ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన వొజ్నియాకి 2020లో టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పింది. గత ఏడాది ఆగస్టులో పునరాగమనం చేసి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడింది.

## తెలుగు టైటాన్స్‌కు నిరాశ



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 28-50 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 11 పాయింట్లతో రాణించాడు. పట్నా తరఫున సచిన్ 14 పాయింట్లు స్కోరు చేశాడు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 57-27తో హరియాణా స్టీలర్స్‌పై ఘనవిజయం సాధించింది. యూపీ యోధాస్ తరఫున సురేందర్ 13 పాయింట్లు, ప్రదీప్ నర్వాల్ 12 పాయింట్లు స్కోరు చేశారు.

### ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | టై | పా |
|---|---|---|---|---|---|
| గుజరాత్ జెయింట్స్ | 3 | 3 | 0 | 0 | 15 |
| యూపీ యోధాస్ | 2 | 1 | 1 | 0 | 6 |
| యు ముంబా | 2 | 1 | 1 | 0 | 6 |
| పట్నా పైరేట్స్ | 1 | 1 | 0 | 0 | 5 |
| తమిళ్ తలైవాస్ | 1 | 1 | 0 | 0 | 5 |
| పుణేరి పల్టన్ | 1 | 1 | 0 | 0 | 5 |
| బెంగాల్ వారియర్స్ | 1 | 1 | 0 | 0 | 5 |
| బెంగళూరు బుల్స్ | 2 | 0 | 2 | 0 | 2 |
| జైపూర్ పింక్ పాంథర్స్ | 1 | 0 | 1 | 0 | 1 |
| తెలుగు టైటాన్స్ | 2 | 0 | 2 | 0 | 1 |
| దబంగ్ ఢిల్లీ | 1 | 0 | 1 | 0 | 0 |
| హరియాణా స్టీలర్స్ | 1 | 0 | 1 | 0 | 0 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

# పరాజయంతో ప్రారంభం

**తొలి టి20 మ్యాచ్‌లో ఓడిన భారత మహిళల జట్టు**

- 38 పరుగులతో నెగ్గిన ఇంగ్లండ్
- మెరిసిన వైట్, నాట్ సివర్
- షఫాలీ అర్ధ సెంచరీ వృథా

ముంబై: సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు పరాజయంతో ప్రారంభించింది. బుధవారం వాంఖెడె మైదానంలో జరిగిన తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 38 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోయింది. హీతెర్ నైట్ సారథ్యంలోని ఇంగ్లండ్ ఈ గెలుపుతో సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో మ్యాచ్ ఇదే వేదికపై శనివారం జరుగుతుంది. టాస్ గెలిచిన టీమిండియా ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 197 పరుగుల భారీ స్కోరు సాధించింది. రేణుక సింగ్ తొలి ఓవర్లోనే వరుస బంతుల్లో సోఫీ డంక్లీ, అలీస్ క్యాప్సీలను అవుట్ చేసింది. 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడ్డ ఇంగ్లండ్‌ను డానియల్ వైట్ (47 బంతుల్లో 75; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాట్ సివర్ బ్రంట్ (53 బంతుల్లో 77; 13 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. మూడో వికెట్‌కు 138 పరుగులు జోడించి ఇంగ్లండ్ భారీ స్కోరుకు బాటలు వేశారు. భారత బౌలర్లలో రేణుక సింగ్ 27 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. 198 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లు ఆడి 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసి ఓడిపోయింది. షఫాలీ వర్మ (42 బంతుల్లో 52; 9 ఫోర్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (21 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ (3/15) భారత్‌ను కట్టడి చేసింది.



స్మృతిని అవుట్ చేసిన సివర్‌కు సహచరుల అభినందన

స్మృతి మంధాన క్లీన్‌బౌల్డ్

### స్కోరు వివరాలు

**ఇంగ్లండ్ ఇన్నింగ్స్:** సోఫియా డంక్లీ (బి) రేణుక సింగ్ 1; డానియల్ వైట్ (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) సైకా ఇషాక్ 75; అలీస్ క్యాప్సీ (బి) రేణుక సింగ్ 0; నాట్ సివర్ బ్రంట్ (సి) రిచా ఘోష్ (బి) రేణుక సింగ్ 77; హీతెర్ నైట్ (బి) శ్రేయాంక పాటిల్ 6; అమీ జోన్స్ (సి) జెమీమా (బి) శ్రేయాంక పాటిల్ 23; ఫ్రెయా కెంప్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 197. వికెట్ల పతనం: 1-2, 2-2, 3-140, 4-165, 5-177, 6-197. బౌలింగ్: రేణుక 4-0-27-3, పూజ 4-0-44-0, సైకా ఇషాక్ 4-0-38-1, దీప్తి శర్మ 3-0-28-0, శ్రేయాంక 4-0-44-2, కనిక అహుజా 1-0-12-0.

**భారత్ ఇన్నింగ్స్:** షఫాలీ వర్మ (సి) సారా గ్లెన్ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 52; స్మృతి మంధాన (బి) నాట్ సివర్ బ్రంట్ 6; జెమీమా రోడ్రిగ్స్ (సి) అమీ జోన్స్ (బి) ఫ్రెయా కెంప్ 4; హర్మన్‌ప్రీత్ కౌర్ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 26; రిచా ఘోష్ (సి) అలీస్ క్యాప్సీ (బి) సారా గ్లెన్ 21; కనిక అహుజా (సి) నాట్ సివర్ బ్రంట్ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 15; పూజ వస్త్రకర్ (నాటౌట్) 11; దీప్తి శర్మ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 21; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 159. వికెట్ల పతనం: 1-20, 2-41, 3-82, 4-122, 5-134, 6-151. బౌలింగ్: మహికా గౌర్ 2-0-18-0, లారెన్ బెల్ 4-0-35-0, నాట్ సివర్ బ్రంట్ 4-0-35-1, ఫ్రెయా కెంప్ 2-0-30-1, సోఫీ ఎకిల్‌స్టోన్ 4-0-15-3, సారా గ్లెన్ 4-0-25-1.

# 'నంబర్‌వన్' రవి బిష్ణోయ్

**ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్**



దుబాయ్: భారత జట్టు లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ కెరీర్‌లో గొప్ప ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 23 ఏళ్ల రవి బిష్ణోయ్ తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో రవి నాలుగు స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంక్ నుంచి టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు.ఆస్ట్రేలియాతో స్వదేశంలో గతవారం జరిగిన మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో రవి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. ప్రస్తుతం రవి ఖాతాలో 699 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. గతవారం వరకు టాప్ ర్యాంక్‌లో నిలిచిన అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 692 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. 679 పాయింట్లతో హసరంగ (శ్రీలంక) మూడో ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన మరో స్పిన్నర్ అక్షర్ పటేల్ ఏడు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్‌లో నిలిచాడు. టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ సూర్యకుమార్ యాదవ్ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

# ఒకే రోజు 15 వికెట్లు

**బంగ్లాదేశ్, న్యూజిలాండ్ రెండో టెస్టు**



ముష్ఫికర్

మిర్పూర్: స్పిన్నర్ల జోరుతో బంగ్లాదేశ్, న్యూజిలాండ్ మధ్య బుధవారం మొదలైన రెండో టెస్టులో 15 వికెట్లు నేలకూలాయి. ముందుగా ఆతిథ్య బంగ్లాదేశ్‌ను కట్టడి చేసిన కివీస్ ఆ తర్వాత కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 172 పరుగులకే ఆలౌటైంది. ముష్ఫికర్ రహీమ్ (35; 3 ఫోర్లు, 1 సిక్స్), షహాదత్ హుస్సేన్ (31; 2 ఫోర్లు) కొద్దిసేపు ప్రతిఘటించగలిగారు. కివీస్ బౌలర్లలో ఫిలిప్స్, సాన్‌ట్నర్ చెరో 3 వికెట్లు పడగొట్టగా, ఎజాజ్ పటేల్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం న్యూజిలాండ్ తొలి రోజు ఆట ముగిసేసరికి 12.4 ఓవర్లలో 55 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. లాథమ్ (4), కాన్వే (11), విలియమ్సన్ (13), నికోల్స్ (1) విఫలమయ్యారు. ప్రస్తుతం ఆ జట్టు మరో 117 పరుగులు వెనుకబడి ఉంది.

**ముష్ఫికర్ బంతిని అడ్డుకొని...**

బంగ్లాదేశ్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ అనూహ్య రీతిలో అవుటయ్యాడు. జేమీసన్ వేసిన ఇన్నింగ్స్ 41వ ఓవర్లో నాలుగో బంతిని డిఫెన్స్ ఆడాడు. అయితే ఆ వెంటనే ఆఫ్‌సైడ్ వెళుతున్న బంతిని తన చేత్తో ఆపే ప్రయత్నం చేశాడు. దాంతో కివీస్ అప్పీల్ చేసింది. రీప్లే చూసిన థర్డ్ అంపైర్ ముష్ఫికర్ ఉద్దేశపూర్వకంగా బంతిని ఆపేందుకు ప్రయత్నించినట్లుగా భావిస్తూ 'అవుట్'గా ప్రకటించారు. నిజానికి బంతి వికెట్ల వైపు కూడా రావడం లేదు. దానిని వదిలేసినా ఎలాంటి ఇబ్బందీ ఉండకపోయేది. కానీ అనూహ్యంగా అతని చేతులు బంతిని ఆపేందుకు ముందుకు వెళ్లిపోయాయి. నిబంధనల ప్రకారం ముష్ఫికర్ అవుట్‌ను 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్'గా అంపైర్ నమోదు చేశారు. గతంలో ఇలా చేస్తే దానిని 'హ్యాండిల్డ్ ద బాల్'గా గుర్తించేవారు. అయితే 2017లో మారిన ఐసీసీ నిబంధనల ప్రకారం దీనిని తొలగించి ఇలాంటి అవుట్‌ను 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' లోకి మార్చారు. ముష్ఫికర్ తాను అవుట్ కావడానికి ముందే ఒకసారి (29వ ఓవర్లో) కూడా ఇదే తరహాలో చేశాడు. అయితే అప్పుడు బంతికి చేయి తగలకపోవడంతో సమస్య రాలేదు. ఈ తరహాలో వెనుదిరిగిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా ముష్ఫికర్ గుర్తింపు పొందగా... గతంలో ఈ తరహాలో 13 మంది పెవిలియన్ చేరారు.

## ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి-సుమీత్ జోడీ



గువాహటి: స్వదేశంలో జరుగుతున్న గువాహటి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి (భారత్) జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో తెలంగాణకు చెందిన సిక్కి-సుమీత్ ద్వయం 20-22, 21-15, 21-16తో రఫ్లీ రమంద-ఇందా సరి జమీల్ (ఇండోనేసియా) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సాయిప్రణీత్ 21-14, 17-21, 7-21తో కువో కువాన్ లిన్ (చైనీస్ తైపీ) చేతిలో... తరుణ్ 11-21, 14-21తో జియా జెంగ్ జేసన్ (సింగపూర్) చేతిలో... ప్రణయ్ 12-21, 17-21తో కార్తికేయ (భారత్) చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో హైదరాబాద్ అమ్మాయి సామియా 21-12, 21-11తో తెలంగాణకే చెందిన గద్దె రుత్విక శివానిపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

## నైనా ఖాతాలో ఐదో విజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-13 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నైనా గొర్లి వరుసగా ఐదో విజయం నమోదు చేసి అజేయంగా నిలిచింది. బుధవారం జరిగిన నాలుగో రౌండ్‌లో వైజాగ్‌కు చెందిన నైనా 60 ఎత్తుల్లో మీరా సింగ్ (ఢిల్లీ)పై, ఐదో రౌండ్‌లో 80 ఎత్తుల్లో ఆముక్త (ఆంధ్రప్రదేశ్)పై గెలిచింది. ఐదో రౌండ్ తర్వాత నైనా ఐదు పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉంది. తెలంగాణకు చెందిన సంహిత పుంగవనం, బి.కీర్తిక 4.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. ఓపెన్ విభాగంలో తెలంగాణ కుర్రాడు చల్లా సహర్ష ఐదో రౌండ్ తర్వాత 4.5 పాయింట్లతో మరో ఎనిమిది మందితో కలిసి రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.

# సినిమా

## ఈ ఏడాది ముగింపులో మా సినిమా ఓ స్వీట్ - నాని



**"'హాయ్ నాన్న' చిత్రంలో వినోదం, అన్ని రకాల భావోద్వేగాలున్నాయి. ఈ చిత్రకథపై ఉన్న కాన్ఫిడెన్స్‌తో కచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని హీరో నాని అన్నారు. శౌర్యువ్ దర్శకత్వంలో నాని, మృణాల్ ఠాకూర్ జంటగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాని విలేకరులతో పంచుకున్న విశేషాలు.**

● 'హాయ్ నాన్న' కథని శౌర్యువ్ చెప్పినప్పుడే చాలా హై ఇచ్చింది. యాక్షన్ సినిమాల్లో ఒక రకమైన ఎనర్జీ ఉంటుంది. 'యానిమల్'తో సహా ఈ ఏడాది వచ్చిన చాలా యాక్షన్ సినిమాలు కావాల్సిన దానికంటే ఎక్కువగానే స్పైస్‌ని పంచాయి. అయితే స్పైసీ తర్వాత ఉండే ఆ స్వీట్‌ని మా సినిమా ఇస్తుంది. ఈ ఏడాది అన్ని ఐటమ్స్ పెట్టారు కానీ, ముగించే ఐటమ్ నేను పెడతాను (నవ్వుతూ). 'జెర్సీ' చూసి బయటికి వచ్చినప్పుడు ప్రేక్షకుల్లో ఒక రకమైన భావోద్వేగం ఉంటుంది. కానీ, 'హాయ్ నాన్న' చూసి, ప్రేక్షకులు హ్యాపీగా నవ్వుతూ బయటికి వస్తారు. ఈ ఆనందంలోనే మనసుని హత్తుకునే భావోద్వేగాలు ఉంటాయి. ● నాకు కంఫర్ట్ జోన్ అనేది ఏదీ లేదు. కామెడీ సినిమాలు చేసినప్పుడు అది నా కంఫర్ట్ జోన్ అన్నారు. తర్వాత 'జెర్సీ' చేసినప్పుడు ఎమోషన్ నా కంఫర్ట్ జోన్ అన్నారు. ఆ తర్వాత 'దసరా' లాంటి రా మూవీ చేశాను. నాకు కంఫర్ట్ జోన్ అనేది లేకుండా సినిమా చేయడానికి ప్రయత్నిస్తున్నాను. అలాగే నేను ఇమేజ్ కోణంలో చూడను. కథ నచ్చిందనే 'దసరా' చేశాను.. ఇప్పుడు 'హాయ్ నాన్న' చేశాను. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే సినిమాగా నిలుస్తుంది. ● ఇలాంటి ఓ మంచి సినిమాని ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లాలనే ప్రమోషన్స్ ఎక్కువగా చేశాం. అందులో భాగంగానే వెంకటేశ్‌గారిని ఇంటర్వ్యూ చేశా. ప్రమోషన్స్‌లో భాగంగానే హీరో శివరాజ్ కుమార్‌గారిని కలిశా. వెంకటేశ్‌గారు 'నా తర్వాత ఫ్యామిలీ హీరోగా ప్రేక్షకులు నిన్ను చూస్తారు' అన్నారు. మనల్ని ఎవరైనా ఫ్యామిలీ హీరో అన్నప్పుడు హ్యాపీగా ఉంటుంది.

● వైర ఎంటర్‌టైన్‌మెంట్‌కి 'హాయ్ నాన్న' తొలి చిత్రం. మోహన్ చెరుకూరి, విజయేందర్ రెడ్డిగార్లు ప్యాషనేట్ ప్రొడ్యూసర్లు. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ ఓ పాటలో మాత్రమే కనిపిస్తారు. ● నా 'దసరా' సినిమా దాదాపు రూ. 120 కోట్లు వసూలు చేసింది. నా తర్వాతి చిత్రాలు కూడా అదే స్థాయిలో కలెక్షన్స్ రాబట్టాలని ఆలోచిస్తూ కూర్చుంటే ఎక్కువ సినిమాలు చేయలేను. ● 'యానిమల్' లాంటి కథ వస్తే చేస్తాను. 'దసరా' చిత్రంలో నేను చేసిన పాత్రని ఎవరైనా ముందుగా ఊహించారా? చేశాకే బాగుందన్నారు. సవాల్‌తో కూడుకున్న పాత్రలు, కథలు వచ్చినప్పుడు చేయడానికే ఇష్టపడతాను. నాతో పని చేయాలని 'బలగం' వేణు అనుకుంటున్నారని 'దిల్' రాజుగారు చెప్పారు. వేణు వచ్చి నాకు కథ చెబితే తప్పకుండా చేస్తాను. ప్రస్తుతం 'సరిపోదా శనివారం' సినిమా చేస్తున్నాను. 'హిట్ 3' మూవీ స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. పూర్తయిన వెంటనే షూటింగ్ మొదలుపెట్టేస్తాం.



"గ్లోబల్ స్థాయికి వెళ్లాలని 'ఆర్ఆర్ఆర్', 'పుష్ప' సినిమాలను చేయలేదు. కథాబలం ఉండటంతో ఆ సినిమాలను జపాన్ వంటి ఇతర దేశాల ప్రేక్షకులూ ఆదరించారు. గ్లోబల్ అప్పీల్ ఉన్న కథ కోసం ఎదురు చూస్తూ ఉంటే టైమ్ వృథా అవుతుంది. నాకు వచ్చిన కథలు చేసుకుంటూ వెళ్తున్నాను. ఈ క్రమంలో పాన్ ఇండియా కథ ఏదైనా సెట్ అయితే ఓకే. అయినా నాకలాంటి పెద్ద పెద్ద ఆశలు లేవు. తెలుగులోనే సినిమాలు చేయాలని ఉంది" అని హీరో నితిన్ అన్నారు. నితిన్, శ్రీ లీల జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మించిన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్' రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో నితిన్ చెప్పిన విశేషాలు.

## ఈగోని పక్కన పెడితే ఆడియన్స్‌కి దగ్గరవుతాం - నితిన్

● 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్'లో నా పాత్రలో త్రీ షేడ్స్ ఉన్నాయి. కథ రీత్యా జూనియర్ ఆర్టిస్ట్‌గా కనిపిస్తాను. అలా అని ఈ సినిమాలో జూనియర్ ఆర్టిస్టుల కష్టాల గురించి చెప్పడం లేదు. ఆ పాత్ర నుంచి కామెడీ పండించాం. 'ఎక్స్‌ట్రా' చిత్రంలో ఇంట్రవెల్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. కథ కొత్తది కాకపోవచ్చు కానీ పాయింట్ చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా కథ విన్నప్పుడల్లా హాయిగా నవ్వుకున్నాను. కథ స్క్రీన్ మీదకు వచ్చినప్పుడు కూడా సేమ్ ఫీలింగ్. ● వక్కంతం వంశీగారి కథలతో వచ్చిన 'కిక్', 'రేసు గుర్రం', 'ఊసరవెల్లి', 'టెంపర్' చిత్రాలను గమనిస్తే హీరో క్యారెక్టరైజేషన్ కొత్తగా, విభిన్నంగా ఉంటుంది. 'ఎక్స్‌ట్రా' చిత్రంలోనూ ఇలానే ఉంటుంది. స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుంది. ● సినిమాలో రావు రమేశ్‌గారు నాకు తండ్రిగా నటించారు. ఆయనకు, నాకు మధ్య వచ్చే సీన్స్ వినోదాత్మకంగా ఉంటాయి. కొంత సెంటిమెంట్ కూడా ఉంటుంది. రాజశేఖర్‌గారు సెకండాఫ్‌లో వస్తారు. సందర్భానుసారంగా కామెడీ వస్తుంటుంది. ● సినిమాలో నేను జూనియర్ ఆర్టిస్టును కాబట్టి 'శ్రీమంతుడు', 'బాహుబలి' వంటి సినిమాల ప్రస్తావనతో కాస్త కామెడీ ఉంటుంది. వినోదం కోసమే ఇలా చేశాం. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి సినిమాల్లో వెంకటేశ్‌గారి పాత్రపై ఇతర పాత్రధారులు జోక్స్ వేస్తుంటారు. ఇమేజ్, ఈగోల గురించి ఆలోచించకుండా పాత్ర కోసం నటిస్తే ఆడియన్స్‌కు మరింత దగ్గర కావొచ్చు. ఈ విషయంలో నాకు వెంకటేశ్‌గారు స్ఫూర్తి. ● ప్రస్తుతం వెంకీ కుడుముల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. ఈ చిత్రంలో శ్రీ లీల హీరోయిన్. అలాగే వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' సినిమా చేస్తున్నాను. కథ నచ్చితే గ్రే షేడ్ (కాస్త నెగటివ్ టచ్ ఉన్న పాత్రలు) ఉన్న పాత్రలు చేయడానికి రెడీగా ఉన్నాను.

## ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే..!



● నాగార్జున

'నా సామి రంగ' ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే' అంటున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'నా సామి రంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ ఓ హీరోయిన్‌గా నటిస్తుండగా, కావ్యా థాపర్ మరో హీరోయిన్ అని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నాగార్జున పాల్గొంటుండగా, సంక్రాంతి నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్‌ల నేతృత్వంలో చిత్రీకరిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా నుంచి 'ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే' పాటను, అతి త్వరలో ప్రోమోను రిలీజ్ చేయనున్నట్లు వెల్లడిస్తూ, కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు కీరవాణి సంగీత దర్శకులు. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి రిలీజ్ కానుంది.

## నిర్మాణం అంటేనే సవాల్ - నిర్మాత శరత్ మరార్



''దూత' వెబ్ సిరీస్‌ని అమేజాన్ సంస్థ వారు 38 భాషల్లో సబ్ టైటిల్స్‌తో 240 దేశాల్లో విడుదల చేశారు. వీక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో నాగచైతన్య, విక్రమ్, నేను.. ఇలా 'దూత' టీమ్ అంతా చాలా ఆనందంగా ఉన్నాం'' అన్నారు నిర్మాత శరత్ మరార్. నాగచైతన్య హీరోగా విక్రమ్ కె. కుమార్ దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'దూత'. నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ మరార్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 1 నుంచి అమేజాన్ ప్రైమ్‌లో ప్రసారమవుతోంది. ఈ సందర్భంగా శరత్ మరార్ మాట్లాడుతూ- ''విక్రమ్ చెప్పిన 'దూత' ఆలోచన, కథాంశం చాలా నచ్చింది. ఈ కథకి నాగచైతన్యనే మొదటి ఎంపిక. ఆయనకు ఇది తొలి వెబ్ సిరీస్. కథ వినగానే చేద్దామన్నారు. సినిమా, వెబ్ సిరీస్.. ఏదైనా నిర్మాణం అనేది సవాల్‌తో కూడుకున్న వ్యాపారం. ప్రస్తుతం నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రెండు చిన్న బడ్జెట్ సినిమాలు నిర్మిస్తున్నాను'' అన్నారు.

## జోరుగా వినోదం



● విరాజ్ అశ్విన్, బుచ్చిబాబు, అనుప్రసాద్

విరాజ్ అశ్విన్, పూజిత పొన్నాడ జంటగా నటించిన యూత్‌ఫుల్ అండ్ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'జోరుగా హుషారుగా..'. అనుప్రసాద్ దర్శకత్వంలో నిరీష్ తిరువిధుల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు విడుదల చేసి, ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉందని, సినిమాలో మంచి కంటెంట్ ఉందనిపిస్తోందని పేర్కొని, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది. పూర్తి వినోదాత్మక చిత్రం'' అన్నారు అనుప్రసాద్, నిరీష్.

## అప్పుడు ప్యాషన్.. ఇప్పుడు బాధ్యత - మంచు మనోజ్



● వివేక్ కూచిభొట్ల, మంచు మనోజ్

''ఇండస్ట్రీలో నాకు ఏడేళ్ల గ్యాప్ వచ్చింది. ఇందుకు నా అభిమానులు క్షమించాలి. నిజ జీవితంలో ఏడడుగులేసి ఇండస్ట్రీలోకి రీ ఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇంతకుముందు ప్యాషన్, గోల్‌తో సినిమాలు చేశాను. ఇప్పుడు ప్యాషన్‌తో పాటు బాధ్యతతో మళ్లీ వచ్చాను'' అని హీరో మంచు మనోజ్ అన్నారు. ఆయన హోస్ట్‌గా 'ఉస్తాద్-ర్యాంప్ ఆడిద్దాం' పేరిట సరికొత్త టాక్ షో వస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ టాక్ షో ఈ నెల 15 నుంచి ఈటీవీ విన్ ఓటీటీలో ప్రసారం కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'ఉస్తాద్-ర్యాంప్ ఆడిద్దాం' ప్రోమో రిలీజ్ వేడుకలో మంచు మనోజ్ మాట్లాడుతూ- ''ఇదొక సెలబ్రిటీ గేమ్ షో. ఎంతగానో అభిమానించే ఫ్యాన్ కోసం ఒక సెలబ్రిటీ ఆడే ఆట. ఈ ఆటలో సెలబ్రిటీ గెలుచుకున్న మొత్తాన్ని ఆ అభిమానికి ఇచ్చేస్తాం. ప్రైజ్ మనీ రూ. 50 లక్షలు, ప్రత్యేక బహుమతులు కూడా ఉంటాయి'' అన్నారు. ''ఫ్యాన్స్‌ని గెలిపించే షో ఇది. చాలా పెద్ద హిట్టవుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు వివేక్ కూచిభొట్ల. డైరెక్టర్ వంశీ, రచయిత బీవీఎస్ రవి, సాయి కృష్ణ, నితిన్ చక్రవర్తి, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా వధువు



● అలీ రెజా, నందు, పోలూరు కృష్ణ

అవికా గోర్ ప్రధాన పాత్రలో, నందు, అలీ రెజా కీలక పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'వధువు'. శ్రీకాంత్ మొహ్తా, మహేంద్ర సోని నిర్మాణంలో పోలూరు కృష్ణ రూపొందించిన ఈ వెబ్ సిరీస్ ఈ నెల 8 నుంచి హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ- ''ఓ కుటుంబంలోని సభ్యులందరూ ఎందుకు అనుమానాస్పదంగా కనిపిస్తారు? అనే అంశం 'వధువు'లో కొత్తగా ఉంటుంది. అవికా, నేను బెక్కెం వేణుగోపాల్ ప్రొడక్షన్స్‌లో ఓ సినిమా చేస్తున్నాం'' అన్నారు. ''ఈ సిరీస్‌లో నా పాత్ర చాలా సెటిల్డ్‌గా ఉంటుంది'' అన్నారు అలీ రెజా. ''బెంగాలీ సిరీస్ 'ఇందు'ను 'వధువు'గా రీమేక్ చేశాం. అయితే నేను సోల్‌ను మాత్రమే తీసుకున్నాను. మన నేటివిటీకి తగ్గట్లు మార్పులు చేశాం. సెకండ్ ఎపిసోడ్ నుంచి కథ మొదలవుతుంది. ఏడవ ఎపిసోడ్ కిక్ ఇచ్చేలా ఉంటుంది'' అన్నారు పోలూరు కృష్ణ.

## నిజాయితీ ప్రేమకథ

కిశోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి జంటగా శివశక్తి రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమకథ'. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేసి, సినిమా హిట్టవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ మట్టపల్లి మాట్లాడుతూ- ''ఒక నిజాయితీ ప్రేమకథతో మా సినిమా రూపొందింది. దాదాపు అందరూ కొత్తవాళ్లు నటించారు. త్వరలో మా సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''తెలుగులో నా తొలి సినిమా 'ప్రేమకథ'. రెగ్యులర్ ప్రేమకథలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది'' అన్నారు దియా సితెపల్లి.



● విజయ్ మట్టపల్లి, దియా సితెపల్లి, శివశక్తి రెడ్డి

## స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 358 | 69,654 |
| నిఫ్టీ ▲ | 83 | 20,938 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 14,246 | ▲ | 17 |
| డోజోన్స్ | 36,164 | ▲ | 39 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,515 | ▲ | 26 |
| డాక్స్ | 16,656 | ▲ | 123 |
| షాంఘై | 2,969 | ▼ | 3 |
| నికాయ్ | 33,446 | ▲ | 670 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ (రూ.లలో)

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 క్యారట్) | 62,144 | ▼ 143 |
| బంగారం (99.5 క్యారట్) | 61,895 | ▼ 143 |
| వెండి (కేజీ) | 74,268 | ▼ 115 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.60 | 84.27 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 103.73 | 107.17 |
| € | యూరో | ఎస్‌బీఐ | 88.56 | 91.61 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 55.79 | 57.51 |
| AUS$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 53.82 | 56.18 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 61.38 | 63.37 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.29 | 22.86 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.82 | 23.55 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.52 | 12.49 |

## నేటి నుంచి అజియో బిగ్ బోల్డ్ సేల్




బెంగళూరు: ప్రముఖ ఫ్యాషన్ ఈ–టెయిలర్ అజియో 'బిగ్ బోల్డ్ సేల్' ప్రకటించింది. భారీ ఆఫర్లతో డిసెంబర్ 7 (నేటి)నుంచి ఈ సేల్‌ను ప్రారంభించనుంది. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులపై పెద్ద ఎత్తున డిస్కౌంట్ అందించనుంది. 5500కు పైగా బ్రాండ్‌లకు చెందిన 16 లక్షలకు పైగా స్టైల్స్‌పై 50–90% రాయితీలు ఇస్తున్నట్లు కంపెనీ తెలిపింది. సేల్స్ సమయంలో ఉత్తమ షాపింగ్ చేసిన వారు ప్రతి 8 గంటలకు ఐఫోన్ 14 ప్రో, యాపిల్ మ్యాక్‌బుక్ ఎయిర్, శాంసంగ్ గెలాక్సీ ఫోల్డ్ 4, శాంసంగ్ ఎస్23 అల్ట్రా స్మార్ట్‌ఫోన్లు గెల్చుకోవచ్చు. ప్రత్యేకమైన డీల్‌లు అందించేందుకు ప్రతి రోజూ సూపర్ అవర్ ఉంటుంది.

## 1,000కి పైగా చార్జింగ్ స్టేషన్స్: కియా



ముంబై: వాహన తయారీ సంస్థ కియా ఇండియా దేశవ్యాప్తంగా చార్జింగ్ నెట్‌వర్క్ విస్తృతం చేస్తోంది. 1,000కిపైగా కేంద్రాలను ఇప్పటికే ఏర్పాటు చేసింది. ఇవి ఎక్కడ ఉన్నాయో మైకియా యాప్‌లో కె–చార్జ్ ఫీచర్ ద్వారా కస్టమర్లు సులభంగా తెలుసుకోవచ్చని కంపెనీ తెలిపింది. చార్జ్ పాయింట్ ఆపరేటర్స్ అయిన స్టాటిక్, చార్జ్‌జోన్, రీలక్స్ ఎలక్ట్రిక్, లియాన్ చార్జ్, ఈ–ఫిల్‌తో కియా చేతులు కలిపింది. ఇతర బ్రాండ్ల ఈవీలను వినియోగిస్తున్న వారు సైతం ఈ కేంద్రాల్లో చార్జింగ్ సదుపాయాన్ని పొందవచ్చని కంపెనీ బుధవారం ప్రకటించింది.

## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 7-12-2023 | |
|---|---|
| విశాఖ | 540–00 |
| చిత్తూరు | 543–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 540–00 |
| విజయవాడ | 540–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **6-12-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 525–00 |
| వరంగల్ | 527–00 |
| రిటైల్ ధర | 5.85 |

# వాహనాల చారిత్రక రికార్డు

- నవంబర్‌లో గరిష్ట స్థాయి అమ్మకాలు
- రోడ్డెక్కిన 28,54,242 వాహనాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా నవంబర్‌లో వాహనాల రిటైల్ అమ్మకాలు సరికొత్త రికార్డులు సృష్టించాయి. ప్యాసింజర్, ద్విచక్ర వాహనాల విక్రయాలు జోరుగా సాగడమే ఇందుకు కారణమని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) తెలిపింది. 'దేశంలో గత నెలలో అన్ని వాహన విభాగాల్లో కలిపి రిటైల్‌లో 28,54,242 వాహనాలు రోడ్డెక్కాయి. 2022 నవంబర్‌తో పోలిస్తే ఇది 18% ఎక్కువ. ఒక నెలలో ఈ స్థాయి అమ్మకాలు నమోదు కావడం భారత చరిత్రలో ఇదే తొలిసారి. ఇప్పటి వరకు అత్యధికంగా 2020 మార్చిలో 25.69 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ప్యాసింజర్ వెహికిల్స్ 17 % దూసుకెళ్లి 3,60,431 యూనిట్లను తాకాయి. ద్విచక్ర వాహనాలు 21% ఎగసి 22,47,366 యూనిట్లకు చేరుకున్నాయి' అని ఫెడరేషన్ తెలిపింది.

**రెండు విభాగాలు మినహా..**

2020 మార్చి గరిష్ట అమ్మకాలతో పోలిస్తే టూ వీలర్లు గత నెలలో 1.77 లక్షల యూనిట్లు ఎక్కువగా నమోదయ్యాయి. 'ప్యాసింజర్ వెహికిల్స్ 2022 అక్టోబర్‌లో నమోదైన గరిష్ట విక్రయాలతో పోలిస్తే 4,000 ఎక్కువగా అమ్ముడయ్యాయి. దీపావళి జోష్‌తో ప్యాసింజర్ వెహికిల్స్ అధిక సంఖ్యలో రోడ్డెక్కాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి డిమాండ్, కొత్త మోడళ్ల రాక, ఎంపిక చేసుకోవడానికి విస్తృత శ్రేణి టూ వీలర్ల అమ్మకాలను పెంచింది. త్రిచక్ర వాహనాల విక్రయాలు 23 శాతం ఎగసి 99,890 యూనిట్లకు చేరుకున్నాయి. ట్రాక్టర్లు 21 శాతం క్షీణించి 61,969 యూనిట్లు, వాణిజ్య వాహనాలు 2 శాతం తగ్గి 84,586 యూనిట్లకు వచ్చి చేరాయి' అని ఫెడరేషన్ వివరించింది.

## హింద్ జింక్ రెండో డివిడెండ్

**షేరుకి రూ. 6 చొప్పున చెల్లింపు**




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2023–24) మెటల్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఇందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వేదాంతా గ్రూప్ కంపెనీ వెల్లడించింది. రూ. 2 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 6(300%) చొప్పున చెల్లించనుంది. కంపెనీ ఇంతక్రితం ఈ ఏడాది జులైలో తొలిసారి రూ. 7 చొప్పున డివిడెండును ప్రకటించింది. కాగా.. తాజా డివిడెండు చెల్లింపునకు రూ. 2,535 కోట్లకుపైగా వెచ్చించనున్నట్లు కంపెనీ తెలియజేసింది. ప్రపంచంలోనే జింక్ ఉత్పత్తికి అతిపెద్ద సమీకృత కంపెనీగా నిలుస్తున్న హింద్ జింక్ రుణ భార తగ్గింపులో భాగంగా వివిధ బిజినెస్‌ల విడదీతకు ప్రణాళికలు వేసిన విషయం విదితమే. వీటిలో భాగంగా జింక్‌సహా లెడ్, సిల్వర్, రీసైక్లింగ్ బిజినెస్‌లను ప్రత్యేక సంస్థలుగా ఏర్పాటు చేయనుంది.

డివిడెండు నేపథ్యంలో హింద్ జింక్ షేరు నామమాత్ర లాభంతో రూ. 326 వద్ద ముగిసింది.

# లిథియంపై శ్రీ సిమెంట్ కన్ను

- లిథియం వేలంలో బిడ్‌పై కసరత్తు
- ఆస్ట్రేలియా కంపెనీతో భాగస్వామ్యం!




ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం శ్రీ సిమెంట్ లిమిటెడ్ ఛత్తీస్‌గఢ్‌లో లిథియం మైనింగ్‌పై కన్నేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ప్రణాళికల్లో భాగంగా నిర్వహించనున్న లిథియం వేలంలో మైనింగ్ హక్కుల కోసం బిడ్ వేయాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. లిథియం మైనింగ్ వేలం ద్వారా ప్రభుత్వం 5 బిలియన్ డాలర్లకుపైగా సమకూర్చుకునే వీలున్నట్లు అంచనా. ఈ బాటలో జమ్ము అండ్ కశ్మీర్(జేఅండ్‌కే)లో సైతం కంపెనీ లిథియం మైనింగ్ బ్లాకుల హక్కుల కోసం దరఖాస్తు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ 5.9 మిలియన్ టన్నుల లిథియం నిల్వలున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో అంచనాలు వెలువడ్డాయి. వెరసి తొలిసారి ఈ విభాగంలో ప్రవేశిస్తున్న నేపథ్యంలో బిడ్‌లో పేర్కొనవలసిన ధర(ప్రీమియం) తదితరాలపై ఆస్ట్రేలియా మైనింగ్ నిపుణులను కంపెనీ ప్రతినిధులు సంప్రదిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇదేవిధంగా జేఅండ్‌కే లిథియం నాణ్యత, గ్రేడ్లపై సలహాలను సైతం ఆశిస్తున్నట్లు వెల్లడించాయి. ఒకవేళ ఇక్కడ లిథియం బ్లాకులను గెలుపొందితే.. రిఫైనరీ ఏర్పాటుకు వీలుగా సాంకేతిక సహకారం కోసం ఆస్ట్రేలియన్ కంపెనీతో జట్టు కట్టనున్నట్లు తెలియజేశాయి. ఇందుకు 60–70 కోట్ల డాలర్లు(రూ. 5,800 కోట్లవరకూ) వెచ్చించాల్సి ఉంటుంది. గత వారమే కేంద్ర ప్రభుత్వం లిథియం సహా కీలక మినరల్స్ వేలానికి రంగం సిద్ధం చేసింది. వివిధ ప్రాంతాలలోని 100 బ్లాకులకుగాను తొలి దశలో భాగంగా 20 బ్లాకులకు తెరతీయనున్నట్లు తెలుస్తోంది.

**2 శాతం కార్లు**

గతేడాది (2022–23)లో విక్రయమైన 39 లక్షల కార్లలో 2% ఎలక్ట్రిక్ వాహనాలే. 2030కల్లా మొత్తం కార్ల అమ్మకాల్లో వీటి వాటా 30 శాతానికి పుంజుకోనున్నట్లు అంచనా. కాగా.. ప్రధాని మోదీ సర్కారు ఈ ఏడాది జూన్‌లో 30 కీలక మినరల్స్‌ను గుర్తించింది. శుద్ధ ఇంధనాల కోసం సిద్ధం చేసిన ఈ జాబితాలో లిథియం, నికెల్, టైటానియం, టంగ్‌స్టన్ తదితరాలున్నాయి.

శ్రీ సిమెంట్ షేరు ఎన్ఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 27,900 వద్ద ముగిసింది.

# బుల్ రన్ కొనసాగెన్..

- మూడో రోజు కొత్త రికార్డు నమోదు
- 70,000 దిశగా సెన్సెక్స్
- 21 వేల స్థాయి చేరువలో నిఫ్టీ
- ఇంధన, ఐటీ షేర్లకు డిమాండ్



ముంబై: వరుసగా ఏడో రోజూ లాభాల జోరు కొనసాగించిన స్టాక్ సూచీలు బుధవారమూ సరికొత్త శిఖరాలపై ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు కలిసొచ్చాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల తగ్గుదలతో ఇంధన షేర్లు, వచ్చే ఏడాది మార్చిలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను కోత ఉండొచ్చనే అంచనాలతో ఐటీ షేర్లు రాణించాయి. ఉదయం ఉత్సాహంగా మొదలైన సూచీలు రోజంతా లాభాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 449 పాయింట్లు బలపడి 69,745 వద్ద, నిఫ్టీ 107 పాయింట్లు ఎగసి 20,962 వద్ద కొత్త జీవితకాల గరిష్ట స్థాయి నమోదు చేశాయి. మార్కెట్ ముగిసే సరికి సెన్సెక్స్ 358 పాయింట్లు లాభపడి 69,654 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 83 పాయింట్లు పెరిగి 20,938 వద్ద నిలిచింది. ఈ ముగింపు కూడా సూచీలకు వరుసగా మూడో రోజూ సరికొత్త గరిష్ట స్థాయి కావడం విశేషం.


రికార్డుల ర్యాలీలోనూ ఫార్మా, టెలికం, ప్రైవేట్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.80 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.1,372 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 5 పైసలు పెరిగి 83.32 వద్ద స్థిరపడింది.

''దేశంలో రాజకీయ స్థిరత్వం కొనసాగే సూచనలు కనిపిస్తున్న తరుణంలో స్థూల ఆర్థిక వృద్ధిపై అంచనాలు పెరిగాయి. ఆర్‌బీఐ ఈసారీ కీలక వడ్డీ రేట్లను పెంచకపోవచ్చు. చైనా క్రెడిట్ రేటింగ్ తగ్గింపు, క్రూడాయిల్ ధరలు తగ్గుదల పరిణామాలతో విదేశీ ఇన్వెస్టర్లు భారత ఈక్విటీలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు'' అని జియోజిత్ ఫైనాన్స్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- సెన్సెక్స్ 358 పాయింట్లు పెరగడంతో బీఎస్ఈలో 2.17 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఆల్‌టైం హై రూ.348.64 లక్షల కోట్ల వద్ద ముగిసింది.
- హిమాద్రి స్పెషాలిటీ కెమికల్స్ 3.58% పెరిగి రూ.301 స్థిరపడింది. రానున్న 5–6 ఏళ్లలో రూ.4,800 కోట్లతో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కంపెనీ తెలపడంతో షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదున్నర శాతానికి పైగా లాభపడి రూ.307 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- ఇంధన పరివర్తన ఆవిష్కరణలపై 2030 నాటికి 75 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుందని చైర్మన్ గౌతమ్ అదానీ తెలపడంతో గ్రూప్‌లోని 8కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ 20% పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 17% పెరిగింది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ విద్యుత్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ షేర్లు 4–7% లాభపడ్డాయి. మరోవైపు ఏసీసీ 2.59%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.50%, అంబుజా సిమెంట్స్ 1.50% నష్టపోయాయి.

## హిమాద్రి స్పెషాలిటీ రూ. 4,800 కోట్ల పెట్టుబడులు

**లిథియం అయాన్ బ్యాటరీ భాగాల ఫ్యాక్టరీ ఏర్పాటు**



న్యూఢిల్లీ: లిథియం అయాన్ బ్యాటరీ (ఎల్ఐబీ) భాగాల తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు కోల్‌కతా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే హిమాద్రి స్పెషాలిటీ కెమికల్ వెల్లడించింది. ఇందుకోసం వచ్చే 5–6 ఏళ్లలో రూ. 4,800 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని అంతర్గత నిధులు, రుణ రూపంలో సమకూర్చుకోనున్నట్లు వివరించింది. ఎల్ఐబీ పరికరాల ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2,00,000 టన్నులుగా ఉంటుందని పేర్కొంది. పటిష్టమైన వృద్ధి అవకాశాలున్న వర్ధమాన రంగంలో కార్యకలాపాలు విస్తరించడం ద్వారా వాటాదారులకు మరింత ప్రయోజనం చేకూర్చాలనేది తమ లక్ష్యమని హిమాద్రి స్పెషాలిటీ వివరించింది. ఈ ప్లాంటుతో దేశ, విదేశ ఎలక్ట్రిక్ వాహనాలు, శక్తి నిల్వ సిస్టమ్‌లకు (ఈఎస్ఎస్) దేశీయంగా తయారైన ఎల్ఐబీ ముడి వస్తువులను సరఫరా చేయొచ్చని పేర్కొంది. హిమాద్రి స్పెషాలిటీ కెమికల్ ప్రధానంగా పారిశ్రామిక అవసరాల కోసం కార్బన్ బ్లాక్, బ్యాటరీ భాగాలు, స్పెషాలిటీ ఆయిల్స్, రిఫైన్డ్ నాఫ్తలీన్ మొదలైనవి ఉత్పత్తి చేస్తుంది.

## మహీంద్రా వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా.. అన్ని రకాల ప్యాసింజర్, వాణిజ్య వాహనాల ధరలను పెంచుతోంది. కొత్త ధరలు 2024 జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఎస్‌యూవీలు, కమర్షియల్ వెహికిల్ మోడళ్లనుబట్టి ధరల పెంపు ఉంటుందని కంపెనీ బుధవారం ప్రకటించింది. ద్రవ్యోల్బణం, ముడిసరుకు వ్యయాలు అధికం అవుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

---

## భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్: మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### త్రివిధ దళాల్లో మిలిటరీ నర్సింగ్ సర్వీస్

సాయుధ బలగాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్సెస్‌లో షార్ట్ సర్వీస్ కమిషన్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మిలిటరీ నర్సింగ్ సర్వీస్ 2023–24.. ప్రకటన విడుదలైంది. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఎంఎస్సీ(నర్సింగ్)/పోస్ట్ బేసిక్ బీఎస్సీ(నర్సింగ్)/బీఎస్సీ(నర్సింగ్) ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. **వయసు:** 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.12.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.12.2023
» **వెబ్‌సైట్:** www.indianarmy.nic.in

### డీఆర్‌డీవో హైదరాబాద్‌లో 11 పోస్టులు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ స్టోర్ ఆఫీసర్–01, ప్రాజెక్ట్ సీనియర్ అడ్మిన్ అసిస్టెంట్–05, ప్రాజెక్ట్ అడ్మిన్ అసిస్టెంట్–05.
» **అర్హత:** డిగ్రీ(బీఏ/బీకాం/బీఎస్సీ/బీసీఏ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. »**వయసు:** 56 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2023
» **వెబ్‌సైట్:** drdo.gov.in

### సీఆర్ఐఎస్, న్యూఢిల్లీలో 18 అసిస్టెంట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పోస్టులు

న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్(సీఆర్ఐఎస్).. అసిస్టెంట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(ఏఎస్ఈ)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంసీఏ, ఎంఈ/ఎంటెక్‌తో పాటు గేట్–2023లో అర్హత సాధించి ఉండాలి. » **వయసు:** 20.12.2023 నాటికి 22 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.63,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారాదరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**20.12.2023
» **వెబ్‌సైట్:** https://cris.org.in

### ఐపీఆర్, గాంధీనగర్‌లో 22 టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు

గాంధీనగర్(గుజరాత్)లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్(ఐపీఆర్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌తో టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22
» **విభాగాలు:** కంప్యూటర్, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఎంఎస్సీ(ఇంజనీరింగ్) ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.12.2023
» **వెబ్‌సైట్:** www.ipr.res.in

### పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 31 పోస్టులు

పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31
» **పోస్టులు:** డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్–ఇన్‌స్టిట్యూషనల్ కేర్, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్, అకౌంటెంట్, సోషల్ వర్కర్, డేటా అనలిస్ట్, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అవుట్‌రీచ్ వర్కర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, నరసరావుపేట, పల్నాడు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.12.2023.
» **వెబ్‌సైట్:** https://palnadu.ap.gov.in

### సౌత్ ఈస్టర్న్ రైల్వేలో 1785 యాక్ట్ అప్రెంటిస్‌లు

కోల్‌కతా(పశ్చిమ బెంగాల్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–సౌత్ ఈస్టర్న్ రైల్వే ఎస్ఈఆర్ పరిధిలోని డివిజన్‌లలో యాక్ట్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1785
» **ఆర్ఆర్‌సీ వర్క్‌షాప్‌లు:** ఖరగ్‌పూర్ వర్క్‌షాప్, సిగ్నల్ అండ్ టెలికాం (వర్క్‌షాప్)(ఖరగ్‌పూర్), ట్రాక్ మెషిన్ వర్క్‌షాప్(ఖరగ్‌పూర్), ఎస్ఎస్ఈ (వర్క్స్)/ఇంజనీరింగ్(ఖరగ్‌పూర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ డిపో(ఖరగ్‌పూర్), డీజిల్ లోకో షెడ్(ఖరగ్‌పూర్), సీనియర్ డీఈఈ(జి) (ఖరగ్‌పూర్), టీఆర్‌డీ డిపో/ఎలక్ట్రికల్(ఖరగ్‌పూర్), ఈఎంయూ షెడ్/ఎలక్ట్రికల్(టీపీకేఆర్), ఎలక్ట్రిక్ లోకో షెడ్(సంత్రగచి), సీనియర్ డీఈఈ(జి) (చక్రధర్‌రావు) తదితరాలు.
» **అర్హత:** పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ట్రేడ్‌లు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్, ఎంఎంటీఎం, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, లైన్‌మ్యాన్.
» **వయసు:** 1.1.2024 నాటికి 15నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.12.2023.
» **వెబ్‌సైట్:** www.rrcser.co.in

# ఫ్యూచర్ కెరీర్.. ప్రాంప్ట్ ఇంజనీర్!

» ఏఐ విప్లవంతో ప్రాంప్ట్ ఇంజనీర్లకు డిమాండ్
» డిగ్రీ, ప్రోగ్రామింగ్‌పై పట్టుతో కెరీర్ అవకాశాలు
» అప్‌కమింగ్ కెరీర్‌గా ప్రాంప్ట్ ఇంజనీరింగ్

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. చాట్ జీపీటీ. టెక్ రంగంలో గత కొంతకాలంగా చర్చనీయాంశాలు! చాట్ జీపీటీ, ఏఐ టూల్స్ ఆధారంగా అవసరమైన సమాచారాన్ని తక్షణమే పొందుతున్న సంగతి తెలిసిందే! ఆ సమాచారం వ్యక్తులు, సంస్థలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకునేందుకు దోహదపడుతోంది. దీంతో చాట్ జీపీటీ, ఏఐ టూల్స్ సాంకేతికత యువతకు సరికొత్త కెరీర్ మార్గంగా ముందుకొచ్చింది. ఆ ఫ్యూచర్ కెరీర్.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్!! ఈ నేపథ్యంలో.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ అంటే ఏమిటి.. అందివస్తున్న కెరీర్ అవకాశాలు.. అవసరమవుతున్న నైపుణ్యాలపై ప్రత్యేక కథనం..**




కెరీర్ ట్రెండ్స్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుందనే ఆందోళన ఓవైపు నెలకొంది. కానీ.. ఏఐ టూల్స్ సమర్థవంతంగా పనిచేయాలంటే..అందుకు ప్రత్యేక నైపుణ్యాలున్న మానవ వనరులు తప్పనిసరి. మరోవైపు ఏఐలో ప్రత్యేక విభాగాలు ఆవిష్కృతం అవుతున్నాయి. ఈ కోవలో కొత్తగా వినిపిస్తున్న జాబ్ ప్రొఫైల్.. ప్రాంప్ట్ ఇంజనీర్. టెక్నాలజీ రంగంలో ప్రవేశించాలనుకునే వారు దీన్ని మరో కొత్త అవకాశంగా భావించి అడుగులు వేస్తే.. చక్కటి కెరీర్ సొంతమవుతుంది అంటున్నారు టెక్ నిపుణులు.

### అదే ప్రాంప్ట్ ఇంజనీరింగ్

ప్రాంప్ట్ అంటే.. సత్వర స్పందన! వ్యక్తులు ఏఐ ద్వారా అడిగే ప్రశ్నలకు కచ్చితమైన సమాచారాన్ని సత్వరమే ఇచ్చే విధంగా సదరు టూల్స్‌ను తీర్చిదిద్దడమే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్. ఒక విభాగానికి సంబంధించి వినియోగదారులు ఎలాంటి ప్రశ్నలు అడగొచ్చు? ఎలాంటి ప్రశ్నకు ఎలాంటి సమాధానం ఇవ్వాలి? ఏ భాషలో ప్రశ్నలు అడిగితే.. ఎలా స్పందించాలి? తదితర అంశాలను ముందుగానే గుర్తించి.. దానికి అనుగుణంగా ఏఐ టూల్స్‌ను సమర్థవంతంగా రూపొందించే వారే ప్రాంప్ట్ ఇంజనీర్లు!! అంటే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ద్వారా కచ్చితత్వంతో కూడిన సమాధానాలను వినియోగదారులకు అందించే అవకాశం లభిస్తుంది.

### పరిష్కార మార్గంగా

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ సంస్థలు ఏఐ ఆధారిత సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే. వ్యక్తులు సైతం తమకు అవసరమైన సమచారం కోసం చాట్ జీపీటీ, గూగుల్ సెర్చ్ తదితర టూల్స్‌ను వినియోగిస్తున్నారు. తమ సందేహాల్ని ప్రశ్నగా అడిగినప్పుడు..చాట్ జీపీటీ, ఏఐ టూల్స్ ద్వారా అవసరమైన సమాచారం కళ్ల ముందు ప్రత్యక్షమవుతోంది. కొన్ని సందర్భాల్లో మనం అడిగే ప్రశ్నలు లేదా సమాచార ఇన్‌పుట్ సరిగా లేకపోతే కచ్చితత్వంతో కూడిన సమాధానం లభించదు. దీంతో సంబంధిత వ్యక్తులు గందరగోళానికి గురయ్యే పరిస్థితి నెలకొంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా తెరపైకి వచ్చిన సాంకేతికతే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్.

### ఏఐ టూల్స్ డిజైనింగ్

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో.. ఏఐ టూల్స్ డిజైనింగ్, స్ట్రక్చరింగ్, ప్రోగ్రామింగ్, కోడింగ్‌లను రూపొందించడం చాలా కీలకం. ఇందులో నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, నేచురల్ లాంగ్వేజ్ అండర్ స్టాండింగ్ వంటి వాటిని వినియోగిస్తారు. ఆయా భాషలకు సంబంధించిన అంశాలను లోతుగా విశ్లేషిస్తారు. వీటన్నింటి ద్వారా ఏఐ మోడల్స్ ఆధారంగా వినియోగదారులు అడిగే ప్రశ్నలకు కచ్చితత్వంతో కూడిన సమాచారం, సమాధానం ఇచ్చేలా సదరు ఏఐ టూల్స్‌ను రూపొందిస్తారు.

### ఈ రెండు నైపుణ్యాలు

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో కెరీర్ కోరుకునే వారికి ప్రధానంగా రెండు నైపుణ్యాలు ఉండాలి. అవి.. ప్రోగ్రామింగ్, డేటా అనాలిసిస్. ఎందుకంటే.. ఏఐ టూల్స్ సమర్థంగా పని చేయాలంటే.. అందుకు తగిన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌ను రూపొందించాల్సి ఉంటుంది. అదే విధంగా.. ఆయా సంస్థలకు సంబంధించిన సేవలు, ఉత్పత్తులు, వినియోగదారుల డేటాను విశ్లేషించాల్సి ఉంటుంది. ఈ విశ్లేషణ ఆధారంగా సదరు ఉత్పత్తులకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని సిద్ధం చేయడానికి వీలవుతుంది. అందుకే ప్రాంప్ట్ ఇంజనీర్‌గా కెరీర్ కోరుకునే వారికి డేటా అనాలిసిస్ నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. దీంతోపాటు ప్రోగ్రామింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, టీమ్ వర్కింగ్ నైపుణ్యాలుంటే.. ప్రాంప్ట్ ఇంజనీర్‌గా మరింత సమర్థవంతంగా రాణించే అవకాశం ఉంటుంది.

### అకడమిక్ నేపథ్యం

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో కెరీర్ కోరుకునే వారికి అకడమిక్‌గా టెక్నికల్ నేపథ్యం ఉంటే మేలు. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్‌లలో బీటెక్ పూర్తి చేసిన వారు ఈ జాబ్ ప్రొఫైల్‌కు సరితూగుతారని పేర్కొనొచ్చు. వీరికి ప్రోగ్రామింగ్, కోడింగ్‌పై పట్టు ఉంటుంది. కాబట్టి వీరు ప్రాంప్ట్స్(సత్వర స్పందనలు) రూపకల్పనలో ముందంజలో నిలిచే ఆస్కారం ఉంటుంది.

### సర్టిఫికేషన్స్ తోడుగా

ప్రాంప్ట్ ఇంజనీర్‌గా కెరీర్ కోరుకునే వారు నిర్దేశిత సర్టిఫికేషన్స్ పూర్తి చేయడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. నెట్‌వర్క్ సెక్యూరిటీ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సర్టిఫైడ్ సెలీనియం ప్రొఫెషనల్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, యాక్సెసబిలిటీ టెస్టింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, పైథాన్, డేటా సైన్స్ వంటి విభాగాల్లో సర్టిఫికేషన్స్ పూర్తి చేసుకుంటే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో కెరీర్స్ సొంతం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ కోర్సులను ఉడెమీ, కోర్సెరా, ఎడ్యురేక వంటి సంస్థలు అందిస్తున్నాయి. అదే విధంగా పలు ఐటీ సంస్థలు తమ సిబ్బందికి ప్రాంప్ట్ ఇంజనీరింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నాయి.

### పెరుగుతున్న డిమాండ్

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఏఐ టెక్నాలజీ, చాట్‌బోట్, ఇతర వర్చువల్ అసిస్టెంట్ టూల్స్ వినియోగం పెరుగుతోంది. దీంతో ప్రాంప్ట్ ఇంజనీర్స్‌కు కెరీర్ అవకాశాలు విస్తృతమవుతున్నాయి. ఏఐ కాంట్రాక్ట్ రివ్యూ ఫర్మ్స్, ఫిన్‌టెక్, ఎడ్ టెక్, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రాంప్ట్ ఇంజనీర్లకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ పెరుగుతోంది. లింక్డ్‌ఇన్ సర్వే ప్రకారం –ఈ ఏడాది చివరినాటికి చాట్‌బోట్, చాట్ జీపీటీ, ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను వినియోగించే వారి సంఖ్య 2.5 బిలియన్లకు చేరుకోనుంది. ఆయా సంస్థలు ప్రాంప్ట్ ఇంజనీర్లను భారీ స్థాయిలో నియమించుకునే అవకాశముంది.

### నెంబర్ 1 న్యూ జాబ్

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక ప్రకారం–2023లో కొత్త ఉద్యోగాల్లో నెంబర్ 1 జాబ్‌గా ప్రాంప్ట్ ఇంజనీరింగ్ నిలిచింది. 2025 నాటికి మొత్తం ఏఐ ఉద్యోగాల్లో ప్రాంప్ట్ ఇంజనీరింగ్ కొలువుల వాటా 30 శాతం మేరకు ఉంటుందని వెల్లడైంది.

### వేతనాలు ఆకర్షణీయం

ప్రాంప్ట్ ఇంజనీర్లకు సంస్థలు ఆకర్షణీయ వేతనాలను అందిస్తున్నాయి. ఎంట్రీ లెవల్‌లో ఏడాదికి రూ.ఆరు లక్షల వరకు; రెండు నుంచి అయిదేళ్ల అనుభవంతో మిడిల్ లెవల్‌లో కనిష్ఠంగా రూ.ఆరు లక్షలు గరిష్ఠంగా రూ.12 లక్షల వార్షిక వేతనం పొందే అవకాశం ఉంది.

- **ముఖ్యమైన సర్టిఫికేషన్స్:** నెట్‌వర్క్ సెక్యూరిటీ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సర్టిఫైడ్ సెలీనియం ప్రొఫెషనల్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, యాక్సెసబిలిటీ టెస్టింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, పైథాన్, డేటా సైన్స్.
- **అవసరమైన నైపుణ్యాలు:** డేటా అనాలిసిస్, ప్రోగ్రామింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, నేచురల్ లాంగ్వేజ్ స్కిల్స్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, నేచురల్ లాంగ్వేజ్ అండర్ స్టాండింగ్ స్కిల్స్, రీసెర్చింగ్ స్కిల్స్.

# 'నల్ల తామర'కు ముకుతాడు!

- మిరప పంటకు కొన్నాళ్లుగా తీవ్ర నష్టం కలిగిస్తున్న నల్ల తామర
- దాన్ని తట్టుకునే లక్షణాలున్న 9 మిరప రకాలను గుర్తించిన డబ్ల్యూవీసీ శాస్త్రవేత్తలు



సాక్షి, సాగుబడి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో మిరప రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న నల్ల తామరను తట్టుకునే మిరప రకాలను రూపొందించుకునే పరిశోధనల్లో వరల్డ్ వెజిటబుల్ సెంటర్ (డబ్ల్యూవీసీ) గణనీయమైన పురోగతి సాధించింది. తైవాన్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న డబ్ల్యూవీసీ దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధనా స్థానం పటాన్‌చెరులోని ఇక్రిశాట్ ఆవరణలో ఉంది. ఈ కేంద్రంలో సాగులో ఉన్న నల్లతామరను తట్టుకునే 9 మిరప రకాలతో కూడిన ప్రదర్శన క్షేత్రాన్ని ఆసియా అండ్ పసిఫిక్ సీడ్ అసోసియేషన్(ఏపీఎస్ఏ)కు చెందిన 50 ప్రైవేటు విత్తన కంపెనీల ప్రతినిధులు పరిశీలించారు. విత్తన కంపెనీలతో కలసి నల్లతామర, తదితర చీడపీడలను చాలావరకు తట్టుకునే సరికొత్త సంకర వంగడాలను రూపొందించనున్నట్లు డబ్ల్యూవీసీ ఇండియా కంట్రీ డైరెక్టర్ అరవఝి సెల్వరాజ్ తెలిపారు. త్వరలో చేపట్టనున్న బ్రీడింగ్ ప్రాజెక్టు ద్వారా ఆ వంగడాలను రూపొందించనున్నట్లు వెల్లడించారు.

**ఇండోనేసియా నుంచి మన దేశంలోకి**

ప్రపంచంలో మిరపను అత్యధిక విస్తీర్ణంలో పండిస్తూ, వినియోగిస్తూ, ఎగుమతి చేస్తున్న దేశం భారత్. అంతేకాకుండా దేశంలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న రెండో పెద్ద కూరగాయ పంట కూడా మిరపనే. దేశవ్యాప్తంగా సుమారు 7.30 లక్షల హెక్టార్లలో సాగవుతోంది. ఇండోనేసియా నుంచి బొప్పాయి ద్వారా మన దేశంలోకి ప్రవేశించిన నల్ల తామర 2015 నుంచి మిరపను ఆశించి విధ్వంసం సృష్టిస్తోంది. గత రెండు, మూడేళ్లుగా ఏపీ, తెలంగాణ సహా పది రాష్ట్రాల్లో మిరప తోటలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. నల్ల తామర తాకిడిని తట్టుకోవడానికి తరచూ పురుగుమందులు పిచికారీలు చేసినా దిగుబడి నష్టం 40–50 శాతం ఉంటుంది.

**తదుపరి పరిశోధనలు చేపట్టాల్సి ఉంది**



తైవాన్‌లోని డబ్ల్యూవీసీ పరిశోధనా కేంద్రంలో నల్ల తామరను తట్టుకునే లక్షణాలు 7 రకాల మిరప వంగడాల్లో ఉన్నాయి. పటాన్‌చెరు కేంద్రంలో మరో 2 మిరప రకాలను గుర్తించాం. ఈ 9 రకాలపై రెండేళ్లుగా పరిశోధనలు చేయగా, ఇందులో 6 రకాల్లో నల్ల తామరను తట్టుకునే లక్షణాలు కనిపించాయి. ఈ లక్షణాలకు కారణమైన జన్యువులను, వాటికి సంబంధించిన మార్కర్లను కనిపెట్టాలి. ఇందుకు ఆసక్తి గల స్థానిక ప్రైవేటు విత్తన కంపెనీలతో కలసి తదుపరి దశ పరిశోధనలు సాగించాల్సి ఉంది. ఈ పరిశోధనలన్నీ పూర్తయి నల్లతామరను చాలా మటుకు తట్టుకునే మెరుగైన మిరప విత్తనాలు రైతులకు చేరటానికి మరో మూడు, నాలుగేళ్ల సమయం పడుతుంది.

–డా.నల్లా మనోజ్‌కుమార్, అసిస్టెంట్ సైంటిస్ట్, డబ్ల్యూవీసీ, ఇక్రిశాట్ ఆవరణ, పటాన్‌చెరు

# ముమ్మరంగా 'శనగ'.. పుంజుకోని వరి

- 6 లక్షల ఎకరాల్లో 'యాసంగి' సాగు
- ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయశాఖ నివేదిక



సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 6.03 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు కాగా, 10.99 శాతం విస్తీర్ణంలో పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ వివరించింది. గత యాసంగి సీజన్‌లో కూ డా ఈ సమయానికి ఇదే స్థాయిలో పంటలు సాగు అయ్యాయి. ఇప్పటివరకు సాగైన వాటిల్లో అత్యధికంగా పప్పు ధాన్యాల పంటలు సాగయ్యాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, అందులో ఇప్పటివరకు 2.17 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వాటిల్లో శనగ 1.94 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. ఇక వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2.77 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1.55 లక్షల ఎకరాల్లో (56.19%) సాగైనట్లు పేర్కొంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 5.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.42 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 1.02 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 16,216 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది వరి అధికంగా సాగవుతుందని అంచనా వేస్తున్నారు. వరి సాధారణ సాగు లక్ష్యం 40.50 లక్షల ఎకరాలు కాగా, ఇంకా నాట్లు పుంజుకోలేదని వ్యవసాయ శాఖ తెలిపింది. ఇప్పటివరకు కేవలం 19,613 ఎకరాల్లోనే వరి నాట్లు పడ్డాయని పేర్కొంది.

# బురదలో దిగబడిన అంబులెన్స్

## గర్భిణి తరలింపు ఆలస్యం కావడంతో శిశువు మృతి



అంబులెన్స్‌ను లాక్కెళ్తున్న ట్రాక్టర్ (ఇన్‌సెట్లో) మృతి చెందిన శిశువు

ఏటూరునాగారం: గర్భిణిని తరలిస్తున్న అంబులెన్స్ బురద కారణంగా రోడ్డుపై దిగబడింది. ఆలస్యం కావడంతో గర్భిణి కడుపులోని శిశువు మృతిచెందింది. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రాంనగర్‌లో చోటు చేసుకుంది. రాంనగర్ గ్రామానికి చెందిన గర్భిణి బొల్లె రమ్యకు బుధవారం నొప్పులు రావడంతో భర్త సాయికిరణ్ 108కు ఫోన్ చేశాడు. రమ్యను తీసుకువెళ్లేందుకు వచ్చిన అంబులెన్స్ రాంనగర్ గ్రామం నుంచి ఏటూరునాగారం మీదుగా వచ్చే క్రమంలో జీడివాగు వద్ద అప్రోచ్‌రోడ్డుకు పోసిన మట్టి వర్షానికి బురదమయంగా మారి వాహనం జారిపోతుంది. మరో మార్గం అయిన కమలాపురం వైపు వెళ్తుండగా, అక్కడ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడం.. వర్షానికి మట్టి బురదగా మారడంతో అందులో అంబులెన్స్ దిగబడింది. దీంతో గ్రామస్తులు ట్రాక్టర్ ఇంజిన్ ద్వారా వాహనాన్ని బయటకు లాగారు. ఈ కారణంగా అంబులెన్స్ కమలాపురం నుంచి ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి చేరుకోవడంలో రెండు గంటలు ఆలస్యం అయింది. దీంతో గర్భంలోనే శిశువు మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. తొలుసూరి కాన్పు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే శిశువు మృతిచెందిందని, కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి శిక్షించాలని బంధువులు డిమాండ్ చేశారు.

# ఉంటుందా? పోతుందా?

**రిటైర్డ్ అధికారుల్లో గుబులు**

- ఏళ్ల తరబడి సర్వీసుల పొడిగింపు
- రిటైర్డ్ అధికారుల కొనసాగింపుపై గతంలో తీవ్ర విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్

పలు కీలక శాఖల్లో ఏళ్ల తరబడి కొనసాగిన రిటైర్డ్ అధికారుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో వీరికి కొనసాగింపు ఉంటుందా..? సాగనంపుతారా ? అంటూ అప్పుడే చర్చ మొదలైంది. విద్యుత్, నీటిపారుదల, ఆర్థిక శాఖ, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, జలమండలి, పౌరసరఫరాలు, మెట్రో రైలు వంటి కీలక ప్రభుత్వశాఖలు, విభాగాల్లో ఇంతకాలం ఉద్యోగ విరమణ చేసిన వారంతా పెత్తనం చేశారు. అయితే రిటైర్డ్ అధికారులను కీలక పోస్టుల్లో కొనసాగించడంపై రేవంత్‌రెడ్డి గతంలోనే తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో వీరి విషయంలో ఆయన తీసుకోనున్న నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**విద్యుత్ సంస్థల్లో రాష్ట్ర ఆవిర్భావం నుంచి వారే..**

తెలంగాణ జెన్‌కో సీఎండీగా 2014 జూన్ 6 నుంచి, అదే ఏడాది అక్టోబర్ 25 నుంచి ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతల్లో దేవులపల్లి ప్రభాకర్‌రావు కొనసాగారు. ఎన్నికల ఫలితాలొచ్చాక మరుసటి రోజే ఆయన రెండు పోస్టులకు రాజీనామా చేయగా, ఇంకా కొత్త వారిని నియమించలేదు. 2014 జూలై నుంచి టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీగా జి.రఘుమారెడ్డి, 2016 అక్టోబర్ నుంచి టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీగా ఎ.గోపాల్‌రావు వ్యవహరిస్తున్నారు. విద్యుత్ సంస్థల డైరెక్టర్లలో అత్యధికశాతం మంది తెలంగాణ ఆవిర్భావం నాటి నుంచి కొనసాగుతున్నారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు సీఎండీలు, డైరెక్టర్లు కొనసాగుతారని ప్రభుత్వం గతంలో ఉత్తర్వులిచ్చింది.



**ఈఎన్సీలు..**

నీటిపారుదలశాఖ ఈఎన్సీ సి.మురళీధర్‌రావు 2011లో ఉద్యోగ విరమణ చేసినా ఇంకా కొనసాగుతున్నారు. రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు సీఈ హమీద్ ఖాన్, అంతర్రాష్ట్ర వ్యవహారాల ఎస్ఈ కోటేశ్వర్‌రావు రిటైర్మెంట్ తర్వాత కూడా కొనసాగుతున్నారు. 2016 జూలైలో ఉద్యోగ విరమణ చేసిన హైదరాబాద్ జలమండలి ఈఎన్సీ/ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్యనారాయణరెడ్డి, 2017 నవంబర్‌లో ఉద్యోగవిరమణ చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎస్సీ కృపాకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీలో 2016 జూలైలో రిటైర్డ్ అయిన ఈఎన్సీ పి.రవీందర్‌రావు, 2017 ఫిబ్రవరిలో రిటైర్డ్ అయిన బి.గణపతి రెడ్డి, ఈఎన్సీ (స్టేట్ రోడ్లు) ఇంకా కొనసాగుతున్నారు.

**అ'విశ్రాంత' సేవలో మరికొందరు**

ఉద్యానవన శాఖ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి 2017 నవంబర్‌లో రిటైర్డ్ కాగా ఇంకా కొనసాగుతున్నారు. దేవాదాయ శాఖ కార్యదర్శి/ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి అనీల్‌కుమార్ మూడేళ్లుగా కొనసాగుతుండగా, ఆయన పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్‌గా రాజమౌళిని సైతం పునర్నియమించారు. ఇక పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అదర్ సిన్హా , యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్, శిల్పారామం ప్రత్యేకాధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ కిషన్‌రావు, మెట్రో రైలు ఎండీగా రిటైర్డ్ ఐఆర్ఏఎస్ అధికారి ఎన్వీఎస్ రెడ్డి, ఆర్థిక శాఖ ఓఎస్డీగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివశంకర్ చాలా ఏళ్లుగా కొనసాగుతున్నారు. ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ అధికారిగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రవీందర్, గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అధికారి ముత్యంరెడ్డి సైతం రిటైర్మెంట్ తర్వాత కూడా అవే పోస్టుల్లో ఉన్నారు.

**ఆ అధికారుల్లో చిగురించిన ఆశలు**

గత ప్రభుత్వంలో పెద్దల ఆశీస్సులున్న కొందరు అధికారుల విషయంలో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత తొలుత రెండేళ్ల కాలానికి సర్వీసు పొడిగించారు. ఆ తర్వాత ప్రతి రెండేళ్లకోసారి పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చేవారు. చివరకు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు(అన్‌టిల్ ఫర్‌దర్ ఆర్డర్) ఆ అధికారులే ఆయా పోస్టుల్లో కొనసాగుతారని జీఓలు సైతం జారీ చేశారు. రిటైర్డ్ అధికారులే కీలక పోస్టుల్లో కొనసాగుతుండడంతో సీనియారిటీ ప్రకారం అందాల్సిన అవకాశాలు కోల్పోతున్నామని సర్వీసు మిగిలి ఉన్న అధికారులు చాలా ఏళ్లుగా అసంతృప్తితో ఉన్నారు. కొత్త సర్కారు వచ్చిన నేపథ్యంలో రిటైర్డ్ అధికారులను ఇంటికి పంపిస్తే తమకు అవకాశాలు లభిస్తాయన్న ఆశతో ఉన్నారు.

# ఒక్క ఫైల్ బయటకు పోవద్దు!

- బయటి నుంచి ఒక్క ఫైల్ రావద్దు
- సచివాలయంలోకి ఫైళ్ల రాకపోకలపై ఆంక్షలు.. అన్ని శాఖలకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ పాలన బాధ్యతలు చేపట్టే వరకు రాష్ట్ర సచివాలయం నుంచి ఒక్క ఫైలు కూడా బయటకి వెళ్లడానికి వీల్లేదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ నెల 4న అన్ని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే బయటి నుంచి కూడా ఒక్క ఫైలు లోపలికి రావద్దని స్పష్టం చేశారు. మరోవైపు మంత్రుల పేషీలకు వెళ్లిన ఫైల్స్ అన్నీ వెనక్కి వచ్చాయా? అవి ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి? అలాగే సీఎంఓకు వెళ్లిన ఫైల్స్ ఎక్కడున్నాయి? అవి వెనక్కి వచ్చాయా? వంటి వివరాలను ఆరా తీయాలని సీఎస్ అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించినట్టు సమాచారం. ప్రధానంగా అధికార రహస్యాలకు సంబంధించిన ఫైల్స్‌ను సత్వరం స్వాధీనం చేసుకుని సురక్షితమైన కస్టడీలో ఉంచాలని కోరినట్టు తెలిసింది. రాష్ట్ర సచివాలయంలోకి బీఆర్ఎస్ నేతల రాకపోకలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించినట్టు సమాచారం. కాగా మంత్రులు, కార్యదర్శుల పేషీల నుంచి ఒక్క కాగితాన్ని కూడా బయటికి తీసుకెళ్లడానికి వీల్లేదనే ఆదేశాలున్న నేపథ్యంలో భద్రత విభాగం అధికారులు ప్రతి బ్యాగును క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానం వస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమిస్తున్నారు. మరోవైపు బుధవారం మంత్రుల పేషీలను శుభ్రం చేయించి తాళాలు వేయించారు. ఈ తాళపు చెవులను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**పెన్‌డ్రైవ్‌లు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకోండి**

తాజా మాజీ మంత్రులు పేషీలను ఖాళీ చేయడానికి ముందే వారి అనుచరులు, పీఏలు వచ్చి సామగ్రిని తీసుకెళ్లినట్టు చర్చ జరుగుతోంది. దీంతో అప్రమత్తమైన సీఎస్.. స్పెషల్ బ్రాంచ్ పోలీసులను రంగంలోకి దింపినట్టు సమాచారం. తనకు తెలియకుండా తాజా మాజీ మంత్రుల వ్యక్తిగత ఫైళ్లు, పత్రాలను బయటకి పంపవద్దని కూడా సీఎస్ ఆదేశించినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. అన్ని పేషీల్లోని పెన్‌డ్రైవ్‌లు, కంప్యూటర్లు, ఇతర డిజిటల్ వస్తువులను స్వాధీనం చేసుకోవాలని జీఏడీ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. మంత్రుల పేషీలను ఖాళీ చేస్తున్న సమయంలో ఫైల్స్ బయటికి వెళ్లకుండా తగు జాగ్రత్తలను తీసుకుంటున్న అధికారులు.. ఇప్పటికే కొన్ని కీలక ఫైల్స్ మాయమయ్యాయనే ఫిర్యాదుతో ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది.

# 'పుష్ప' నటుడు కేశవ అరెస్ట్

- యువతి ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసిన జగదీశ్
- వేధింపులు తట్టుకోలేక యువతి బలవన్మరణం



పంజగుట్ట: 'పుష్ప' సినిమాలో హీరో స్నేహితునిగా నటించి ఎంతో క్రేజ్ సంపాదించుకున్న నటుడు జగదీశ్ అలియాస్ కేశవ (మచ్చా) ఓ యువతి ఆత్మహత్యకు కారణమయ్యాడు. పంజగుట్ట పోలీసులు బుధవారం అతన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలిలా.. కాకినాడకు చెందిన యువతి ఓ సంస్థలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే, సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా నటిస్తుండేది. పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంగీత్‌నగర్‌లో అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌లో నివసిస్తుండేది. తల్లి దండ్రులు కాకినాడలోనే ఉండగా, ఆమెకు భర్తతో విడాకులు అయ్యాయి. కొంత కాలం కిందట ఆ యువతికి మణికొండలో నివసించే నటుడు జగదీశ్ పరిచయమయ్యాడు. పరిచయం కాస్తా ప్రేమగా మారి కొద్దిరోజులు లివింగ్ రిలేషన్‌లో ఉన్నారు. జగదీశ్ ఆ యువతిని కాదని మరో యువతిని వివాహం చేసుకోవడంతో ఆమె జగదీశ్‌ను దూరం పెట్టసాగింది. ఫోన్ చేసినా లిఫ్ట్ చేసేది కాదు.

**రహస్యంగా ఫొటోలు తీసి బ్లాక్ మెయిల్ చేసి**

ఈ క్రమంలో గత నెల 27న మహిళ నివసించే ఫ్లాట్ వద్దకు వచ్చిన జగదీశ్.. సదరు మహిళ మరో యువకునితో సన్నిహితంగా ఉన్న ఫొటోలను కిటికీలోనుంచి తీశాడు. ఆ తర్వాత డోర్‌కొట్టి లోనికి వెళ్లి మీ బాగోతం మొత్తం రికార్డ్ చేశానంటూ వారిని బెదిరించాడు. ఫొటోలు డిలీట్ చెయ్యాలని ఎంత బతిమిలాడినా వినలేదు. దీంతో ఆ యువతి, యువకుడు పోలీసులకు ఫోన్ చేస్తామనడంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు కూడా ఫోన్‌లో వేధించాడు. 29వ తేదీ ఉదయం ఆ యువతి మరొకరితో సన్నిహితంగా ఉన్న ఫొటో పంపించి.. ఇలాంటి ఫొటోలు ఇంకా చాలా ఉన్నాయనీ, అవన్నీ బయటపెడతానని బెదిరించాడు. దీంతో తీవ్ర ఆందోళన, ఒత్తిడికి గురైన యువతి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎలాంటి సూసైడ్ నోట్ లేకపోవడంతో ఆత్మహత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మరుసటిరోజు యువతి బంధువులు జగదీశ్ వేధింపులను పోలీసులకు వివరించగా ఆ మేరకు కేసు పెట్టారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు జగదీశ్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 23 నుంచి 2024, జనవరి 1వ తేదీ వరకు పది రోజుల పాటు జరుగనున్న వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం ఆలయ శుద్ధి, అనంతరం సంప్రోక్షణం, స్వామివారి మూలవిరాట్టుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.ఆ తర్వాత భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఈ కారణంగా ఆలయంలో అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.



# ఆకాశంలో దెయ్యం

పెద్దగా నోరు తెరుచుకుని మీదికొస్తున్న దెయ్యంలా.. చూడగానే వామ్మో అనిపించేలా ఉందికదా! ఇది ఏ గ్రాఫిక్స్ బొమ్మనో, సరదాగా సృష్టించిన చిత్రమో కాదు.. సుదూర అంతరిక్షంలోని ఓ భారీ గెలాక్సీ (నక్షత్రాల గుంపు) ఇది. నాసాకు చెందిన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ (జేడబ్ల్యూఎస్టీ) సాయంతో టెక్సాస్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ గెలాక్సీని గుర్తించారు. మన విశ్వం పుట్టుక తొలినాళ్లలోనే ఈ గెలాక్సీ ఏర్పడిందని.. అది భారీగా దుమ్ము, ఇతర ఖగోళ పదార్థాలతో నిండి ఉందని వారు తెలిపారు. విసిరివేసినట్టుగా ఉన్న ఆ ఖగోళ పదార్థాల నుంచి వేలాది కొత్త నక్షత్రాలు జన్మిస్తున్నాయని.. ఈ క్రమంలో దెయ్యం ముఖం వంటి ఆకృతి ఏర్పడిందని వివరించారు. అయితే జేమ్స్ వెబ్ టెలిస్కోప్ చిత్రాలు మసకగా ఉండటంతో.. ఓ చిత్రకారుడితో మరింత స్పష్టత వచ్చేలా మార్చామని వివరించారు.

**టుడేస్ గ్రాఫిక్** అత్యధిక మిలటరీ సబ్‌మెరైన్లు ఉన్న దేశాలు




# బాబుతో పవన్ భేటీ

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ బుధవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీపై తెలుగుదేశం , జనసేన పార్టీలు అధికారికంగా మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. పవన్‌కళ్యాణ్ గురువారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన ఘోర పరాజయం అనంతరం తొలిసారి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేముందు పవన్‌కళ్యాణ్.. చంద్రబాబుతో సమావేశం కావడంపై రాజకీయ శ్రేణుల్లోను, జనసేన నేతల్లోను రకరకాలుగా చర్చలు సాగుతున్నాయి. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమానికి చంద్రబాబును ఆహ్వానించారని వార్తలు రావడం, పవన్‌కళ్యాణ్ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మిత్రపక్షంగా పోటీచేసిన నేపథ్యంలో ఈ అంశంపైనా వీరి మధ్య ప్రధానంగా చర్చ జరిగి ఉండొచ్చని జనసేన నేతలు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో రెండుపార్టీలు ఉమ్మడిగా చేపట్టనున్న కార్యక్రమాలపైన కూడా చర్చించి ఉండొచ్చని అంటున్నారు.

# 2024 హజ్ షెడ్యూల్ విడుదల


- బుధవారం నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 20 వరకు దరఖాస్తుల స్వీకరణ
- హజ్‌హౌస్‌లో ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: హజ్ యాత్ర 2024 షెడ్యూల్‌ను కేంద్ర హజ్ కమిటీ విడుదల చేసింది. ఈ మేరకు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి నాంపల్లి హజ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...దరఖాస్తు స్వీకరణతో పాటు అన్ని ప్రక్రియలు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగానే జరుగుతాయన్నారు. బుధవారం నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 20వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కేంద్ర హజ్ కమిటీ ప్రకారం యాత్రికుల పాస్‌పోర్టు వ్యాలిడిటీ వచ్చే ఏడాది డిసెంబర్ 31 వరకు ఉండాలని పేర్కొన్నారు. 70 ఏళ్ల పైబడిన వారు దరఖాస్తు చేసుకుంటే డ్రా ద్వారా కాకుండా నేరుగానే యాత్రకు ఎంపికవుతారని, మిగిలిన వారికి డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తారని, మార్చి చివరి వారంలో డ్రా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం దరఖాస్తుదారు ఆధార్ కార్డు తప్పనిసరని తెలిపారు. జంట నగరాల యాత్రికుల కోసం నాంపల్లి హజ్‌హౌస్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 040 23298793 నంబర్ లేదా https:// www.hajcommittee.gov.inను సంప్రదించవచ్చన్నారు.

# 'అట్లూరి' మామూలోడు కాదు!

**చంద్రబాబు, లోకేశ్ వ్యవహారాలు చూసేవాడని ప్రచారం**

- టీడీపీ నేతలతోనూ సన్నిహిత సంబంధాలు
- పలు చీటింగ్ కేసుల్లో నిందితుడిగా సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు
- ఆర్బిట్రేషన్ పేరుతో విశాఖకు చెందిన సంస్థకు భారీ టోకరా
- అరెస్టు విషయం తెలియడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) నమోదైన ఫాస్ట్ మూవింగ్ కన్‌జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కేసులో అరెస్టు అయిన తెలుగు సినీ నిర్మాత అట్లూరి నారాయణరావుకు తెలుగుదేశం పార్టీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నట్టు వెలుగులోకి వచ్చింది. సదరు నారాయణరావు అయితే ఏకంగా తనకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు నారా లోకేశ్‌లతో సైతం సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెప్పుకునే వాడని తెలిసింది. వందల మంది నుంచి డిపాజిట్ల రూపంలో రూ.540 కోట్లు వసూలు చేసి నిలువునా మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్న ఈ స్కామ్‌లో గత వారం అరెస్టు అయిన నారాయణరావుని సీసీఎస్ పోలీసులు కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకున్నారు. బుధవారంతో కస్టడీ గడువు పూర్తవడంతో నాంపల్లి కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

**సినీ రంగంలోకి ప్రవేశించాకే మోసగాడిగా...**

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన నారాయణరావు అప్లైడ్ మాథమేటిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశాడు. బతుకుతెరువు కోసం హైదరాబాద్ వచ్చిన అతను కొన్నాళ్ళు ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేశాడు. బంజారాహిల్స్‌లోని ఆదిత్య హిల్‌టాప్ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తూ సినీ రంగంపై ఉన్న మోజుతో నిర్మాతగా మారాడు. 2018లో 'నీది నాది ఒకే కథ', 2022లో 'నచ్చింది గర్ల్ ఫ్రెండు'చిత్రాలు తీశాడు. దీనికి అవసరమైన డబ్బు కోసమే మోసాలు చేయడం మొదలెట్టాడు. శేరిలింగంపల్లిలోని తారానగర్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖకు 3 ఎకరాల భూమి ఉంది. ఖాళీగా ఉన్న ఈ భూమిపై కన్నేసిన నారాయణ రావు దాన్ని ఎవరికైనా అంటగట్టి సొమ్ము చేసుకోవాలని పథకం వేశాడు. ఎస్.రామాచార్యులు అనే వ్యక్తిని దీనికి యజమానిగా మార్చాడు. ఆ మేరకు నకిలీ పత్రాలు సృష్టించిన నారాయణరావు వాటి ఆధారంగా ఖైరతాబాద్‌లో ఎస్ఎంహెచ్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను నిర్వహించే బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి సయ్యద్ మహమూద్ హుస్సేన్‌ను సంప్రదించి ఆయన నుంచి రూ.1,65,12,500 కాజేశాడు. ఈ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది.

**'బాబు'ల వ్యవహారాలు చూసేవాడినంటూ..**

నారాయణరావుకు తెలుగుదేశం నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆ మేరకు నేతలతో దిగిన ఫొటోలను చూపించే వాడు. ఇక చంద్రబాబు, లోకేశ్‌తో సైతం తాను దగ్గరగా మెలుగుతుంటానని ప్రచారం చేసుకునేవాడు. తరచుగా చంద్రబాబు, లోకేశ్‌లను కలుస్తుంటాననీ, వారికి సంబంధించిన హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని వ్యవహారాలను పర్యవేక్షిస్తుంటానని చెప్పుకునే వాడని తెలిసింది. ఇతడి చేతిలో మోసపోయిన అనేక మంది బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయకపోవడానికి ఇదీ ఓ కారణమని తెలుస్తోంది.

**న్యాయ విభాగంలో పరిచయాలు ఉన్నాయంటూ...**

గడిచిన కొన్నాళ్ళుగా న్యాయ విభాగంలో తనకు మంచి పరిచయాలు ఉన్నాయంటూ చెప్పి నారాయణ రావు అనేక మంది నుంచి డబ్బు గుంజాడనే ఆరోపణలు ఉన్నాయి. ఎఫ్ఎంసీజీ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రాంబాబు, కృష్ణంరాజుకు ఇలానే చెప్పి వారి నుంచి నగదు, రూ.కోటి విలువైన బంగారం తీసుకున్నాడు. విశాఖపటాన్నికి చెందిన ఓ కంపెనీకి, కర్ణాటకకు చెందిన మరో కంపెనీకి మధ్య వివాదం నడుస్తోంది. విశాఖ కంపెనీ యజమానిని సంప్రదించిన నారాయణరావు తనకు న్యాయ విభాగంలో పలుకుబడి ఉందని నమ్మబలికాడు. ఆర్బిట్రేషన్ విధానంలో సమస్య పరిష్కరించడంతో పాటు నష్టం నివారిస్తానంటూ నమ్మించాడు. ఇలా వారి నుంచి భారీ మొత్తం తీసుకుని మోసం చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇతడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న విశాఖ కంపెనీ సంబంధీకులు బయటకు వచ్చి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.

**ఆ డబ్బుతోనే మరో సినిమా..**

ఎఫ్ఎంసీజీ కేసులో నారాయణరావును అరెస్టు చేసిన పోలీసులు ప్రాథమిక విచారణతో పాటు రెండు రోజుల పోలీసు కస్టడీ విచారణలో కీలక విషయాలు సేకరించారు. ఓ చార్టర్డ్ అకౌంటెంట్ ద్వారా రాంబాబుకు పరిచయమైన నారాయణరావు తన పలుకుబడి వినియోగించి కేసు లేకుండా చేస్తానని హామీ ఇచ్చాడు. ఇందుకు రూ.2 కోట్లు ఇవ్వాలంటూ అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు, కోటి విలువైన బంగారు ఆభరణాలు తీసుకున్నాడు. కానీ ఆ కేసు విషయంలో ఎలాంటి సహాయం చేయలేకపోయాడు. దీంతో ఇన్సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) దాఖలు చేసి బయటపడదామని రాంబాబుకు సలహా ఇచ్చి ఖమ్మం కోర్టులో అక్కడి న్యాయవాదితో దాఖలు చేయించే ప్రయత్నం చేశాడు. ఈలోగా బంగారు ఆభరణాలను పాతబస్తీలో కరిగించి రూ.90 లక్షలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నాడు. ఈ డబ్బుతోనే మరో చిత్ర నిర్మాణం ప్రారంభించాడు. ఇది ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బుధవారం నారాయణరావుకు వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇతడి వ్యవహారాలను మరింత లోతుగా ఆరా తీయాలని నిర్ణయించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. 